అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 09-09-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 201 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

పోరాటాల గొంతుకమూగబోయింది

- ఐద్వా పట్టణ అధ్యక్షులు సూర్ణపు సావిత్రమ్మ మృతి
- సీపీఐ(ఎం) సీనియర్ నేత సోమన్నకు సతీ వియోగం
- నివాళులు అర్పించిన పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య

10లో..



హైడ్రా దడ

ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

దాదాపు మాయమైన మాదాపూర్ సున్నం చెరువు

సున్నం చెరువును పూడ్చి..బోర్లు వేసి నీటి వ్యాపారం

అమీన్‌పూర్‌లో ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు నేలమట్టం

ఆదివారం తెల్లవారుజాము నుంచే కూల్చివేతలు

వివరాలు 11లో



వైద్యులను రక్షించలేం

హింసకు వ్యతిరేకంగా డాక్టర్లను కాపాడే విషయంలో కేంద్రం స్పష్టీకరణ : ఆర్టీఐ సమాచారంలో వెల్లడి

న్యూఢిల్లీ : దేశంలో వైద్య సంరక్షణ నిపుణులు, వైద్యులపై జరిగే హింసకు వ్యతిరేకంగా తీసుకునే చర్యలపై కేంద్రం మరోసారి తన వైఖరిని తెలిపింది. తాము ఎలాంటి ప్రత్యేక చట్టాన్నీ రూపొందించబోమని స్పష్టం చేసింది. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్రం ఈ విషయాన్ని వెల్లడించింది. ఇటీవల కోల్‌కతాలోని జూనియర్ డాక్టర్‌పై దారుణ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ...11లో



యూఎస్‌లో రాహుల్


మూడు రోజుల పర్యటన

స్వాగతం పలికిన ప్రవాసీ భారతీయులు, ఐఓసీ సభ్యులు

రెండు దేశాల బంధాన్ని బలోపేతం చేసే చర్చల కోసం ఆసక్తిగా చూస్తున్నా : రాహుల్ 11లో..







మళ్లీ వరద పోటు

మరోసారి ఎస్సారెస్పీ, సాగర్ గేట్లు ఎత్తివేత

ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలతో ఇప్పటికీ రాష్ట్రం తేరుకోలేదు. జలదిగ్బంధం నుంచి బయటపడినా..ఇంకా వరద బురద, ఇండ్లలో ఉన్న సామాన్లన్నీ దెబ్బతిన్నాయి.తినటానికి సరుకుల్లేక, పూట గడవక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలు మరింతగా భయాందోళనకు గురిచేస్తున్నాయి. ప్రాజెక్టులకు వరదపోటు ఉధృతమవుతోంది. నీటి ప్రవాహాలను కిందకు వదిలేస్తున్నారు. దీంతో మళ్లీ ముప్పు పొంచి ఉన్నదని ఇప్పటికే ముంపుల్లో ఉన్న ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వివరాలు 10లో

ఎగువ నుంచి ఉధృత ప్రవాహం

ప్రాజెక్టుల నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం

పలుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం

ఎక్కువ ప్రాంతాలకు మోస్తరు వర్ష సూచన

వివరాలు 11లో..

నలిమెల భాస్కర్‌కు కాళోజీ పురస్కారం

అందెశ్రీ నేతృత్వంలో కమిటీ ఎంపిక



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రముఖ సాహితీవేత్త, బహుభాషా కోవిదుడు నలిమెల భాస్కర్‌కు 2024 కాళోజీ నారాయణరావు సాహితీ పురస్కారం లభించింది. ఆయన జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా సాహితీ పురస్కారం అందిస్తోంది. ఈ ఏడాది అవార్డు గ్రహీత ఎంపిక కోసం అందెశ్రీ నేతృత్వంలో ఏర్పాటు చేసిన కమిటీ సిఫారసుల మేరకు భాస్కర్‌ను ...11లో

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు

మీడియా అకాడమీకి రూ.10 కోట్లు



వ్యవస్థలపై నమ్మకం పెంచేందుకు ప్రక్షాళన:

జేఎన్‌జే హౌసింగ్ సొసైటీకి భూపత్రాలను అందజేసిన సీఎం రేవంత్ రెడ్డి

మిగతా జర్నలిస్టులకు ఫ్యూచర్‌సిటీలో భాగస్వామ్యం చేస్తామని హామీ

సమస్యలను ప్రజాకోణంలో రాసేది కమ్యూనిస్టు పత్రికలే


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అర్హులైన ప్రతి జర్నలిస్టుకు న్యాయం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. వారందరిని ఫ్యూచర్ సిటీలో భాగస్వాములను చేస్తామని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సమాచార శాఖ, మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీకి (పేట్ బషీర్‌బాగ్) భూమికి సంబంధించిన హక్కు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ రుగ్మతలకు చికిత్స చేసే డాక్టర్లు జర్నలిస్టులని కొనియాడారు. అలాంటి జర్నలిస్టులు అనారోగ్యం బారిన పడకుండా నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి . ఇండ్ల స్థలాలు కేటాయించాలని నిర్ణయించినట్టు గుర్తుచేశారు. ఆరోగ్య భద్రత కూడా ...3లో

రైతు రుణమాఫీ సగం కూడా కాలేదు

సురేందర్‌రెడ్డిది ఆత్మహత్య కాదు..సర్కారు హత్యే

రైతులందరికి వెంటనే రుణమాఫీ చేయాలి : మాజీ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో సగం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అందరికీ రుణమాఫీ అయిందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పేవన్ని పచ్చి అబద్ధాలని ఆరోపించారు "తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలన రైతుల పాలిట యమపాశంగా మారింది. సురేందర్‌రెడ్డి ఆత్మహత్యే దానికి సాక్ష్యం. నా చావుకు కారణం క్రాప్ లోన్ మాఫీ కాకపోవడమేనని తన బ్యాంక్ పాస్ బుక్ మీద సూసైడ్ నోట్‌లో ఆయన స్పష్టంగా రాశారు" అని హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. పంద్రాగస్టు వరకే రైతులందరికి రుణమాఫీ చేశామని సీఎం అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రేషన్ కార్డుతో లింక్ లేదని అసెంబ్లీ సాక్షిగా సర్కార్ చెప్పిన మాటలన్ని అబద్ధాలేనని గుర్తు చేశారు. ప్రభుత్వం చెబుతున్న మాటలకు చేతలకు పొంతన లేదని స్పష్టమవుతుందోని అన్నారు. రేంత్‌రెడ్డి పాలనలో ఇప్పటి వరకు 475 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని విమర్శించారు. రుణ మాఫీకి రూ.49 వేల కోట్లని ఎన్నికల ముందు చెప్పిన సీఎం అసెంబ్లీలో ఆ మొత్తాన్ని రూ.31 వేల కోట్లకు కుదించారనీ, బడ్జెట్లో మాత్రం రూ.27 వేల కోట్లు మాత్రమే కేటాయించారని విమర్శించారు. తీరా అమలుకొచ్చేసరికి రూ.16 వేల కోట్లు మాత్రమే విడుదల చేశారని గుర్తు చేశారు. రైతు భరోసా అంతుచిక్కని సమస్యగా మారిందని ఎద్దేవా చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి మాటలకు, ముఖ్యమంత్రి మాటలకు పొంతన లేకుండా ఉందని విమర్శించారు. ప్రభుత్వం ఎన్నికల ముందిచ్చిన హామీ మేరకు వెంటనే రైతులందరికి ...11లో

రాజకీయాలకతీతంగా ఆదుకోవాలి



వరద బాధితులకు కేంద్రం అండగా ఉంటుంది

మంత్రి పొంగులేటితో కలిసి ఖమ్మంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పర్యటన

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

విపత్తులు వచ్చినప్పుడు రాజకీయాలకు అతీతంగా ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని, వరద బాధితులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, అన్ని రకాలుగా సహకారం అందిస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం రాకాసి తండాలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కిషన్ రెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆదివారం పర్యటించారు. వరద ప్రభావం గురించి బాధితులను అడిగి తెలుసుకున్న కిషన్‌రెడ్డి.. బియ్యం, నిత్యావసర వస్తువులతో పాటు రగ్గులు పంపిణీ చేశారు. అనంతరం పునరావాస కార్యక్రమాలను పర్యవేక్షించారు. రాష్ట్ర విపత్తు నిధులను వినియోగించుకొని బాధితులకు నిత్యావసర వస్తువులతో పాటు తాత్కాలిక నివాసాలు కల్పించాలని కోరారు. ప్రకృతి సృష్టించిన వైపరీత్యాలను అందరం కలిసి కట్టుగా ఎదుర్కోవాలన్నారు. ప్రభుత్వం యుద్ధ ...11లో



రైలు ప్రయాణం సురక్షితమా?

- జబల్‌పూర్‌లో పట్టాలు తప్పిన ఎక్స్‌ప్రెస్
- బీహార్ బక్సర్‌లో రెండుగా వీడిన బోగీలు

ఇటీవల .రైలు ప్రమాదాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. పట్టాలు తప్పటం..బోగీలు వీడిపోవటం లాంటి ఘటనలతో పాటు ఘోర ప్రమాదాల్లో ప్రాణాలు గాల్లోకలిసిపోతున్నాయి. అయితే రైలు ప్రయాణం ఎంత వరకు సురక్షితమనే ప్రశ్న తలెత్తుతోంది. తాజాగా మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. బీహార్ బక్సర్‌లో మగధ్ ఎక్స్‌ప్రెస్ రైలు కప్లింగ్ వీడిపోవటంతో రెండుగా కంపార్ట్‌మెంట్‌లు తెగిపోయాయి. చాలా దూరం అలానే ప్రయాణించాయి. అయితే ఈ రెండు ఘటనల్లో ప్రయాణికులు ప్రాణాలతో బయటపడటంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

వివరాలు 11లో



హర్యానా ఎన్నికల వేళ బీజేపీకి తలనొప్పి

మొదట కంగనా...

ఆ తర్వాత బ్రిజ్ భూషణ్ వంతు

హర్యానా ఎన్నికల్లో 3లో..

నష్ట నివారణ చర్యలకు దిగిన హై కమాండ్

రైతుల ఉద్యమంపై నోరు జారిన కంగనా

మీడియాకు దూరంగా ఉండాలంటూ బ్రిజ్ భూషణ్‌కు నడ్డా ఆదేశం

మున్నేరు నష్టం రూ.339 కోట్లు

మున్నేరు ఉప్పెనతో జనజీవనం కకావికలం అయింది. ఆర్థికంగా అనేక నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. ఆస్తి, ప్రాణనష్టం భారీ స్థాయిలో చోటు చేసుకుంది. రూ.339.46 కోట్ల విలువైన ప్రభుత్వ, ప్రయివేటు ఆస్తులు దెబ్బతిన్నట్టు ప్రాథమిక అంచనా వేశారు. ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీన సంభవించిన వర్షాలు, వరదలపై ఈనెల 6వ తేదీ వరకు అందిన సమాచారం ప్రకారం ఈ ప్రాథమిక అంచనాలను రూపొందించారు.

మౌలిక సదుపాయాలకు రూ.180 కోట్లు

రూ.111 కోట్ల విలువైన పంటలు నీటిపాలు

దెబ్బతిన్న ఇండ్లు 15వేలు..నష్టం రూ.10 కోట్లు

స్కూల్స్, హాస్పిటల్స్‌లాస్ రూ.9.23 కోట్లు

విద్యుత్‌శాఖకు రూ.7కోట్లు..మత్స్యసంపద రూ.4 కోట్లు

పశుసంపద రూ.కోటికి పైగా..వరదల్లో ఆరుగురు మృతి





నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వ అంచనాల ప్రకారం రోడ్లు, వంతెనలు, ఇతరత్ర మౌలిక సదుపాయాలు దెబ్బతినడంతో రూ.180 కోట్లు నష్టం వాటిల్లినట్టు తేల్చారు. రూ.111.87 కోట్ల విలువైన పంటలు దెబ్బతిన్నట్టు నిర్ధారించారు. విద్యుత్‌శాఖకు రూ.7కోట్ల నష్టం వాటిల్లింది. స్కూల్స్, హాస్పిటల్స్ దెబ్బతినడంతో రూ.11 కోట్ల నష్టం జరిగింది. 15,055 ఇండ్లలోకి నీరు చేరింది. తద్వారా రూ.9.78 కోట్ల నష్టం వాటిల్లిందని, పక్కా ఇండ్లతో పాటు 146 గుడిసెలు దెబ్బతినడంతో ...3లో

మరోసారి మున్నేరుకు వరద..?

ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ఖమ్మంలోని మున్నేరుకు వరద ప్రవాహం పెరుగుతోంది. ప్రస్తుతం 16 అడుగులకు చేరడంతో అధికారులు అప్రమత్తం అవుతున్నారు. ఆదివారం అర్ధరాత్రికి మళ్లీ వరద వచ్చే అవకాశం ఉండటంతో రెండు రోజుల పాటు వరద ప్రభావిత ప్రాంతాల్లోని రోడ్లన్నీ బ్లాక్ చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

కార్పొరేట్ అనుకూల బీజేపీని గద్దెదించాలి

ప్రజలకు కిసాన్, మజ్దూర్ మహా పంచాయత్ పిలుపు

సెప్టెంబర్ 28న షహీద్ భగత్ సింగ్ జయంతి

సెప్టెంబర్ 17న గ్రామాలు, పట్టణాల్లో కిసాన్, మజ్దూర్ సభలు

వివరాలు 3లో



నిర్మాణదశలో ఉన్న ఇండ్లను మాత్రమే కూలుస్తున్నాం

- ఇండ్లు, స్థలాల ఎంపికపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : హైడ్రా కమిషనర్ రంగనాథ్
- రెండు రోజుల్లో షెడ్‌ను తొలగిస్తాం : సినీనటుడు మురళీమోహన్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో అక్రమంగా నిర్మించిన పలు ఇండ్లు, షాపులు, తదితర నిర్మాణాలను ఆదివారం పలు చోట్ల కూల్చివేయగా, వీటిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. ఫ్టీఎల్, బఫర్‌జోన్‌లో అనుమతి లేకుండా నిర్మిస్తున్నారని, ఇప్పటికే నిర్మించిన ఇండ్లలో నివాసం ఉంటే, వాటిని కూల్చమని, నిర్మాణదశలో ఉన్న కొత్త వాటిని మాత్రమే కూల్చుతున్నట్టు తెలిపారు. నగరవాసులు ఇకపై తమ సొంత ఇంటి కలను సాకారం చేసుకొనే క్రమంలో అప్రమత్తంగా వ్యహరించాలని సూచించారు. ప్రధానంగా అపార్టుమెంట్లు, వ్యక్తిగత ఇండ్లతో పాటు స్థలాలు కొనుగోలు చేసే ముందు ఇవి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉందా లేదా అని ముందుగా ప్రజలు నిర్ధారించుకోవాలని తెలిపారు. సున్నం చెరువులో నిర్మించిన కొన్ని షెడ్లు వాణిజ్యపరంగా వినియోగిస్తున్నారని, గతంలో కూడా వాటిని కూల్చేశారని, అయినా నిర్మాణాలు చేపట్టడంతోనే ఇప్పుడు కూల్చేసినట్టు చెప్పారు. కాగా, హెచ్ఎండీఏ పరిధిలోని 7 జిల్లాల్లో చెరువుల పరిరక్షణ కోసం లేక్ ప్రొటెక్షన్ కమిటీ చైర్మెన్ బాధ్యతలను సైతం హైడ్రాకు అప్పగించడంపై ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇదే కాని జరిగితే.. హైదరాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్, గజ్వేల్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో చెరువుల ఆక్రమణలకు చెక్ పడనున్నదని తెలుస్తోంది.

రెండు రోజుల్లో షెడ్‌ను తొలగిస్తాం : హైడ్రా నోటీసులపై స్పందించిన మురళీమోహన్

టీడీపీ మాజీ ఎంపీ, టాలీవుడ్ ప్రముఖ నిర్మాత మురళీ మోహన్ హైడ్రా నోటీసులపై స్పందించారు. స్థానికుల ఫిర్యాదుతో హైడ్రా అధికారులు రంగలాల్ కుంట చెరువును పరిశీలించారు. బఫర్ జోన్‌లో మూడు అడుగుల మేరకు రేకుల షెడ్డు ఉన్నట్టు గుర్తించారు. బఫర్ జోన్‌లో 3 అడుగుల మేరకు రేకుల షెడ్ ఉన్నట్లు గుర్తించామని అధికారులు అంటున్నారని.. అందుకు హైడ్రా అధికారులు రావాల్సిన అవసరం ఏమీ లేదని.. ఆ షెడ్డును రెండు రోజుల్లో తామే కూలుస్తామని మురళీమోహన్ స్పష్టం చేశారు. కాగా గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని రంగలాల్ కుంట చెరువులో ఫుల్ ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లో నిర్మించిన నిర్మాణాలను తొలగించాలని జయభేరి నిర్మాణ సంస్థకు హైడ్రా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో మురళీమోహన్ స్పందించారు.

28న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు

- తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని యూనివర్సిటీలలో పనిచేస్తున్న టైమ్ స్కేల్, డైలీవేజ్, ఎన్ఎంఆర్, కంటింజెంట్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు జె.వెంకటేశ్, అధ్యక్షులు మెట్టు రవి, ప్రధాన కార్యదర్శి వి.నారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..జెన్‌టీయూ, అంబేద్కర్, కాకతీయ యూనివర్సిటీల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఈపీఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐదుశాతం ఐఆర్‌ను అన్ని వర్సిటీల్లో అమలు చేయాలనీ, కాకతీయ యూనివర్సిటీలోని పెండింగ్‌లో ఉన్న 81మంది నాన్‌టీచింగ్ సిబ్బంది పీఆర్‌సీని వెంటనే క్లియర్ చేయాలని కోరారు. వర్సిటీల్లోని నాన్‌టీచింగ్ డైలీవేజ్, ఎన్ఎంఆర్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ తదితర క్యాడర్లకు రెగ్యులర్ ఉద్యోగుల మూల వేతనాన్ని కనీస వేతనంగా నిర్ణయించాలని కోరారు. జీవో నెంబర్ 60 ప్రకారం కనీస వేతనాలు తప్పనిసరిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పదేండ్లు దాటిన వారిని టైం స్కేల్‌లో గుర్తించాలని విన్నవించారు. కాంట్రాక్టర్ మారితే సిబ్బందిని తొలగించే అన్‌ఫెయిర్ లేబర్ ప్రాక్టీసెస్‌ను మానుకోవాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ అయిన సిబ్బందికి రూ.7.5 లక్షల రిటైర్డ్ బెనిఫిట్స్ చెల్లించాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలనీ, గుర్తింపు, హెల్త్ కార్డులివ్వడంతో పాటు బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మహిళా ఉద్యోగులకు ఆరు నెలలతో వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం ఈ నెలంతా దశలవారీగా కార్యక్రమాలు చేపట్టాలనీ, 28న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

గల్ఫ్ సంక్షేమ విధానాన్ని రూపొందించండి

- వేం నరేందర్‌రెడ్డికి ఎమ్మెల్యేల వినతి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గల్ఫ్ సంక్షేమ బోర్డు, ఎన్ఆర్ఐ విధాన ప్రక్రియను వేగవంతం చేయాలని కాంగ్రెస్ ఎన్ఆర్ఐ ప్రతినిధి బృందం ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కోరింది. ఈమేరకు ఆదివారం ఆయన్ను కలిసి వినతిపత్రం సమర్పించింది. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి పి.వినయ్‌కుమార్‌రెడ్డి, ఎన్ఆర్ఐ విభాగం రాష్ట్ర చైర్మెన్ అంబాసిడర్ డాక్టర్ బీఎం వినోద్‌కుమార్, గల్ఫ్ జేఏసీ నేతలు మందభీంరెడ్డి, చెన్నమనేని శ్రీనివాసరావులతో ఆయనతో చర్చించారు. ఈనెల 17న గల్ఫ్ ప్రభావిత ప్రాంతాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రభుత్వం ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు.

వ్యవసాయ, అనుబంధ రంగాల విద్యార్థులకు మేలైన ఉపాధి

- డాక్టర్ ఆర్ సి అగ్రవాల్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వ్యవసాయ, అనుబంధ రంగాల్లో విద్యనభ్యసించిన విద్యార్థులు, శిక్షణ పొందిన యువతకు మేలైన ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ఆరోడీన్ కమిటీ సిఫార్సులు ఉన్నాయనీ, వారికి నైపుణ్య శిక్షణ, స్టార్టప్ వాతావరణం కల్పించేందుకు అనుగుణంగా విద్యలో మార్పులు చేసినట్టు భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్ సి అగ్రవాల్ తెలిపారు. హైదరాబాదులోని కన్హ శాంతి వనంలో భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి, హార్ట్ ఫుల్ నెస్ ఎడ్యుకేషన్ ట్రస్ట్, కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యాలయం, డాక్టర్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ఏర్పాటుచేసిన భారతీయ వ్యవసాయ వైస్ ఛాన్సలర్ల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు నైపుణ్యత ఎంతగా పెంచుకుంటే ఉపాధి అవకాశాలు అంతగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో వ్యవసాయ విద్యనభ్యసించిన వ్యవసాయ ఆధారిత ఉద్యోగాలు పుష్కలంగా ఉంటాయనీ, వ్యవసాయ విద్యార్థులకు మేలైన ఉపాధి అవకాశాలు ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ట్విన్ డిగ్రీలు, డ్యూయల్ డిగ్రీలు, జాయింట్ డిగ్రీలపై రూపొందించిన మార్గదర్శకాలపై చర్చించారు.

పాఠశాలల అభివృద్ధికి 'యూడైస్' ఆధారం!

- ఈ నెలాఖరులోగా పూర్తికి అధికారుల చర్యలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

పాఠశాలల్లో ప్రతి విద్యార్థీ యూడైస్‌లో నమోదు కావాల్సిందే. ఈ క్రమంలో విద్యాశాఖ అధికారులు విద్యార్థుల సంఖ్య తేల్చేందుకు చర్యలు చేపట్టారు. పాఠశాలలతోపాటు విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలన్నీ ఒకేచోట నమోదు చేయనున్నారు. ఈ నెలాఖరులోగా పూర్తి చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

> స్కూళ్లతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు వివరాల ఒకేచోట నమోదు

హైదరాబాద్ జిల్లాలో ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు 776 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలుండగా.. మరో 3వేల వరకు ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలున్నాయి. వీటిలో 7.58లక్షల మంది వరకు విద్యార్థులు ఉన్నారు. యూడైస్‌లో పాఠశాల స్థాయిలో సర్వం సమాచారాన్ని నిక్షిప్తం చేస్తున్నారు. ఈ సమాచారం ఆధారంగా విద్యాశాఖ ప్రణాళికలు రూపొందించనుంది. దీనికి అనుగుణంగా బడ్జెట్ కేటాయించి అమలు చేస్తారు. పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం, వివిధ రకాల నిధులను యూడైస్ ఆధారంగానే కేటాయిస్తారు.

మూడు గంటలకోసారి అప్‌డేట్

జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు ఇదివరకే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. 2021-22 వరకు యూడైస్‌గా కొనసాగగా.. గత విద్యా సంవత్సరం నుంచి యూడైస్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేశారు. ఏడాదికోమారు సమాచారం అప్‌డేట్ చేయగా.. ప్లస్‌లో మాత్రం మూడు గంటలకోమారు సాంకేతికత ఆధారంగా సమాచారం అప్‌డేట్ జరుగుతోంది. తద్వారా కచ్చితత్వం వెల్లడవుతోంది. ఈ వెబ్‌సైట్‌ను మూడు భాగాలుగా విభజించారు. పాఠశాల భౌతిక వసతులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మాడ్యుల్స్‌గా విభజించి సమాచారం నిక్షిప్తం చేస్తున్నారు. డిప్యూటీ ఈవోలు, ఐవోఎస్‌లు, హెచ్ఎంల నేతృత్వంలో నిర్వహణ కొనసాగుతోంది. పాఠశాలకు క్రీడా స్థలం ఉందా.. గదులెన్ని ఉన్నాయి.. ఇంకా ఏమేం అవసరం.. ఫర్నిచర్, ల్యాబ్, ఇతరత్రా సదుపాయాలు ఉన్నాయా.. అమలవుతున్న కార్యక్రమాలు.. తదితర అంశాలు వెబ్‌సైట్‌లో ఎప్పటికప్పుడూ అప్‌డేట్ చేస్తున్నారు.

ప్రతి విద్యార్థికీ 'పెన్' కేటాయింపు

యూడైస్ ప్లస్ అనే పోర్టల్ భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తుంది. దీనిలో ప్రతి సంవత్సరమూ అన్ని పాఠశాలల్లో భౌతిక వసతులు, విద్యార్థుల నమోదు, ఉపాధ్యాయుల, ఆర్థిక వివరాలు ప్రత్యేక పథకాలకు సంబంధించిన అంశాలను ప్రధానోపాధ్యాయులు నమోదు చేయాల్సి ఉంటుంది. క్రోడీకరించిన ఈ వివరాలను వివిధ పథకాల అమలుతో పాటు వాటి పర్యవేక్షణ, మూల్యాంకనానికి బడ్జెట్ కేటాయింపునకు పథకాల అమలులో పారదర్శకతకు కచ్చితత్వానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపయోగిస్తాయి. అంతేకాక యూడైస్ ప్లస్‌లో నమోదు చేసిన ప్రతి విద్యార్థికీ ఒక పర్మినెంట్ ఎడ్యుకేషన్ నెంబర్ కేటాయిస్తారు. దీని ద్వారా ఆ విద్యార్థి దేశవ్యాప్తంగా ఏఏ పాఠశాలలో ఏఏ తరగతులు చదివాడు కచ్చితంగా తెలుస్తోంది. అంతేకాక రాష్ట్ర ప్రభుత్వం కూడా యూడైస్‌లో నమోదైన విద్యార్థుల సంఖ్య ఆధారంగానే పాఠ్యపుస్తకాలు, రెండు జతల ఏకరూప దుస్తులు, నోటు పుస్తకాల పంపిణీ చేస్తుంది. గత సంవత్సరం నుంచి పదో తరగతి విద్యార్థుల నామినల్ రూల్స్ కోసం కూడా యుడైస్‌లో నమోదైన టెన్త్ విద్యార్థులను పరిగణలోకి తీసుకుంటున్నారు.

టీచర్లకు జాతీయ కోడ్ నెంబరు!

విద్యార్థుల మాదిరిగానే ఉపాధ్యాయులకు కూడా ఒక జాతీయ కోడ్ నెంబర్‌ను యూడైస్ కేటాయిస్తుంది. తద్వారా ప్రతి పాఠశాలలో కచ్చితంగా నమోదయ్యే విద్యార్థుల సంఖ్యతోపాటు ఉపాధ్యాయుల సంఖ్య కూడా తెలుస్తుంది. తద్వారా ఉపాధ్యాయ విద్యార్థుల నిష్పత్తి లెక్కించొచ్చు. ఈ విధంగా యూడైస్‌లో నమోదు చేసే వివరాలను అత్యంత గోప్యంగా, ప్రామాణికంగా నిర్వహించడానికి మండల విద్యా అధికారి కార్యాలయం నుంచి రాష్ట్ర సంచాలకుల కార్యాలయం వరకు వివిధ అంచెలలో సిబ్బందికి శిక్షణ పూర్తిచేస్తున్నారు. ఈ ప్రాముఖ్యత దృష్ట్యా అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా తమ పాఠశాలకు సంబంధించిన సమగ్ర వివరాలను యూడైస్ ప్లస్‌లో నిర్ణీత గడువు లోపల నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.రోహిణి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

మండలాల వారీగా శిక్షణ

ఈ వివరాల నమోదును ఎలా చేయాలో ప్రధానోపాధ్యాయులకు జిల్లా, మండల స్థాయిలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా స్థాయిలో డిప్యూటీ ఈవోలు, ఐవోఎస్‌లు, పాఠశాల కాంప్లెక్స్ హెచ్ఎంలకు శిక్షణ ముగియగా.. అన్ని పాఠశాలల హెచ్ఎంలకు మండల స్థాయిలో మండల కేంద్రాల్లో శిక్షణ దాదాపు పూర్తి చేశారు. ఇక కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి కేటాయించే పథకాలు, బడ్జెట్ యూడైస్‌లో నమోదైన పాఠశాలలు, విద్యార్థుల సంఖ్య ఆధారంగానే ఇవ్వనుంది. కాబట్టి అన్ని మేనేజ్‌మెంట్‌ల ప్రధానోపాధ్యాయులు దీనిని అత్యంత ప్రాముఖ్యత విషయంగా పరిగణించి తమ తమ పాఠశాలల వివరాలను ఈ యుడైస్ ప్లస్ పోర్టల్‌లో నమోదు చేసి.. సంబంధిత వివరాలను మండల విద్యాధికారి, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల సంతకంతో జిల్లా విద్యాశాఖకు అందజేయాల్సి ఉంటుంది.

ఇంజినీరింగ్ కాలేజీల నాన్‌టీచింగ్ సిబ్బందికి

తొలి పీఆర్సీ వర్తింపజేయాలి

- వయోపరిమితి 61 ఏండ్లకు పెంచాలి : భూపాల్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఇంజినీరింగ్ కాలేజీల నాన్‌టీచింగ్ సిబ్బందికి తొలి పీఆర్సీ వర్తింపజేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సీబీఐటీ కాలేజీలో సస్పెండ్ చేసిన ఆరుగురు ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీల నాన్ టీచింగ్ స్టాఫ్ ఫెడరేషన్(సీఐటీయూ అనుబంధం) విస్తృతస్థాయి సమావేశం కె.వి.సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ...నాన్‌టీచింగ్ సిబ్బంది వయోపరిమితిని 61 ఏండ్లకు పెంచాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కాలేజీ నాన్‌టీచింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారం విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఖమ్మం వరద బాధితుల సహాయం నిమిత్తం సమావేశంలో విరాళాలు సేకరించారు. సమావేశంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రుద్రకుమార్, నందగోపాల్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

నాన్‌టీచింగ్ స్టాఫ్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రమేశ్‌బాబు, కె.వి.సుబ్బారావు

తెలంగాణ ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీల నాన్ టీచింగ్ స్టాఫ్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా రమేశ్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా కె.వి.సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ ఫెడరేషన్ చీఫ్ ప్యాట్రన్‌గా ఎస్.వీరయ్య, గౌరవాధ్యక్షులుగా భూపాల్ ఉండనున్నారు.

కోశాధికారిగా వి.వెంకటేశ్, ఉపాధ్యక్షులుగా సంజీవ, ఐలయ్య, సంయుక్త కార్యదర్శులుగా రామకృష్ణ, అనురాధ, కార్యనిర్వాహక కార్యదర్శులుగా మహమ్మద్ ముజఫర్ అహ్మద్, కార్యవర్గ సభ్యులుగా విఠల్, మంజుల, నర్సింగరావు, అశోక్. ఎం.కృష్ణ, బి.యాదగిరి, వి.యాదగిరి, రాములు, ప్రేమలతారెడ్డి, జె.అనంత కృష్ణ, హేమకుమార్, మజీద్ జుబేర్, రత్నయ్య వెంకటయ్య ఉన్నారు.

'రవాణా' నిబంధనలు ఉల్లంఘిస్తే

అమెరికా తరహా శిక్షలు



- డ్రైవింగ్ లైసెన్సులూ రద్దు
- రవాణా ఉద్యోగులకు త్వరలో పదోన్నతులు : మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టీకరణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రవాణాశాఖ నిబంధనల్ని ఉల్లంఘిస్తే అమెరికా తరహాలో డ్రైవింగ్ లైసెన్సుల రద్దుతో పాటు కఠిన శిక్షలు కూడా విధించే యోచనలో ప్రభుత్వం ఉన్నదని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారంనాడాయన హైదరాబాద్‌లో తెలంగాణ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రోడ్డు భద్రతపై కఠినంగా వ్యవహరించాల్సిందేననీ, ఆ మేరకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, నిబంధనల్ని కఠినతరం చేస్తామని తెలిపారు. వీటి అమల్లో భాగంగానే ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 31 వరకు 6,936 డ్రైవింగ్ లైసెన్సులను రద్దు చేశామన్నారు. భవిష్యత్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్, రోడ్డు ప్రమాదాలు, సిగ్నల్ జంపింగ్ వంటి నిబంధనల ఉల్లంఘనపై మరిన్ని కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. పాశ్చాత్య దేశాల తరహా చట్టాలను ఇక్కడ కూడా తెస్తే తప్ప, రోడ్డు ప్రమాదాలను నివారించలేమని అభిప్రాయపడ్డారు. అయితే దానికంటే ముందు ట్రాఫిక్ రూల్స్, రోడ్‌సేఫ్టీపై యునిసెఫ్ ఆధ్వర్యంలో విద్యాశాఖ ద్వారా పాఠశాలలు, కళాశాలల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం ఇటీవల ఉపాధ్యాయులతో పాటు ఇతర శాఖల ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిందనీ, దీనివల్ల వారి పనివిధానం మెరుగుపడాలని భావిస్తున్నామన్నారు. త్వరలో రవాణాశాఖలో కూడా పదోన్నతులు కల్పిస్తామని స్పష్టం చేశారు. విధుల్లో ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేంద్రప్రభుత్వం తెచ్చిన రోడ్డు రవాణా సవరణ బిల్లులోని అంశాల్లో కొన్నింటిని రాష్ట్రంలో అమలు చేయాలని భావిస్తున్నామన్నారు. వాహన కాలుష్యంపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కార్యక్రమంలో జేటీసీ రమేష్, తెలంగాణ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, అధ్యక్షులు పీ రవీంద్రకుమార్ గౌడ్, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ మార్గం రవీందర్, కోశాధికారి చంద్రశేఖర్, జాయింట్ సెక్రెటరీ జే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐఐహెచ్‌టీని ప్రారంభించనున్న సీఎం

- ఏటా 60 మంది విద్యార్థులకు శిక్షణ
- నేతన్న చేయూత కింద రూ.290 కోట్ల నిధుల పంపిణీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చేనేత రంగంలో అధునిక శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ) నేడు కొలువు దీరనుంది. సోమవారం హైదరాబాద్‌లోని లిలిత కళాతోరణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభిం చనున్నారు. ఇప్పటివరకు దేశంలో కేవలం ఆరు ప్రదేశాల్లో మాత్రమే ఈ సంస్థలు న్నాయి. రాష్ట్ర విభజన తర్వాత, ఈ ప్రాంతానికి సేవలందిస్తున్న సంస్థ నెల్లూరు జిల్లా వెంకటగిరిలో ఉన్నందున ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మారింది. దాంతో ఈ ప్రాంత విద్యార్థులు చేనేతలో సాంకేతిక నైపుణ్యం పొందేందుకు ఏపీ, ఒరిస్సాకు వెళ్లాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ సర్కార్ ఈ ఇనిస్టిట్యూట్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేసింది.

ఏటా 60 మంది విద్యార్థులకు శిక్షణ

ఏటా 60 మంది విద్యార్థులకు చేనేత, టెక్స్ టైల్ సాంకేతికతలో మూడేండ్ల డిప్లొమా కోర్సును ఈ సంస్థ అందించనుంది. శిక్షణ తర్వాత విద్యార్థులకు ప్రభుత్వ టెక్స్ టైల్ ఇన్‌స్టిట్యూట్లతో పాటు ప్రయివేటు, అపెరల్ ఇండస్ట్రీస్, ఫ్యాషన్ రంగాల్లో ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ సంస్థ ద్వారా పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన వారితోపాటు ఇతర వర్గాలు కూడా చేనేత రంగం వైపు మళ్లే అవకాశముందని సర్కార్ భావిస్తోంది. నేతన్నకు చేయూత పథకం కింద 36,133 మంది లబ్ధిదారులకు రూ. 290 కోట్లను సీఎం ఈ సందర్భంగా అందజే యను న్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావుతో పాటు పలువురు మంత్రులు, అధికారులు పాల్గొననున్నారు.

మోడీ ద్వంద్వ వైఖరి

- లైంగికదాడి నిందితులపై విరుద్ధ ప్రకటనలు
- గుజరాత్‌లోని ఘటనపై ఒకలా.. బెంగాల్ ఘటనపై ఇంకోలా
- ప్రధాని తీరు పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్న సామాజిక కార్యకర్తలు








న్యూఢిల్లీ : దేశంలో మహిళలపై జరుగుతున్న దారుణాల పట్ల మోడీ వ్యాఖ్యలు పరస్పరం విరుద్ధంగా కనిపిస్తున్నాయి. మహిళల పట్ల జరుగుతున్న అమానవీయ, దారుణ ఘటనలను తప్పుబడుతూ.. నిందితులను కఠినంగా శిక్షించాలని, వారు ఎంతటివారైనా విడిచిపెట్టకూడదని ఆగస్టు 15న ఎర్రకోటపై ప్రసంగిస్తూ మోడీ అన్నారు. కోల్‌కతా ఘటన అనంతరం ఎర్రకోట వేదికగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మహిళల పట్ల దారుణాలను ఉపేక్షించరాదనీ, మహిళల రక్షణ దేశం ప్రాధాన్యత అని ఆయన అన్నారు.

పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ వైద్యురాలిపై జరిగిన దారుణ ఘటనపై మోడీ స్పందించిన తీరు మంచిదే అయినా.. గతంలో సంచలనాత్మకంగా మారిన కొన్ని కేసుల విషయంలో నిందితుల పట్ల ఆయన, ఆయన ప్రభుత్వం వైఖరిని మాత్రం సామాజికవేత్తలు తప్పుబడుతున్నారు. "మోడీ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గుజరాత్‌లోని బిల్కిస్ బానో కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. బిల్కిస్ బానోపై సామూహిక లైంగికదాడికి పాల్పడిన నిందితులు, ఆమెకు సంబంధించిన కుటుంబ సభ్యులు 14 మందిని హత్య కూడా చేశారు. ఇందులో మూడేండ్ల చిన్నారి కూడా ఉండటం గమనార్హం. ఈ ఘటనతో సంబంధమున్న 11 మంది జైలు జీవితాన్ని గడుపుతున్న సమయంలో బీజేపీ ప్రభుత్వం వారి విడుదలకు మార్గం సుగమం చేసింది. దీంతో వారు జైలు నుంచి విడుదలయ్యారు. జైలు నుంచి విడుదలైన తర్వాత నిందితులకు ఘన స్వాగతాలు లభించాయి. ఈ పరిణామంపై ఆందోళన వ్యక్తం చేసిన బిల్కిస్ బానో తిరిగి సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీంతో నిందితులు తిరిగి జైలుకు వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి" అని సామాజికవేత్తలు గుర్తు చేస్తున్నారు. తన స్వంత రాష్ట్రంలోనే మహిళపై దారుణ ఘటనకు తెగబడిన నిందితులు జైలు నుంచి విడులయ్యేలా బీజేపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలపై మోడీ ఏ సమాధానం చెప్తారని వారు ప్రశ్నిస్తున్నారు. మహిళల భద్రత పట్ల ఆవేదన చెందుతున్నానన్న మోడీ.. లైంగికదాడి నిందితుల పట్ల సానుకూలంగా వ్యవహరించటం దేనికి నిదర్శనమని వారు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్ గతేడాది నుంచి హింసతో అట్టుడికిపోతున్నది. అక్కడ దిగజారిన పరిస్థితులు యావత్ సమాజాన్ని ఆందోళనకు గురి చేస్తున్నాయి. మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనలు అక్కడ చోటు చేసుకున్నాయి. అక్కడ కేంద్రంలో, ఇక్కడ రాష్ట్రంలో అధికారంలో ఉన్నదీ బీజేపీనే. అయినప్పటికీ, పరిస్థితులను సద్దుమణిగేలా చేయటంలో మాత్రం కాషాయపార్టీ తీవ్రంగానే విఫలమైంది. కోల్‌కతా ఘటన విషయంలో స్పందించినంత వేగంగా ప్రధాని మోడీ మణిపూర్ ఘటనలో మాట్లాడకపోవటం దేనికి సంకేతమని సామాజికవేత్తలు ప్రశ్నిస్తున్నారు. కేవలం బీజేపీయేతర పార్టీ పాలిత రాష్ట్రాల్లో జరిగే దారుణాల మీదనే స్పందించే ప్రధాని తీరు దేశానికి ఏ మాత్రమూ మంచిది కాదని వారు అంటున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో జరిగితే ఒకలా.. ఇతర పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల్లో మహిళలపై జరుగుతున్న నేరాల పట్ల ఇంకోలా మాట్లాడటం సరికాదని చెప్తున్నారు.

అర్హులైన జర్నలిస్టులందరికీ

ఇండ్ల స్థలాలు



(మొదటిపేజీ తరువాయి)

కల్పించారు. దాదాపు 1100 మంది జర్నలిస్టుల సమస్యకు కాంగ్రెస్ పాలనలోనే శాశ్వత పరిష్కారం చూపించినట్టు తెలిపారు. ప్రతి సమస్యకు పరిష్కారముంటుందని తన నిశ్చితాభిప్రాయమంటూ, అయితే పరిష్కరించాలనే వారికి నిబద్ధత ఉండాలని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చిక్కు సమస్యగా మారితే దానికి పరిష్కారం కాంగ్రెస్ చూపించిందని ఉదహరించారు. జవహర్‌లాల్ నెహ్రూ పేరు మీద ఏర్పడిన సొసైటీ సమస్యకు ఆయన వారసులుగా తాము పరిష్కరించినట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పైనుంచి ఆదేశాలుండవని సీఎం స్పష్టం చేశారు. అంతా పాలనాపరమైన ప్రక్రియలో భాగంగా జరిగిపోతుందని తెలిపారు. ఆ ప్రక్రియలో భాగంగా ఇంతకాలం పట్టిందే తప్ప జాప్యం కాదని చెప్పారు. న్యాయపరమైన చిక్కులు మళ్లీ ఎదురవకుండా ఉండేందుకే తగిన జాగ్రత్తల కోసం సమయం తీసుకున్నట్టు తెలిపారు.

వ్యవస్థలపై నమ్మకం పెంచేందుకు ప్రక్షాళన చేస్తున్నట్టు సీఎం తెలిపారు. సమాజంలో రాజకీయ వృత్తి పట్ల చిన్నచూపు చూసే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వృత్తిలో ఉన్నవారు బంధుమిత్రుల కోసమే పని చేస్తారనే అభిప్రాయాన్ని పోగొట్టేందుకు ప్రజాభిప్రాయం, పాత్రికేయుల అభిప్రాయాల మేరకు కాంగ్రెస్ ప్రజాపాలన సాగిస్తున్నదని తెలిపారు. జర్నలిస్టు వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరముందని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఇటీవల రాజకీయ పార్టీలు పెట్టిన పత్రికల్లో జర్నలిస్టులు ఇతరుల కార్యక్రమాలను ఇబ్బంది పెట్టేందుకే అన్నట్టుగా ఉన్మాదిగా వ్యవహరించే ధోరణి పెరిగిందని తెలిపారు. ఈ పరిస్థితిని ఎలా పరిష్కరించాలో సూచించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. జర్నలిస్టుకు నిర్వచనం ఏంటి? ఎవరిని జర్నలిస్టుగా గుర్తించాలి? అనేది తనకు సమస్యగా మారిందని సీఎం తెలిపారు. ఇటీవల కాలంలో ఒకరు యూట్యూబ్ అంటే మరొకరు నా ట్యూబ్ అంటూ జర్నలిస్టు అని చెప్పుకుంటున్నారు.

నిజమైన జర్నలిస్టులకు అక్రిడిటియేషన్ కార్డులు, ఆరోగ్య భద్రత, ఇంటిస్థలం ఇచ్చే విషయంలో నిబద్ధత కలిగి ఉన్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అదే సమయంలో ఆ ట్యూబ్ అంటూ ఈ ట్యూబ్ అంటూ గొట్టం పట్టుకుని తమకు తాము జర్నలిస్టులుగా చెప్పుకుంటూ సమాజంతో వ్యవహరించే తీరును ఆయన విమర్శించారు. ఇలాంటి వారిపై దాడి జరగగానే జర్నలిస్టులపై దాడిగా ఆపాదించుకోవద్దని సూచించారు. జర్నలిస్టుల నైతిక హద్దు చెప్పాలని ప్రశ్నించారు. ఎలాంటి భాష, పదప్రయోగం ఉపయోగించాలి? అని ప్రశ్నించారు. జర్నలిస్టుల్లో ప్రజల సమస్యలను వెలికి తీసే ఒక వర్గం ఉంటే, మరో వర్గం పత్రికల యజమాన్యాల ముసుగులో ఉన్న రాజకీయ నాయకులను వెనుకోసుకునే వారున్నారని తెలిపారు. సీఎంఓ, సచివాలయం, అసెంబ్లీ పాసులకు సంబంధించి ఎవరికి ఇవ్వాలనే దానిపై విధి విధానాలు రూపొందించాలని సీఎం సూచించారు. దెబ్బతిన్న వ్యవస్థలను సరి చేస్తున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గత పదేండ్లలో రాష్ట్రానికి ఒక విధానమంటూ లేకుండా పోయిందని ఆయన విమర్శించారు. పర్యాటకం, విద్యుత్, క్రీడలు, జర్నలిజం ఇలా ఒక్కో వ్యవస్థను సరి చేసుకుంటూ వస్తున్నామని తెలిపారు. మీడియా అకాడమీ కార్యకలాపాల నిర్వహణ కోసం రూ.10 కోట్లను సీఎం స్పెషల్ ఫండ్స్ నుంచి విడుదల చేయనున్నట్టు తెలిపారు.

ఆందోళన వద్దు

ఇండ్ల స్థలాల కోసం ఎదురు చూస్తున్న మరో రెండు, మూడు వేల మంది జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. భవిష్యత్తులో నాలుగో సిటీగా వస్తున్న ఫ్యూచర్ సిటీలో వారిని భాగస్వాములు చేస్తామన్నారు. అలాగే గ్రామీణ, మండల విలేకరుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాజకీయ నాయకులు, పాత్రికేయులు పరస్పరం గౌరవించుకున్నప్పుడే సమాజం మనల్ని గౌరవిస్తుందని తెలిపారు.

ఇది ప్రారంభమే...ముగింపు కాదు
-మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

జర్నలిస్టుల ఇండ్ల స్థలాల పంపిణీకి సంబంధించి ఇది ముగింపు కాదనీ, ప్రారంభమేనని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాబోయే నాలుగేండ్ల మూడు నెలల్లో ఇంకా ఇవ్వాల్సిన వారికి ఇస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం మాదిరిగా కక్షసాధించే మాటలు మాటలేదనీ, ఎవరిపైనా ఇందిరమ్మ రాజ్యంలో కక్షసాధింపు చర్యలు లేవని తెలిపారు.

బీఆర్ఎస్‌కు రెండు సార్లు జర్నలిస్టులు, ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టినా బుద్ధి రాలేదని విమర్శించారు. హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామీణ, మండల కేంద్రాల్లో పని చేసే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలివ్వాలని కోరారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మెన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నెల రోజుల్లో జర్నలిస్టులతో మరింత పెద్ద సభను ఏర్పాటు చేయబోతున్నట్టు తెలిపారు. జర్నలిజం వృత్తి గౌరవాన్ని మరింత పెంచేందుకు వీలుగా చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఐదేండ్ల నుంచి పదేండ్ల అనుభవం కలిగిన దాదాపు మూడు వేల మంది ఇండ్ల స్థలాల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వచ్చిన ఎన్నికల సమయాన్ని మినహాయిస్తే నికరంగా రెండు నెలల సమయంలోనే జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ సమస్యను పరిష్కరించిందని తెలిపారు. కార్యక్రమానికి సమాచార, పౌర సంబంధాలశాఖ కమిషనర్ హనుమంతరావు స్వాగతం పలికారు. అంతకు ముందు మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు సీఎం రేవంత్ రెడ్డి రూ.ఒక లక్ష చొప్పున ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు.

సమస్యలను ప్రజాకోణంలో రాసేది కమ్యూనిస్టు పత్రికలే

సమాజంలో ఉన్న సమస్యలను ప్రజల కోణంలో కమ్యూనిస్టు పత్రికలు రాసేవని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఏనాడు ఆ పత్రికలపై తీవ్రమైన ఆరోపణలు, అభ్యంతరాలు వ్యక్తమయ్యేవి కావని గుర్తుచేశారు. చాలా సందర్భాల్లో ఆ పత్రికల్లో పని చేసే జర్నలిస్టుల నుంచి సమాచారాన్ని, వారికున్న అవగాహన, విశ్లేషణ అడిగి తెలుసుకునేవారమని చెప్పారు. ఆ పత్రికల్లో జర్నలిస్టులుగా ఉన్న వారే ఉత్తమ జర్నలిస్టులుగా పని చేసే వారని తెలిపారు. మారిన పరిస్థితిలో కొంత మంది కమర్షియల్ పత్రికల్లోకి మారినా ఆ విలువలను కొనసాగించేవారన్నారు. రాజకీయ పార్టీలు వారి విధానాలను చెప్పుకునేందుకు గతంలో పత్రికలను నెలకొల్పుకున్నారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. సిద్ధాంత వైరుధ్యాలున్నప్పటికీ రాజకీయ పార్టీలు తమ సిద్ధాంత భావవ్యాప్తి చేయడం ద్వారా ప్రజలను ఆకర్షించి సమాజానికి మేలు చేసేందుకు ఆ పత్రికలను ఉపయోగించుకునే వారని తెలిపారు. అలాంటి పత్రికల స్థాపన విషయంలో కమ్యూనిస్టులు ప్రథమ కోవలోకి వస్తారన్నారు. వారు సిద్ధాంతపరమైన అంశాలే రాసేవారు, విశ్లేషించేవారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

త్రిపుర సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరిపై దాడికి వీహెచ్‌పీ గూండాల యత్నం

గూండాలను అరెస్టు చేయాలని సీపీఐ(ఎం) ఆందోళనలు



అగర్తల : బీజేపీ అధికారంలో ఉన్న త్రిపురలో విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) గూండాలు మరోసారి రెచ్చిపోయారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి, పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యులు, అసెంబ్లీలో ప్రతిపక్ష నేత జితేంద్ర చౌదరి ఇంటి వద్ద వీహెచ్‌పీ గూండాలు శుక్రవారం విధ్వంసం సృష్టించారు. జితేంద్ర చౌదరిపై దాడికి ప్రయత్నం చేశారు. త్రిపుర రాజధాని అగర్తలలో కృష్ణనగర్‌లోని జితేంద్ర చౌదరి నివాసం వద్దకు శుక్రవారం ఉదయం ముందుగా జితేంద్ర చౌదరి, సీపీఐ(ఎం) కు వ్యతిరేకంగా నినాదాలు చేసుకుంటూ సుమారు 100 మంది విహెచ్‌పి గూండాలు అక్కడకు చేరుకున్నారు. నివాసం వద్ద విధ్వంసానికి ప్రయత్నించారు. ఇంటిలోకి దూసుకెళ్లి జితేంద్ర చౌదరిపై దాడికి యత్నించారు. అయితే ఈ విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకోవడంతో వీహెచ్‌పీ గూండాల యత్నం ఫలించలేదు. తరువాత వచ్చిన పోలీసులు వీహెచ్‌పీ గూండాలను చెదరగొట్టారు. ఈ దాడి వెనుక ఉన్నది రాష్ట్ర మంత్రి, బీజేపీ నాయకుడు సుధంగ్షు దాస్‌గా భావిస్తున్నారు. జితేంద్ర చౌదరి ఇటీవల అసెంబ్లీలో బీజేపీ నాయకులు చేస్తున్న విద్వేష వ్యాప్తిగా వ్యతిరేకంగా మాట్లాడారు. సుధంగ్షు దాస్ ఇటీవల చేసిన ఫేస్‌బుక్ పోస్టు కారణంగా రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో మైనార్టీలపై అల్లర్లు చేలరేగాయని విమర్శించారు. పదుల సంఖ్యలో మైనార్టీల ఇండ్లను తగుల బెట్టారని, ఆటోరిక్షాలతో సహా 13 వాహనాలను దగ్ధం చేశారని తెలిపారు. తాను చేసిన ఫేస్‌బుక్ పోస్టుపై సుధంగ్షు దాస్ క్షమాపణలు చెప్పాలని, అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను జితేంద్ర చౌదరి కోరారు. ఈ నేపథ్యంలో జితేంద్ర చౌదరి ఇంటిపై దాడి జరిగింది.కాగా, జితేంద్ర చౌదరిపై ఇంటిపై దాడిని నిరసిస్తూ త్రిపురలో పలు ప్రాంతాల్లో సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. పశ్చిమ అగర్తల పోలీస్‌స్టేషన్ ముందు సీపీఐ(ఎం) నాయకులు, మాజీ మంత్రి మాణిక్ దేవ్, లోక్‌సభ మాజీ సభ్యులు శంకర్ ప్రసాద్ దత్తా, రాజ్యసభ మాజీ ఎంపీ, లెఫ్ట్ ఫ్రంట్ కన్వీనర్ నారాయణ్ కర్, ఇతర నాయకులు ఆందోళనకు దిగారు. రోడ్డును దిగ్బంధించారు. వీహెచ్‌పీ గూండాలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ, వీహెచ్‌పీ నాయకుల కారణంగా రాష్ట్రంలోని శాంతియుత వాతావరణం కలుషితమువుతుందని విమర్శించారు.గోమతి జిల్లాలోని అమర్‌పూర్ వద్ద కూడా సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు.

మ'న్నీరు' నష్టం రూ.339 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)



రూ.11 లక్షల నష్టం వచ్చిందని అంచనాలు రూపొందించారు. ఇలా మొత్తంగా రూ.339 కోట్ల నష్టం వాటిల్లినట్టు నిర్ధారించారు.

మౌలిక సదుపాయాల నష్టం వివరాలు..

మౌలిక సదుపాయాల పరంగా 75.77 కి.మీ రోడ్లు దెబ్బతినడంతో రూ.55.58 కోట్ల నష్టం వాటిల్లింది. 8,276 కి.మీ మేర ఒండ్రు మేటలు వేయడంతో రూ.16.49 కోట్లు, 62 మీటర్ల మంచినీటి సదుపాయాలు దెబ్బతినడంతో రూ.కోటికి పైగా నష్టం వాటిల్లినట్లు అంచనాలు వేశారు. ఇవేకాక 66 స్కూల్స్ దెబ్బతినడంతో రూ.1.2 కోట్లు, రెండు ఆస్పత్రులకు నీరు రావడంతో రూ.30లక్షలు, 3,500 విద్యుత్ స్తంభాలు, 570 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడంతో రూ.7.73 కోట్ల నష్టం

వాటిల్లినట్లు అంచనాలు వేశారు.

రూ.111 కోట్ల విలువైన పంటలకు నష్టం..

ప్రభుత్వ అంచనాల ప్రకారం మొత్తం రూ.111.87 కోట్ల విలువైన పంటలు దెబ్బతిన్నట్టు పేర్కొన్నారు. 18,375 మంది రైతులకు చెందిన 31,119 ఎకరాల పత్తి దెబ్బతినడంతో రూ.43 కోట్లు, 63 మందికి చెందిన 96 ఎకరాల మొక్కజొన్న నీటిపాలై రూ.13 లక్షలు, పెసరపై వరద ప్రభావంతో రూ.కోటి, 30,460 మంది రైతుల పొలాలు దెబ్బతినడంతో రూ.58 కోట్లు, మొత్తంగా 49,319 మంది రైతులకు చెందిన 73,740 ఎకరాల పంటలు వరద పాలు కావడంతో రూ.103 కోట్ల నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ అంచనాలు తయారు చేసింది. ఇవికాక 4,209 మంది రైతులకు చెందిన 6,174 ఎకరాల ఉద్యాన పంటలు వరద ప్రభావంతో దెబ్బతిన్నాయి. దీనివల్ల రూ.8.64 కోట్ల నష్టం వాటిల్లింది. మొత్తంగా 53,528 మంది రైతులకు చెందిన 79,914 ఎకరాలు వర్షార్పణం కావడంతో రూ.111.87 కోట్ల లాస్‌ను రైతులు చవిచూడాల్సి వచ్చింది. ఇక 180 చెరువుల్లో 3,500 టన్నుల చేపలు వరద పాలు కావడంతో రూ.4.29 కోట్ల మత్స్యసంపద దెబ్బతింది.



ఆరు కుటుంబాలకు రూ.30 లక్షల పరిహారం

వర్షాలు, వరదల కారణంగా చనిపోయిన మొత్తం ఆరుగురి కుటుంబాలకు రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియాను చెల్లించారు. ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ఆరుగురు మృతుల కుటుంబాలకు ఈ పరిహారం అందించారు. కూసుమంచి, సింగరేణి మండలంలో ఇద్దరు చొప్పున, మధిర, ఎర్రుపాలెంలో ఒక్కొక్కరి చొప్పున ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఆరుగురు ఈ వరదల్లో మరణించారు. ఇంకా రకరకాల నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. అయితే ఈ వరదల్లో దెబ్బతిన్న ఒక్కో ఇంటిలో సుమారు రూ. లక్ష నుంచి రూ.5 లక్షలకు పైగా నష్టం వాటిల్లి ఉంటుందని ప్రజల నుంచి అందుతున్న సమాచారం.

కార్పొరేట్ అనుకూల బీజేపీని గద్దెదించాలి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల్లో కార్పొరేట్ అనుకూల బీజేపీని అధికారం నుంచి గద్దె దించాలని హర్యానా ప్రజలకు కిసాన్, మజ్దూర్ మహా పంచాయత్ పిలుపునిచ్చింది. హర్యానాలోని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం), సెంట్రల్ ట్రేడ్ యూనియన్ల ఉమ్మడి వేదిక (సీటీయూ) సంయుక్త కార్మిక- రైతు మహాపంచాయత్ హిసార్‌లోని రైతు మార్కెట్ ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా అక్టోబర్ 5న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని గద్దె దించాలని ప్రజలకు పిలుపునిస్తూ తీర్మానాన్ని ఆమోదించింది. హర్యానా రాష్ట్ర రైతులు, కార్మికులు, ఉద్యోగుల సంఘాల నేతల అధ్యక్షతన జరిగిన ఈ మహాపంచాయత"లో ఎస్కేఎం నుంచి జోగేంద్ర సింగ్ ఉగ్రహన్,పి కృష్ణప్రసాద్, రాజన్ క్షీరసాగర్, సీఐటీయూ నుంచి ఎఆర్ సింధు ప్రసంగించారు. బీజేపీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ హయాంలో ఐదేండ్లుగా రైతులు, కార్మికులపై జరుగుతున్న అణచివేతను ఖండించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం వ్యవసాయాన్ని కార్పొరేటీకరించడానికి మూడు వ్యవసాయ చట్టాలను, కనీస వేతనం, 8 గంటల పనిని నిరాకరిస్తూ.. కార్మికులను బానిసలుగా మార్చడానికి నాలుగు లేబర్ కోడ్‌లను ఆమోదించిందని తెలిపారు. ప్రభుత్వ రంగ యూనిట్ల ప్రయివేటీకరణకు బీజేపీ అండగా నిలిచి బడా కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తోందని విమర్శించారు. స్వాతంత్ర్యానంతరం నిరుద్యోగం తారాస్థాయికి చేరిందని, ధరల పెరుగుదల, వలసలతో సామాన్యుల జీవనోపాధిపై క్రూరమైన దాడులు జరిగాయని విమర్శించారు.బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కారు విధానాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలపై అణచివేత తారాస్థాయిలో ఉందన్నారు. రైతు, కార్మికుల, ఉద్యోగుల ఉద్యమాలపై భయంకరమైన అణచివేత చర్యను అందరూ చూశారని తెలిపారు. రైతుల ఉద్యమంపై అణచివేతలో 736 మంది రైతులు అమరుల య్యారని, ఈ అణచివేతను మరిచిపోలేమని తెలిపారు. హర్యానా ప్రజలు నెలల తరబడి బందీలుగా ఉన్నారని గుర్తు చేశారు. రైతులకు ఎంఎస్‌పీతో అన్ని పంటల కొనుగోలుకు చట్టపరమైన హామీ, రుణమాఫీ, కార్మికులకు కనీస వేతనం రూ. 26,000, పర్మినెంట్ ఉద్యోగాల నియామకం, స్కీమ్ వర్కర్లతో సహా తాత్కాలిక ఉద్యోగుల క్రమబద్ధీకరణ, రోజువారీ వేతనం రూ. 600తో 200 రోజుల ఉపాధి హామీ పని, ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణ, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లో ప్రజా వ్యతిరేక నిబంధనల రద్దు, కార్మిక- రైతు ఉద్యమాలపై అణచివేతకు ముగింపు పలకడం వంటి ప్రధాన డిమాండ్లను బీజేపీ పదేండ్ల పాలనలో తిరస్కరించిందని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఈ డిమాండ్లను మరింత బలంగా లేవనెత్తాలని సూచించారు.

17న గ్రామాలు, పట్టణాల్లో కిసాన్, మజ్దూర్ సభలు

సెప్టెంబర్ 17న బీజేపీ ని ఓడించేందుకు రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో కిసాన్, మజ్దూర్ పంచాయితీ నిర్వహించాలని ఈ మహాపంచాయత్ నిర్ణయించింది. ఆ తరువాత కరపత్రాలను పంపిణీ చేసేందుకు ఇంటింటికి ప్రచారం నిర్వహించాలని తీర్మానించింది. సెప్టెంబర్ 28న షహీద్ భగత్ సింగ్ జయంతిని కార్పొరేట్, సామ్రాజ్యవాద వ్యతిరేక దినంగా జరుపుకోవాలని, ఆ రోజున సదస్సులు, సాయంత్రం కాగడ ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపు ఇచ్చింది. గోసంరక్షణ పేరుతో మైనారిటీలు, సామాన్యుల పై హింసాత్మక హత్యాకాండకు పాల్పడుతున్న నేరగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని మహాపంచాయత్ డిమాండ్ చేసింది. ఇలాంటి హంతకులను బీజేపీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కాపాడుతోందని మహాపంచాయత్ ధ్వజమెత్తింది. ఈ సందర్భంగా అఖిల భారత కిసాన్ సభ, సీటీయూ హర్యానా, బీకేయూ ఏక్తా ఉగ్ర, పగ్డి సంభాల్ జట్టా, కిసాన్ సభ అజయ్ భవన్, బీకేయూ (తికాయత్), ఐఎన్‌టీయూసీ, బీకేయూ ఘాసి రామ్ నైన్, ఏఐటీయూసీ, సర్వ కరమ్‌చారి సంఘ్, భారతీయ కిసాన్ సంఘర్ష్ సమితి, రాష్ట్రీయ కిసాన్ మంచ్, హర్యానా కిసాన్ మంచ్, భారతీయ కిసాన్ కమ్‌గర్ అధికార మోర్చా, కిసాన్ మహాసభ, ఎఐకెకెఎంఎస్, రూరల్ లేబర్ అసెంబ్లీ, ఆల్ ఇండియా ఫార్మ్ లేబర్ యూనియన్, రివల్యూషనరీ ఫార్మర్స్ యూనియన్, ఏఐయూటీయూసీ, మైనారిటీ సంక్షేమ సంఘంతోపాటుఇతర సంఘాలు హాజరయ్యారు.

హర్యానా ఎన్నికల వేళ బీజేపీకి తలనొప్పి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ కథ ముగిసిందనుకునేలోపు, బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ ఎపిసోడ్ తెరపైకి వచ్చింది. హర్యానా ఎన్నికల వేళ బీజేపీకి తలనొప్పి పెరిగింది. ఒకపక్క పార్టీలోని అసంతృప్తి, మరోవైపు పార్టీలోని నేతలు సున్నితమైన అంశాలపై నోటికి వచ్చినట్టు మాట్లాడటంతో.. ఆ పార్టీకి మరింత నష్టాన్ని తెచ్చిపెడుతోంది. దీంతో బీజేపీ నష్ట నివారణ చర్యలకు పూనుకుంది. తొలుత హర్యానా ప్రజలకు సెంటిమెంట్‌గా ఉన్న రైతు ఉద్యమంపై బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై దుమారం రేగింది. అసలే బీజేపీపై గుర్రుగా ఉన్న రైతాంగానికి పుండుమీద కారం చల్లినట్టు అయింది. కంగనా వ్యాఖ్యలపై అగ్గిమీద గుగ్గిలమైన హర్యానా, పంజాబ్ రాష్ట్రాల్లో బలమైన రైతు సంఘాలు ఆందోళనకు దిగాయి. మరోవైపు పంజాబ్, హర్యానా బీజేపీ నేతలు కూడా కంగనా వ్యాఖ్యలను ఖండించారు. దీంతో ఆ పార్టీ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా అయింది. వెంటనే బీజేపీ జాతీయ నాయకత్వం నష్ట నివారణ చర్యలకు దిగింది. ఆ పార్టీ అధ్యక్షుడు జెపి నడ్డా, కంగనా రనౌత్‌ను ఢిల్లీకి పిలిచి.. ఇక విధాన పరమైన అంశాలపై మాట్లాడొద్దని నోటికి తాళం వేశారు.

తాజాగా రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు, బీజేపీ నేత బ్రిజ్ భూషన్ శరణ్ సింగ్ ఎపిసోడ్ వెలుగులోకి వచ్చింది. ఇటీవల రెజ్లర్లు వినేశ్ ఫోగట్, భజరంగ్ పునియా కాంగ్రెస్‌లో చేరారు. దీంతో బీజేపీ నేత, డబ్ల్యుఎఫ్ఐ మాజీ అధ్యక్షులు బ్రిజ్ భూషన్ సింగ్ రెచ్చిపోతున్నాడు. కాంగ్రెస్‌లో చేరిన తరువాత



ఇద్దరు రెజ్లర్లను బ్రిజ్ భూషణ్ సింగ్ లక్ష్యంగా చేసుకున్నారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో వినేశ్ ఫోగట్‌కు కాంగ్రెస్ టికెట్ ఖరారు చేసింది. దీంతో బ్రిజ్ భూషన్ సింగ్ గత రెండు రోజులుగా వినేశ్ ఫోగట్, పునియాపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు. బ్రిజ్ భూషన్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలతో స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫోగట్, భజరంగ్ పునియా పెద్ద ఎత్తున ఉద్యమించడంతో బీజేపీ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆయనకు ఎంపీ టికెట్ నిరాకరించింది. దీంతో వినేశ్ ఫోగట్, భజరంగ్ పునియా కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ వారిద్దరిపై నిరంతరం విమర్శలు చేస్తూనే ఉన్నారు. అయితే వినేశ్ ఫోగట్‌పై హర్యానాలో సానుభూతి ఉంది. ఆ హర్యానాలోని రైతు సంఘాలు, బలమైన జాట్ వర్గం ఆమెకు మద్దతుగా ఉంది. ఆమెపై బ్రిజ్ భూషణ్ చేసిన విమర్శలతో బీజేపీకి నష్టం జరగడంతో పాటు, మరోవైపు కాంగ్రెస్‌కు సానుకూలత పెరుగుతోందని ఆ పార్టీ భావించింది. ఈ నేపథ్యంలో నష్ట నివారణ చర్యలకు దిగింది.

హర్యానా అసెంబ్లీ ఎన్నికల వేళ ఎలాంటి పొరపాట్లు చేయకూడదని, పార్టీ నాయకుల వ్యవహారశైలితో ప్రతిపక్ష పార్టీలు లబ్ది పొందకుండా ఉండేందుకు బీజేపీ అవసరమైన చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా నడ్డా బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్‌ను పిలిపించి తలంటినట్టు సమాచారం. ఎన్నికల వేళ ఫోగట్, పునియాపై మీడియాతో మాట్లాడవద్దని సూచించారు. మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు.

నా ప్రతి అడుగులో నా వెంట ప్రజలే వినేశ్ ఫోగట్

బ్రిజ్ భూషన్ శరణ్ సింగ్ చేసిన వ్యాఖ్యలపై వినేశ్ ఫోగట్ తనదైన శైలిలో స్పందించారు. ఆమె ఆదివారం జులనా నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వినేశ్ ఫోగట్ మాట్లాడుతూ తాను రెజ్లింగ్‌లో ఏది గెలిచినా అది ప్రజల వల్లనే గెలిచానని, రాజకీయాల్లోనూ విజయం సాధిస్తానని ఆశిస్తున్నానని అన్నారు. జంతర్ మంతర్ వద్ద తాము చేపట్టిన ఆందోళన గురించి తరువాత మాట్లాడుతానని పేర్కొన్నారు. తమను అక్కడ కూర్చునేలా బీజేపీ చేసిందని అన్నారు. బ్రిజ్ భూషణ్ అంటే దేశం కాదు, తన ప్రతి అడుగులో నా సొంత ప్రజలే నా వెంట ఉన్నారని తెలిపారు. ప్రజలు నా సొంతమని, ప్రజలే నన్నును ఆదరించారని పేర్కొన్నారు. అన్ని పోటీల్లో విజయం సాధిస్తానని, పతకం రాలేదన్న బాధ భారత్‌లోని ఎయిర్‌పోర్టుకు చేరుకున్న తరువాత తగ్గిందని అన్నారు. ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటానని, ఇకపై తాను చేసే ప్రతి యుద్ధంలో విజయం సాధిస్తానని వినేశ్ ఫోగట్ స్పష్టం చేశారు.

రెజ్లర్లపై బ్రిజ్ భూషణ్ విమర్శలు

తనకు సంబంధంలేని ఆ మూడు ఘటనలకు తనను బాధ్యుడిని చేశారని, ఎప్పటికైనా సత్యం గెలుస్తుందని బ్రిజ్ భూషణ్ సింగ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలను పాండవులతో పోల్చిన ఆయన, మహాభారత కాలంలో పాండవులు ద్రౌపదిని పణంగా పెట్టారన్నారు. ఇప్పటి వరకు పాండవులను దేశం క్షమించలేదన్నారు.. తాను ఇప్పటికీ మౌనంగా ఉండేవాడినని, కానీ సాక్షి మాలిక్ ఇప్పటికీ మహిళల కోసం పోరాడుతున్నాని చెప్పడం వలనే స్పందించాల్సి వచ్చిందని అన్నారు. ఫోగట్, పునియా కాంగ్రెస్‌లో చేరడం కోసం అవాస్తవాలను ప్రచారం చేశారన్నారు.

కొంతమంది స్వార్థ ప్రయోజనాల కారణంగా తన పరువు, ప్రతిష్టలతో పాటు రెజ్లింగ్‌కు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ఒలింపిక్స్‌లో కనీసం ఐదు పతకాలు సాధించేవాళ్లమని, కానీ కొందరి కారణంగా పతకాలు రాలేదని అన్నారు. వినేశ్ ఫోగట్ పారిస్ ఒలింపిక్స్‌లో నిబంధనలు ఉల్లంఘించినందుకే పతకం చేజారిందని విమర్శించారు. హర్యానా ప్రజలు ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయాలని బ్రిజ్ భూషణ్ సూచించారు. భజరంగ్ పునియా హర్యానాకు హీరో కాదని, విలన్ అంటూ విమర్శించారు.

కాళోజీ చైతన్య గమనం



కాళోజీ అంటే ఒక ప్రజాస్వామిక గొంతుక. ఒక ధర్మాగ్రహపు ధిక్కారం. హక్కుల ధ్వని. స్వేచ్ఛా నినాదం. కాళోజీ జీవితమే కవిత్వం. 'అతడు అలవోకగా జీవించాడు. అంతే అలవోకగా కవిత్వం రాశాడు. అతని మాట కవిత, అతని యెడద కవిత, అతని ప్రాణం కవిత. అతని కవిత్వం అతని జీవితమంతటి నిరాడంబరం. కాళోజీ గొడవ మనిషి కాదు. కాళోజీది మనిషి గొడవ. ఏ పట్టింపులూ లేక ఎక్కడ ఉద్యమం వుంటే అక్కడ ప్రత్యక్షమయ్యే సామాన్య మాన్యుడు, అసామాన్యుడు కాళోజీయే' అని చెప్పిన దాశరథి రంగాచార్య మాటలు అక్షర సత్యాలు. 'అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి. అన్యాయాన్నెదిరించినోడే నాకు ఆరాధ్యుడు' అని నినదించినవాడు కాళోజీ. ఆయన జీవితంలోని ప్రధాన లక్షణం నిర్భయంగా బతకడం, స్వేచ్ఛగా జీవించడం, నిండా నిండిన ప్రేమతో సహజంగా నదిలాగా బతకడం. మనుషులని అచ్చంగా ప్రేమించడం, ప్రతి ఒక్కరినీ మనుషులు కాబట్టి ఇష్టపడటం, వారి గురించి ఆరాటపడటం ఆయనకే స్వంతమైన విషయం. ఆనాడు నిజాం నిరంకుశత్వానికి, సాంస్కృతిక అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన 'ఆంధ్రమహాసభ'లో పాల్గొని చైతన్యాన్ని నింపుకున్నాడు. క్విట్ ఇండియా ఉద్యమంలోనూ పాల్గొన్నాడు. తెలుగు భాషకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించాడు. తెలుగు భాషలో కనిపించే ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ, కళింగ ప్రాంతాల మాండలికాలు కలిస్తేనే తెలుగు భాష అని నిర్వచించాడు. వ్యవహారిక భాషను ప్రేమించాడు. 'ఏ భాషనీది యేమి వేషమురా? ఈ భాష ఈ వేషమెవరి కోసమురా? తెలుగు బిడ్డవురోరి తెలుగు మాట్లాడుటకు సంకోచపడియెదవు సంగతేమిటిరా? అన్య భాషలు నేర్చి ఆంధ్రంబు రాదనుచు, సకిలించు ఆంధ్రుడా! చావవెందుకురా!' అని తీవ్రంగా విమర్శించాడు. తెలుగు భాషాభిమానాన్ని ప్రకటించాడు.

కాళోజి గారిని స్మరించుకోవడం, ఆయన చెప్పిన విషయాలను నెమరువేసుకోవడమే కాదు, సాంస్కృతికమైన అనేక విషయాలపై ఇంకా స్పష్టంగా పని జరగకపోవటాన్ని ప్రశ్నించవలసే వున్నది.

ఆనాడు నైజాము నవాబు పాలన మన సాంస్కృతిక జీవనాన్ని ధ్వంసం చేస్తున్నదని ఎదిరించిన మనం, ఇంకా తెలంగాణలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి పూనుకోనేలేదు. ప్రత్యేక రాష్ట్రం వచ్చి పది సంవత్సరాలు గడిచింది. వచ్చిన ప్రభుత్వాలు మన సాంస్కృతిక విధానమేమిటో కూడా నిర్ణయించలేదు, ప్రకటించలేదు. తెలంగాణ భాషకు సంబంధించిన పదకోశాన్ని కూడా తయారు చేసుకోలేకపోయాం. మన భాషలో పరిపాలన సాధించడం అసలు డిమాండులోనే లేకుండా పోయింది. పరిపాలన ప్రజాభాషలో లేకుండా ప్రజాస్వామ్యం ఎలా మనగలుగుతుంది! పాఠశాల పుస్తకాలలో ఇంకా మన భాష రాలేదు. మన జీవనం రాలేదు. ఇక గ్రంథాలయాల పరిస్థితి చాలా దైన్యంగా మారింది. విజ్ఞాన తెలంగాణ ఏర్పడడానికి గ్రంథాలయాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. వాటి నిర్వహణ ఏది? గ్రామీణ జానపద కళారూపాల కొనసాగింపు, శిక్షణ, పరిశోధన, రికార్డు చేయడం ఇంకా చేయాల్సే వుంది. ఆద్య కళలకు సంబంధించి, ప్రభుత్వేతర వ్యక్తులు చేసిన కృషే కనపడుతున్నది కానీ, ప్రభుత్వం పట్టనట్టే వ్యవహరిస్తున్నది. ఇక రచయితల, కవుల, కళాకారుల కార్యశాలలు లేవు. వారి ఆదరణా లేదు. కేవలం కార్యక్రమాలకే పరిమితమైపోతున్నారు. పటిష్టమైన కార్యాచరణ ఏదీ లేదు. కవులు, రచయితలు సొంతంగా పుస్తకాలు వేస్తే కనీసంగా కొనే గ్రంథాలయాలూ లేవు. పూర్వం మన ప్రాంత రచయితలు, కవులు, ఈ నేలకు పేరు తెచ్చిన వారి జన్మ స్థలాలను సాహిత్య సాంస్కృతిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్న డిమాండునూ పట్టించుకోనేలేదు. దాదాపు సంవత్సర కాలంగా సాహిత్య అకాడెమీకి, భాషా సంఘానికి చైర్మన్‌లనే నియమించుకోలేకపోతున్నాం.

తెలంగాణ వారసత్వం అని ఊరికే చెబితే ప్రయోజనం లేదు. బాంచనని బతికిన సామాన్యుడు బందూకు పట్టిన చరిత్రను, తోలుతిత్తుల మోగించి ఆధిపత్యాన్ని గోల్కొండ ఖిల్లాకింద ఘోరీ కడతానని గానం చేసిన సామాన్యుల వీరగాథలను నేటి తరానికి అందించాలి. కాళోజీ యాదిలో మరింత చైతన్యయుతంగా సాంస్కృతిక పునరుజ్జీవనం కోసం పోరాడాలి. అలాంటి పోరాటం చేసిన నాడే కాళోజీకి వారసులంగా నిలుస్తాం.

(కాళోజీ 110వ జయంతి సందర్భంగా)

- కేపసి

> ఎవని వాడుక భాష వాడు రాయాలె. ఇట్ల రాస్తే అవతలోనికి తెలుస్తదా అని ముందర్నే మనమనుకునుడు, మనను మనం తక్కువ చేసుకున్నట్లె. ఈ బానిస భావన పోవాలె. నే నెన్నో సార్లు చెప్పిన. భాష రెండు తీర్లు - ఒకటి బడి పలుకుల భాష, రెండోది పలుకు బడుల భాష. పలుకు బడుల భాషగావాలె. - కాళోజీ

యానాది బతుకు పోరే 'పాయి దరువులు'

మనిషి పుట్టినప్పటి నుంచే తమ అనుభవాలను, అనుభూతులను, ఆలోచనలను కథగానో, నవలగానో పంచుకుంటున్నారు. ఇదంతా మనిషిలోని భాషా సామర్థ్యం వలన సాధ్యమైందని చెప్పవచ్చు. అయితే ప్రపంచ సాహిత్యంలో 17 వ శతబ్దంలో స్పానిష్, ఫ్రెంచి దేశాల్లో మొదటగా నవల పుట్టింది. అది తెలుగు సాహిత్యానికి వచ్చేసరికి యింకో శతాబ్ద కాలం పట్టింది. నవల విస్తృతిచేతనో, విశాలతనం చేతనో, అనేకానేక పనుల ఒత్తిడి మధ్య విశ్రాంతి లేకపోవడం చేతనో కొత్త నవలల పుట్టుక కష్టమౌతున్నది. ఒకప్పుడు పతాక స్థాయిలో తెలుగు సాహిత్యాన్ని ఏలిన నవలా ప్రక్రియ యిప్పుడు పతనావస్థలోకి చేరింది.

ఆది నుండి కొంతమంతి చేతుల్లోని సాహిత్యం అస్తిత్వ ఉద్యమాల పుణ్యమా అని అందరి చేతుల్లోకొచ్చింది. ఫలితంగా ఎవరెవరి జీవితాలను వాళ్ళు సాహిత్యంలోకి తెచ్చారు. తెస్తున్నారు. అట్టడుగు జీవితాలను అక్షర ఆయుధంతో అజరామరం చేస్తున్నారు. ఈ కోవలోనే దళిత సాహిత్యం, స్త్రీవాద, ముస్లీం వాద సాహిత్యం తమతమ అస్తిత్వాలను, ఉనికిని నిలబెట్టుకుంటున్నాయి. అయితే దళిత సాహిత్యంలో యితర వర్గాల జీవితాలు వచ్చినంతగా యానాది జీవితపు సాహిత్యం రాలేదనేది కాదనలేని సత్యం. కేవలం వేళ్ళు మీద లెక్కబెట్ట కలిగే కేశవరెడ్డి గారి 'చివరి గుడిసె', ఏకీల వెంకటేశ్వర్లు గారి 'ఎన్నెల నవ్వు', చెంచు నవల మాత్రమే ప్రధానంగా ధర్శనమిస్తున్నాయి.

దీనికి కారణాలు ఆ సామాజిక వర్గాల్లో పెరగని అక్షరాస్యత, సామాజిక, ఆర్థిక పరిస్థితులు కావచ్చు. అందుచేత ఆ వర్గంలోని నవలా సాహిత్యంలో చాలా కాళీలు ఏర్పడ్డాయి. ఏర్పడుతున్నాయి. ఆ ఖాళీలను పూరించాల్సిన బాధ్యత తెలుగు సాహితీకారుల పై ఎంతైనా ఉన్నది.

"ఇతిహాసపు చీకటి కోణం అట్టడుగున పడి కాన్పించని కథలన్నీ కావాలిపుడు, దాచేస్తే దాగని సత్యం రావాలిపుడు" అన్న శ్రీ శ్రీ మాటలను నిజం చేస్తూ ఈ సందిగ్ధ సమయాన ఇటీవల కె.వి.మేఘనాథ్ రెడ్డి చిత్తూరు జిల్లా మొరుసునాడు సజీవ భాషలో వచ్చిందే 'పాయి దరువులు' యానాది జీవితపు నవల. దీన్ని ఆ ఖాళీలను పూరించే గొప్ప ప్రయత్నంగా చూడవచ్చు.

ఆధిపత్య నిచ్చెన మెట్ల సమాజంలో దళిత ఆదివాసీలు అణచివేతకు గురవుతూనే వున్నారు. అందునా యానాది జీవితాలు అత్యంత దుర్భరమైనవి. వీరికి స్థలాన్ని బట్టి పేర్లు, పనులు మారిపోతుంటాయి తప్ప, వీరి బతుకులెప్పుడూ భారమే. వీరిని కొన్ని చోట్ల ఇరలోల్లంటే, మరికొన్ని చోట్ల చెంచులంటారు. ఒక చోట ఎలుకలు పడితే యింకో చోట పాములు పడుతారు. మరికొన్ని చోట్ల ఒడుపుగా వెదురు బుట్టలల్లుతారు. మొత్తానికి అడవిలో క్రూర జంతువులను సైతం వేటాడిన బలమైన సమూహం. నేటి సాంఘిక సమాజంలో బలహీనమైపోయి Habitual Offenders (తరచూ దొంగతనంచేసే నేరస్థులు) అనే ముద్రతోనే బతకాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏర్పరిచారు. అయితే కొంతమంది త్యాగాల వలన ఒక తరానికి యింకో తరానికి మధ్య ఆలోచన స్థాయిలో, శైలిలో, సామాజిక చైతన్యంలో, అవగాహనలో సుస్పష్టమైన తేడాలున్నాయి. ముందు తరమోళ్ళకి అన్యాయం జరిగినా, నోరు మెదపకుండా అణిగిమణిగి భయపడుతూ బతుకీడ్చిన పాత తరం ఒకపక్క వుంటే అదే అన్యాయాన్ని మనసులో పెట్టుకొని గుండె ధైర్యంతో ఎదిరించే 'పాయి దరువు' నవలలోని నేటి తరపు యానాది చిన్నమ్మి గొప్ప ఉదాహరణ. ఈ నవల యానాది జీవితాన్ని, జీవన విధానాన్ని, అణచివేతను, అన్యాయాన్ని మాత్రమే చిత్రించలేదు. దానికి వ్యతిరేకంగా ఎదిరించిన బతుకు పోరును, మురికెరగని మట్టి మనుషుల సంబంధాలని, రంగులద్దని మట్టి భాషతో చిత్రించిందీ నవల.

"చందమామ వో.. చందమామ/ చిన్నమ్మి జాడేదే చందమామ/ అడివి దావల్లో, అల్చంద రాయిల్లో/ మెతుకు కాళ్ళతో, రాయితొక్కడతో/ ఏడేడ చిత్ర సెమ పడ్తుందాదో..!/ ఏడనేసి దొమ్మదాయికాలు పడ్తుందాదో..!!" అని పాపులమ్మ పాడే పాటొకటి చాలు చిన్నమ్మి బతుకు పోరు ఏపాటిదో చెప్పడానికి. చిన్నమ్మి చాలా కాలం వరకు గుండెలో గుర్తుండిపోయే సజీవ పాత్ర. ఎందుకంటే ఎవరి ప్రేమను పొందకుండానే అందరికీ సమానంగా ప్రేమను పంచే ప్రేమమూర్తి. వారానికి మేపిన బొల్లిమేకకి తమ బిడ్డలైన లింగాలగోడుకి పాయి దరువులేసిన (విడదీసిన) ఆధిపత్య, భూస్వామి రాజయ్య. పుట్టినప్పుడే అనాథైన లింగాలగోడిని చిన్నమ్మి తనలాగే ప్రేమిస్తుంది. లింగాలగోడికి పాల్తపిచ్చడానికి వొచ్చిన రాజయ్య కొడుకు ఆనందుడిని తనలాగే ప్రేమిస్తుంది. ఆనందుడితో పాటు అడివికి వచ్చిన కుక్కపిల్ల పొట్టోడిని తనలాగే ప్రేమిస్తుంది. ఈ విషయంలో చిన్నమ్మి యేసు క్రీస్తు చెప్పిన "నీలాగే నీ పొరుగు వారిని ప్రేమించుమూ" అన్న మాటలు గుర్తుకొస్తాయి.

తమను తరతరాలుగా వేధిస్తున్న రాజయ్య కొడుక్కి కూడా అడివిలో జాగ్రత్తలు చెప్పిన అడివి మల్లెపువ్వులాంటి మనసున్న బాయన్న తారాస పడుతాడు.

లింగాలగోడు కనిపించక పోతే అడవింతా వెతికిన చిన్నమ్మి ప్రేమ, తపన, పట్టుదల కనిపిస్తుంది. దొడ్డి నుంచి అడవికొచ్చేసరికి అలిసిపోయి శ్యాలమానొంక దగ్గిర నీల్లు తాగితే మనమూ కాసేపు మేకలతో పాటు సేదదీరుతాం.

వోడేసెట్ల గుంట కాడ చిన్నమ్మి ఆనందుడికి సంగటితో పాటు చింతొక్కిస్తే మన నాలుకూరి లొట్టలేస్తాం. గంగమ్మ జాతర కోసం లింగాల మేకపోతుని బలి కుట్టిగా నిర్ణయించి రాజయోల్లు చెవులు కోస్తే మనమూ అల్లాడిపోతాం. బాధపడిపోతాం. పాపులమ్మతో పాటు మనమూ ఒకరుగా గుడిసెలో నిలబడి దిగులుపడతాం. కౌండిన్య అడివి, కలుంకూరి గుట్ట మొత్తాన్ని మేకలతో పాటుగా మనం కూడా ఓసారి తిరగాడిన అనుభూతి పొందుతాం.


అక్కడున్న వైదిగం చెట్లను, పుట్లను చూసొస్తాం. మేక కాపరుల్లో ఒకరిగా వుంటాం. చిన్నమ్మిపై లింగాల మేక ద్వారా ఆధిపత్య రాజయ్య పన్నిన కుట్రను చూసి కోప్పడతాం. ఇలా మనం కూడా నవల్లోని పాత్రల్లో ఒకరిగా, నవలతో పాటుగా ప్రయాణిస్తాం.

యానాదుల ఆయుధమైన గసిగ కర్ర (గూసి కొయ్య) వారికి ఏవిధంగా తోడుంటాదో, ఈరమ్మ సినబ్బకు యానాది కులదైవం కన్నియమ్మ తన మహత్యంతో కాపుగాస్తాదో, నారప్ప కుండ డప్పు కొడితే యానాది గుడిసెలంతా ఏవిధంగా చిందులాడిందో స్పష్టంగా బొమ్మ కడతాడు రచయిత. తన రచనాశక్తితో, శైలితో, సామర్థ్యంతో సమర్థవంతంగా నడిపిన తీరు పాఠకుడిని ఏకబిగిన నవలను అమాంతం చదివిస్తుంది. నవల మొత్తం రచయిత వాడిన మోరుసునాడు యాస, భాష నవలకు అదనపు సింగారాన్ని, సొగసును చేకూర్చింది. నవలలోని చాలా పదాలు తెలుగు సాహితీ నిఘంటువుల్లో చేర్చదగినవి. అర్థాలు తెలుసుకోదగినవి. మనసులో ఇంకిపోయి మనసును శుద్ధి చేసే వొడేసేట్ల గుంట నీరు లాంటిది.

పెద్దబ్బి భార్య బూలచ్చిని ఆధిపత్య కామహంకారుడు రాజయ్య చెడిపి చంపితే, ఏమిచేయలేని నిస్సహాయ స్థితిలో తప్పంతా తమదేనని ఒప్పుకున్న పాపులమ్మ ఒకపక్క ఏడుస్తాంటే, చంపింది ఎవరని తెలిసినా ఏమిచేయలేని తనంతో బాధపడిపోయి, భార్యమీదున్న ప్రేమతో తాను చనిపోయిన పెద్దబ్బి మరణం యింకో పక్క ఏడిపిస్తుంటే, వీరిమధ్య నేదర బిడ్డప్పుడే అనాధగా మిగిలిన చిన్నమ్మి బాధపెడుతుంది. నిజాన్ని చిన్నమ్మికి తెలియకుండా దాచేస్తూ వచ్చిన చిన్నాయిన బోడెన్న. బతుకు పోరులో కడుపు కోతతో అడవుల్లో కాయకష్టం చేసే చిన్నమ్మి, తల్లిని మంటుబెట్టిన రాజయ్య కొడుకు ఆనందుడుతో ప్రేమలో పడి, ఆ తర్వాత కొంత కాలానికి జరిగిన సంగతి తెలిసి రాజయ్యని ఏం చేస్తుంది? ఆనందుడుపై ప్రేమతో తల్లిని చంపిన రాజయ్యను వదిలేస్తుందా? లేదా చిన్నమ్మి కన్నియమ్మగానో, కాళీ మాతగానో మారి వధించిందా? చిన్నమ్మి ఆనందుడు కలుస్తారా? చిన్నమ్మి ప్రాణానికి ప్రాణంగా పెంచుకున్న లింగాల మేక ఏమవుతుంది? చిన్నమ్మినే తనకున్న ఏకైక దిక్కుగా భావించిన పాపులమ్మ ఎలా బతుకుతాది? అనేదే నవల. ఇదంతా తెలియాలంటే పాయి దరువులు నవల చదవాల్సిందే. మూల వాసుల గోసను, యానాది గుడిసెల గాయాల వెతలను కథలు కథలుగా వినాల్సిందే.

ఈ నవల చదివిన తర్వాత ఒక మంచి పల్లె ప్రేమను సినిమాగా చూసినంత తృప్తినిస్తుంది. యానాది జీవితాల పట్ల స్పష్టమైన అవగాహనను తెప్పిస్తుంది. చిన్నమ్మి ప్రేమ, ప్రాణ త్యాగాలు మనల్ని వెంటాడతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆదివాసీ గిరిజన నవలా సాహిత్యంలో మైలు రాయిగా ఈ నవలను పేర్కొనవచ్చు. గొప్ప చేర్పుగా భావించొచ్చు. రచయిత కె .వి. మేఘనాథ్ నుంచి మరిన్ని రచనలు రావాలని కోరుకుందాం.

- గిడ్డకింద మాణిక్యం, 9492164107



> **"ఇతిహాసపు చీకటి కోణం అట్టడుగున పడి కాన్పించని కథలన్నీ కావాలిపుడు, దాచేస్తే దాగని సత్యం రావాలిపుడు" అన్న శ్రీ శ్రీ మాటలను నిజం చేస్తూ ఈ సందిగ్ధ సమయాన ఇటీవల కె.వి.మేఘనాథ్ రెడ్డి చిత్తూరు జిల్లా మొరుసునాడు సజీవ భాషలో వచ్చిందే 'పాయి దరువులు' యానాది జీవితపు నవల. దీన్ని ఆ ఖాళీలను పూరించే గొప్ప ప్రయత్నంగా చూడవచ్చు.**

వరదలు!



కష్టపడి పండించిన పంట
అల్ప పీడనాల సుడిగుండంలో పడిపోతే
ఆ రైతుకి ఎంత కష్టం?
కడుపు కాలు కట్టుకొని
అప్పుల వంతెన మీద కత్తుల నడకతో
నిత్యం కన్నీరు కార్చినా
చేతికందివచ్చే సమయంలో
ఉరుములేని పిడుగులా
అకాల సకల వర్షం కుంభ వృష్టిగా మారితే
ఇక కన్నీటి వరదల్లో కొట్టుకుపోయేను
కల్తీ ఎరువులనించి దళారి దోపిడీలనుంచి
అడవి జంతువుల విధ్వంసం నుంచి
కన్న బిడ్డలా కాపాడుకున్నా
తీరం దాటని తుఫానొకటి బలి తీసుకుంది
ప్రభుత్వాలెన్ని మారినా
సగటు రైతు బతుకు ఎప్పుడు నీటి మీద రాతనే
వాగ్దానాలు చేసి గద్దె ఎక్కినా
వాడి బతుకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే.
ప్రతి రంగానికి హక్కులు ఉంటాయి
ఒక్క రైతుకి మాత్రమే బాధ్యతలు
నోరున్న మూగ జీవి
గొంతు ఎత్తలేక కంట నీరుతో విలపిస్తున్నాడు
ప్రతి కాలం పరీక్షలు పెడుతూ రైతు ఉసురు తీస్తుంది
కొన్ని వేల సార్లు చస్తూ బతుకుతూ
రేపటిపై ఆశతో ముందుకు సాగుతాడు ..
ఇంత అన్నం పెట్టే రైతుని
వరదలు కబళించకుండా కాపాడుకొంటేనే
వాడు మిగులుతాడు
లేదంటే వరదల్లో కొట్టుకుపోయిన
ఒక అనాథ శవమే వాడిది ..

- పుష్యమీ సాగర్, 7997072896

పాలమూరు వలస బతుకుల వ్యథా చిత్రాలే 'ఉయ్యాల కథలు'

నిరుపేదల చిత్రాలన్నీ ఒక్క తీరే! బడుగు బతుకుల కష్టాలన్నీ ఒక్క తీరే! శ్రమ దోపిడీకి గురయ్యే బతుకు వేదనలన్నీ కన్నీటి మూటలే! కన్నీరు కార్చటమే సమస్యకు పరిష్కారమైతే ఇట్లాంటి కథలకు అర్థమే లేదు. కన్నీటి నుంచి కసి రగిలించే, దోపిడీ పట్ల పిడికిలి బిగించే, దైన్యం నుంచి ధైర్యం నూరిపోసే, కథలే కావాలిప్పుడు.

డాక్టర్ గీతాంజలి గారి 'ఉయ్యాల కథలు' ఈ దేశపు నిర్లక్ష్యపు వురికొయ్యకు వేలాడుతున్న దైన్యపు గాథలు. పాలమూరు ఈ దేశపు ప్రతి మారుమూలకూ ప్రతీక. ఏ పల్లెలో అడుగిడినా కనబడేవి ఉన్న ఊరితో, కన్నతల్లితో పేగు బంధాలు ఛిద్రమై పరాయీకరించుకున్న శ్రమ బంధాల యదార్థ గాథలు. వ్యథార్థ జీవుల పరివేదనలు. నిరంతరం శ్రమ సంబంధాల్లో అడుగడుగునా మోసపోయే బలి పశువుల దీనగాథలు.

ఎటు చూస్తే అటు దగా, వేదన, ఆకలి, దు:ఖం, నిస్సత్తువ, నిస్తేజం, మోసం, నిష్కపటత్వం. అనుక్షణం మోసపోతూ, రెక్కలు ముక్కలు చేసుకుని కల్తీ లేని శ్రమ అందిస్తూ కూడా, కల్తీ ఆహారం తింటూ, కల్తీ మందులు తాగుతూ, కల్తీ విద్యా, కల్తీ వైద్యం, కల్తీ సరుకులు పొందుతూ బతుకు వెళ్ళమార్చడమే జీవితం అనుకుంటే ఈ కథలు వాటికి దర్పణాలు. ఇందులోని ఏడు కథలు ఏడిపించే కథలే. ఏడిపించి వదిలేయడమే కాదు, ఏదో ఒకటి చేయమని గుండెల్లో గుబులు పుట్టించే కథలు. గీతాంజలి గారి కథనాలన్నీ ఏడిపిస్తాయి. అదే సమయంలో పిడికిలి బిగించడాన్ని కూడా నేర్పిస్తాయి. ఈ కూట నీతుల్ని ప్రశ్నించమని అర్థిస్తాయి.

మొగడు పోయిన ఒంటరి ఆడది భాగ్యమ్మ కథ 'ఎండి గజ్జలు'లో వందల భాగ్యమ్మలు దాగి ఉంటారు. చిరు ఆశల్ని కూడా తీర్చుకోలేని వేల మంగలు వుంటారు. కట్నం కాటుకు బలయ్యే వేల అపర్ణలు వుంటారు. ఇంట్లో కుంపటిలా ఎదుగుతున్న మంగ. చదువుకుంటానని ఒక్కతీరున ఏడ్చే మంగని పూల కొట్టు సేటు దగ్గర పనికి కుదుర్చుతుంది. నెత్తి మీద అప్పులు. మిత్తి కోసం తల వంపులు. ఎండి గజ్జలంటే ప్రాణం పెట్టే మంగను సేటు కొడుకు మాయమాటలతో మోసం చేస్తాడు. ప్రతి గల్లీలో ఉండే ఈ సేట్లు ఎందరో మంగల్ని తాయిలాలతో వశం చేసుకోవడం ఇక్కడ మామూలే.

రెక్కలు విరుచుకొని పని చేసే భాగ్యమ్మకి ఎండి గజ్జెలు బిడ్డకు కొనివ్వకుండా ఆపింది సేటూ, మిత్తీ కట్టేదాకా వదలని షావుకారూ కాదు. అపర్ణ ప్రాణం తీసింది కట్నం కాదు! అయ్యను చంపిందీ, బిడ్డని చంపిందీ, మంగ ఎండి గజ్జల కోసం తన వయసును పణంగా పెట్టిందీ, రేపో మాపో భాగ్యమ్మని చంపేదీ, శ్రమించకుండా బద్ధకించినందుకు కాదు! రెక్కలు ముక్కలు చేసుకున్న శ్రమంతా దోపిడీ గాడి గాదెల్లో మూలగటానికి వెళ్ళిపోయి చేతిలో చిల్లి గవ్వలు కూడా మిగలక పోవడమే! నెత్తురోడ్చి, పొద్దస్తమానం చిత్తడై, ఛిద్రమై, రూపాయలు వాడికిచ్చి, పైసలతో ఇంటికొస్తే ఆ పైసలు మిత్తీలకు పోయి నోటికాడ కూడు లేకుండా పోయిన దైన్యం కాదా చంపేది? శ్రమ చేయనందుకు కాదు, శ్రమ చేసిన చేతులకి, న్యాయంగా రావాల్సిన ఫలితాన్ని అందకుండా చేయడం వల్లే అని చెప్పటమే అసలు విషయం.

మేస్త్రీ మోసంతో రైలెక్కిన కూలీలు ఎన్నడూ చూడని మంచునేలమీద అడుగిడి, రాజధాని వీధుల్లో చేతులు చాపి, బిడ్డని అమ్ముకునే కర్మలు అనుభవించి, కష్టమ్మ ఒడ్డున పుట్లు పండించి, వట్టి చేతులతో ఇంటికి పోలేని దైన్యం పాలమూరు నుంచి కాశ్మీరు కథ. కన్న వూరిని వదిలేయడం అంటే మృత్యు వేదనే!

టిప్పర్ బోల్తా కొట్టి రెక్కలు విరిగి చావుబతుకుల్లో కొట్టుకొనే వార్తలు ఈ దేశంలో వినని రోజుంటుందా? దేశం గాని దేశంలో పనికెళ్లి బతుకుపోరులో కృష్ణమ్మ తనువు చాలించి శవమై ఇంటికొస్తుంది. బొందిలో ప్రాణం ఉన్నంత కాలం పుట్టిన వూరుతో బంధం పెనవేసుకొని వుంటుంది. అయినా అందరికీ ఆ అదృష్టం ఉండదు. కొందరికి చస్తే తప్ప! హృదయ విదారకమైన ఈ వేదనలన్నీ వలస బతుకుల్లో సర్వసాధారణమైపోయాయి. కృష్ణమ్మ కథ గుండెల్ని పిలుస్తుంది. సరిగ్గా ఇదే వేదనతో కనీసం ఇంటికి కూడా చేరలేని వలస కూలి బాలయ్య కథ ప్లాట్ఫారం నెంబర్ 34 కంటతడి పెట్టిస్తుంది.



స్త్రీ స్వేచ్ఛల జెండా రెపరెపలు అంతర్జాతీయ వేదికల్లో ఎగురుతుంటాయి ఓ వైపు. అయినా సరే ఈ దేశపు దళితవాడల్లో తన మాంసాన్ని తన ఇష్టం లేకుండానే పందారం చేసే అనసూయ లాంటి జోగినిలు ఈ దేశపు గుండెల మీద బర్త్ మార్క్‌లా సిగ్గు కోసం కప్పుకున్న వలువ పక్కకు తప్పుకున్నప్పుడల్లా కనబడుతూ వుంటారు విచిత్రంగా! ఉయ్యాల మీద ఆసేతు హిమాచలం శవమై నగ్నంగా ఊగుతూ పోగొట్టుకున్న ఈ దేశపు పరువును నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటుంది.

పోలేపల్లి పీనుగ ఈ దేశపు అంతరాత్మ! ఆత్మ వంచనా శిల్పం. హస్కు కొట్టే పందుల దొడ్లకు కోట్ల కొద్ది ప్రజాధనాన్ని వెచ్చించటం నేరం కాదని అనుకోవడమే పెద్ద నేరం. నిలబడటానికీ, చస్తే పాతి పెట్టడానికీ, నిరంతరం అదే నేలతో మమేకమై బతికే ఈ జీవచ్ఛవాల కోసం ఆరడుగుల నేల కూడా లేకుండా చేసి కోటి పీనుగల్ని ఒకేసారి తగలేసేటంత సెజ్జులను వాడేసుకునే బతికున్న పీనుగుల కథ ఇది! నేలతల్లి గుండెల మీద నల్ల తారు పూయడమే అభివృద్ధి ఎలా అవుతుందో ఈ కథ అడుగుతుంది.

సంపదలు సృష్టించి, ఈ దేశపు వెన్నెముకను నిటారుగా నిలబెట్టడం కోసం తామెలా వెన్ను విరుచుకొని కొవ్వత్తిలా కరుగుతారో ఈ కథలోని కృష్ణమ్మలు, చంద్రమ్మలు, భాగ్యమ్మలు, ఎల్లమ్మలు, అనసూయమ్మలు, రషీదాలు చెబుతారు. ఎవరికీ పట్టని ఈ అమాయకపు జీవుల నెత్తుటి కూడుని నిర్లజ్జగా మేసే ధనికస్వామ్యం పతనం కావలసిన అవసరాన్ని ఈ కథల్లో ప్రతిభావంతంగా చెప్తారు.

- వి.విజయకుమార్

'కరీంనగర్ కథలు' పుస్తక పరిచయ సభ

రంగినేని సుజాతా మోహన్‌రావు ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ సిరిసిల్ల ఆధ్వర్యంలో 'కరీంనగర్ కథలు' పుస్తక పరిచయ సభ ఈ నెల 14వ తేదీ ఉదయం 10.30 గంటలకు రంగినేని ట్రస్ట్, కరీంనగర్‌లో జరుగుతుంది. ఈ సభకు రంగినేని మోహన్‌రావు, ఆచార్య సి.మృణాళిని, అల్లం రాజయ్య, ఆచార్య సి.కాశీం, జూకంటి జగన్నాథం, డా॥నలిమెల భాస్కర్, రంగినేని నవీన్ కుమార్ హాజరవుతారు.

కవి సంధ్య స్వర్ణోత్సవ సంచిక, కవన కోకిలలు ఆవిష్కరణ

ఈ నెల 14, ఉదయం 10గంటలకు రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలులో కవి సంధ్య 50 వ సంచిక ఆవిష్కరణ సభ జరుగుతుంది. శివారెడ్డి, రమణాచారి, కె. శ్రీనివాస్, వాడ్రేవు చినవీరభద్రుడు, మామిడి హరికృష్ణ, దాట్ల దేవదానంరాజు, ఏనుగు నరసింహా రెడ్డి, కోయి కోటేశ్వరరావు, గూటం స్వామి పాల్గొంటారు. ఇదే సభలో నాగరాజు రామస్వామి గారి 'కవన కోకిలలు' పుస్తకం ఆవిష్కరణ, అంకితం ఉంటుంది.

- శిఖామణి, కవి సంధ్య

బెల్లి యాదయ్యకు ఉదారి నాగరాజు స్మారక అవార్డు

కవి ఉదారి నాగదాసు స్మారక కవితా అవార్డును ఈ సంవత్సరం ప్రముఖ కవి బెల్లి యాదయ్యకు ప్రకటించారు. ఈ అవార్డు ప్రదానం ఈ నెల 15వ తేదిన ఆదిలాబాద్‌లో జరుగుతుంది.

- డా. ఉదారి నారాయణ, 9441413666

వర్గీకరణ సంఘీభావ కవితల కోసం

ఎస్సీ, ఎస్టీల్లో అభివృద్ధి పరంగా మరింత వెనకబడ్డ కులాలు, జాతులకు విద్య, ఉద్యోగ రంగాలలో ప్రాధాన్యతతో కూడిన పంపిణీ న్యాయం కల్పించడానికి సుప్రీమ్ కోర్టు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన అధికారం ఉందని తీర్పులో స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణకు సంఘీభావంగా తీసుకురాబోయే పుస్తకానికి వచన, పద్య కవితలను అక్టోబర్ 15 లోగా పంపవల్సిందిగా ఆహ్వానిస్తున్నాం. కవితలు పంపవలసిన అడ్రస్: ప్లాట్ - 297,రోడ్ - 21, సెక్రెటేరియట్ కాలనీ, సియుసి పోస్ట్,గచ్చిబౌలి, హైదరాబాద్ - 500046 వాట్సప్ నంబర్లు: 9441091305, 9948311667, మెయిల్ ఐడి - joopakasubadra@gmail.com

నా కంటే ముందే...

వాళ్ళు పిలిచారని ఆనందంగా వెళ్ళాను
కానీ నా కంటే ముందే నా కులం అక్కడికి వెళ్ళిందని వెళ్ళాక తెలిసింది.
నా ముఖాన్ని జత చేస్తూ వేసిన
ఓ కుర్చీ నాపై జాలితో ఓ వైపుగా ఒదిగి చూస్తుంది.
నా గురించిన మాటలు చెల్లాచెదురుగా
అప్పటికే పడివుండటం చూసి నేనేంటో అక్కడ వెతొక్కోసాగాను
అతుకులేసిన మర్యాద సగం సగం చూపులతో
ముఖాన్ని గీసుకుంటూ నలుగురి మధ్యలో నా ప్రతిభ వేదికెక్కకుండా
ఎక్కడ నా పేరుకు రెక్కలు మొలిచి ఊరంతా ఎగురుతాయోనన్న
భయాన్ని కనిపించనీయని నటన నా మనసుకు మంటపెట్టి
దూరాన్ని చాలా దగ్గరగా చూపుతూ ఒంటరితనాన్ని మెడకు చుట్టి
మూలన కూర్చోబెట్టింది కిక్కిరిసిన ప్రసంగాల్లో
నా అక్షరం ఎవరి గొంతులోనో మెరిసి
తలలన్ని బొంగారాళ్లా నా వైపు తిరిగినా
వివక్ష పొడిపొడి ప్రశంసల్లో దాగి ఏ క్షణం నిద్రపోకుండా
ఏదో ఓ రూపంలో అహాన్ని చూపాలని కాచుకోవడం ప్రత్యక్ష అనుభవం.
ఐతే ఎప్పటికైనా నిజం, వివక్ష ఎదురుపడే రోజున
ఔను... నేనొస్తున్నని తెలిసి నా కంటే ముందు ఆ వివక్ష
పారిపోయే రోజు ఒకటి వస్తుంది.

- చందలూరి నారాయణరావు, 9704437247

ధ్వంసమైన రహదారుల పరిశీలన

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ఇటీవల కురిసిన వర్షాలు, ఆకేరు వరదకు మండలంలోని మంగళగూడెం నుంచి తనగంపాడు రహదారి ధ్వంసమై రాకపోకలు నిలిచిపోయాయి. ధ్వంసమయిన రహదారిని రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ హేమలత శనివారం పరిశీలించారు. రహదారి కొట్టుకుపోవడం వల్ల తాము పడుతున్న ఇబ్బందులను స్థానిక నాయకులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. రహదారులకు మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరిస్తామని హేమలత తెలిపారు.కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ డైరెక్టర్ కన్నేటి జ్యోతి



నరసింహారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మండల పరిషత్ శుభ్రం...

ఇటీవల వచ్చిన వరదలకు మండలంలో జలగంనగర్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులు, ఫర్నీచర్ మొత్తం తడిసి ముద్దయింది. కార్యాలయ సిబ్బంది తడిసిన రికార్డులు, ఫర్నీచర్‌ను బయట వేసి కార్యాలయాన్ని శనివారం శుభ్రం చేశారు.

విద్యుత్తు లైన్ల పునరుద్ధరణ పనుల పరిశీలన...

మున్నేరు వరదకు దెబ్బతిన్న విద్యుత్తు స్తంభాలు, సబ్ స్టేషన్ పునరుద్ధరణ పనులను విద్యుత్తుశాఖ ఎస్ఈ సురేందర్ ఆదివారం పరిశీలించారు. మండలంలోని వెంకటగిరి, గుర్రాలపాడు, పెద్దతండా పంచాయతీలోని దెబ్బతిన్న విద్యుత్తు లైన్ల పునరుద్ధరణ పనులను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యుత్తు సరఫరా గురించి స్థానిక ప్రజలు, రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏదులాపురం ఏఈ క్రాంతిసింహా, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు అండగా సీపీఐ(ఎం)

- దాతలు ముందుకు రావాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



నవతెలంగాణ-ఖమ్మంరూరల్

మున్నేరు వరదల్లో సర్వం కోల్పోయిన వరద బాధితులకు సీపీఐ(ఎం) అండగా ఉంటుందని పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కాచిరాయిగూడెం పంచాయతీ పరిధిలోని వాల్యాతండాలో వరద బాధితులకు సుమారు 150 మందికి నెల రోజులకు సరిపడా నిత్యవసరాలు మ్యాంగో ట్రీ హెూటల్ అధినేతలు సత్యనారాయణ, ఆదర్శ్ సహకారంతో ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా నున్నా మాట్లాడారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడమే కాకుండా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలకు సహాయం అందించడంలో సీపీఎం ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందన్నారు. మ్యాంగో ట్రీ అధినేతలైన సత్యనారాయణ, ఆదర్శ్‌లను ప్రత్యేకంగా అభినందించారు. ఇటువంటి విపత్తుల సమయంలో దాతలు ముందుకు వచ్చి బాధితులకు, పేదవాళ్లకు అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

కస్నాతండా గ్రామంలో...

మండలంలోని కస్నాతండా గ్రామంలో వరద బాధితులకు సీపీఎం సీనియర్ నాయకులు డాక్టర్ బత్తినేని వెంకటేశ్వరరావు ఆదివారం రెండు క్వింటాల బియ్యం, దుస్తులు అందజేశారు. కొల్లి ప్రేమ్ దీప్ సహకారంతో అందజేసినట్లు డాక్టర్ బత్తినేని తెలిపారు. జలగంనగర్, సాయిప్రభాత్‌నగర్‌లో వరద బాధితులకు సీఐటీయు అఖిల భారత కోశాధికారి మందాడపు సాయిబాబా భవన నిర్మాణ కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పాక్షికంగా దెబ్బతిన్న కుటుంబాలకు రూ.2లక్షలు, పూర్తిగా దెబ్బతిన్న ఇండ్లకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాలలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.విక్రమ్, భూక్య వీరభద్రం, మ్యాంగో ట్రీ అధినేతలు సత్యనారాయణ, ఆదర్శ్, కొల్లి ప్రేమ్ దీప్, నరేష్, సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి పి.మధు, జిల్లా సహాయ కార్యదర్శి పి.మోహన్‌రావు, పార్టీ మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్, సీఐటీయు నాయకులు ముదాం శ్రీనివాస్‌రావు, నవీన్‌రెడ్డి, పిట్టల రవి, సీపీఎం నాయకులు పొన్నం వెంకటరమణ, అద్దంకి తిరుమలయ్య, కారుమంచి గురవయ్య, భూక్య నాగేశ్వరరావు, యల్ది వెంకటరమణ, వట్టికోట వెంకన్న, దొడ్డ భారతమ్మ, గురవయ్య, డివైఎఫ్ఐ ఖమ్మంరూరల్ మండల అధ్యక్షుడు జక్కంపూడి కృష్ణ, నాయకులు పొన్నం భాస్కర్‌రావు, చాంద్ పాషా, నాగేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి రామకృష్ణ చిరస్మరణీయుడు

- సంస్కరణల వ్యతిరేక పోరాటంలో నేలకొరిగిన అమరుడు
- వర్ధంతి సభలో పి.సోమయ్య, నున్నా



నవతెలంగాణ-ఖమ్మం

2000 సంవత్సరంలో నాటి టీడీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రపంచ బ్యాంక్ ఆర్థిక సంస్కరణల ఫలితంగా కరెంట్ చార్జీలు విపరీతంగా పెంచడంతో సామాన్య, పేద ప్రజలపై తీవ్ర భారం పడిందని, దీనికి వ్యతిరేకంగా వామపక్షాలు ఛలో అసెంబ్లీకి పిలుపు నిచ్చాయని, ఈ సందర్భంగా బషీర్‌బాగ్‌లో జరిగిన పోలీసు కాల్పులలో మరణించిన సత్తెనపల్లి రామకృష్ణ చిరస్మరణీయుడని, సంస్కరణల వ్యతిరేక పోరాట యోధులకు ఆదర్శప్రాయుడని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పి.సోమయ్య, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావులు అన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయం సుందరయ్య భవనంలో సత్తెనపల్లి రామకృష్ణ చిత్రపటానికి పి.సోమయ్య, పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రం అధ్యక్షతన జరిగిన 24వ వర్ధంతి సభలో వారు మాట్లాడుతూ నాడు కమ్యూనిస్టులు సంస్కరణల విషయంలో ఏం చెప్పిందో నేడు అన్ని రంగాలలో అదే జరుగుతుందని, సంస్కరణల దుష్ఫలితాలు కనపడుతున్నాయని అన్నారు. విద్యుత్ పోరాట స్ఫూర్తి అనేక ప్రజా ఉద్యమాలకు నాంది పలికిందని అన్నారు. విద్యుత్ ఉద్యమంలో అమరులైన వారి త్యాగాల ఫలితమే నేడు ఉచిత విద్యుత్ అని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యుత్ నియంత్రణ అమలు చట్టం తీసుకొచ్చిందని, దీని వలన పేద ప్రజలకు, రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. నేడు అన్ని రకాల వస్తువుల ప్రత్యక్ష ధరలలో పెరుగుదల, వ్యవసాయ సంక్షోభం, నిరుద్యోగం, ఉన్న ఉద్యోగాల కుదింపు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కనీస వేతన సమస్యలు, మహిళల ఇబ్బందులు, వ్యవసాయ కూలీల సమస్యలు, మతోన్మాదం రోజురోజుకు తీవ్రస్థాయిలో పెరుగుతున్నాయని విమర్శించారు. నాటి విద్యుత్ పోరాటం వలన ఆ తరువాత వచ్చిన ప్రభుత్వాలు విద్యుత్ ఛార్జీల పెంపుదలకు సాహసించ లేకపోయాయని, దీనికి కారణం నాటి విద్యుత్ అమరవీరుల పోరాట స్ఫూర్తేనని అన్నారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రపంచ బ్యాంక్ విధానాలనే అవలంభిస్తున్నాయని, ప్రజలపైన భారాలు మోపుతున్నాయని అన్నారు. సత్తెనపల్లి రామకృష్ణ పోరాట పటిమను నేటి యువతరం ఆదర్శంగా తీసుకొని ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఇదే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బుగ్గవీటి సరళ, బండి రమేష్, రాష్ట్ర నాయకులు ఎం.సుబ్బారావు, జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు, మెరుగు సత్యనారాయణ, బండారు రమేష్, నందిపాటి మనోహర్, ఎస్‌కె బషీరుద్దీన్, పిన్నింటి రమ్య, ఆర్.ప్రకాష్ నాయకులు టిఎల్.నర్సయ్య, బోడపట్ల రవీందర్, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, డాక్టర్ భారవి, నాదెండ్ల శ్రీనివాస్, వై.శ్రీనివాసరావు, జె.నాగేశ్వరరావు, రఫి, ఎ.విప్లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోనకల్ : విద్యుత్తు పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని, ఈ పోరాటంలో ఖమ్మం పట్టణానికి చెందిన సత్తెనపల్లి రామకృష్ణ అమరుడయ్యాడని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల భవనంలో సత్తెనపల్లి రామకృష్ణ వర్ధంతిని పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తెనపల్లి రామకృష్ణ చిత్రపటానికి పొన్నం వెంకటేశ్వరరావు, పార్టీ మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోతు పంతు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బంధం శ్రీనివాసరావు, బోనకల్ మాజీ సర్పంచ్ భూక్య జాలు, మండల కమిటీ సభ్యులు తెల్లాకుల శ్రీనివాసరావు, సిపిఎం మోటమర్రి శాఖ కార్యదర్శి పిక్కల సీతారాములు, నాయకులు ఉప్పర శ్రీను, ఏసుపోగు బాబు తదితరులు పాల్గొన్నారు.

వైరాటౌన్ : ప్రపంచ బ్యాంకు విధానాల ప్రతిఘటన పోరాట యోధుడు సత్తెనపల్లి రామకృష్ణ అని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు అన్నారు. ఆదివారం వైరా సిపిఎం కార్యాలయంలో విద్యుత్ పోరాట యోధుడు సత్తెనపల్లి రామకష్ణ 24 వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిపిఐ(ఎం) వైరా మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, మాజీ ఎంపిపి బొంతు సమత, కురుగుంట్ల శ్రీనివాసరావు, మల్లెంపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం : సత్తెనపల్లి రామకృష్ణ వర్ధంతి సభని పిండిప్రోలులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, మండల కమిటీ సభ్యులు పప్పుల ప్రసాద్, సీనియర్ నాయకులు కాంపాటి బాబురావు, కెవిపిఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు సోమపొంగు రాము, నాగాటి సురేష్, పప్పుల చిన్న ఉపేందర్, పప్పుల ఉపేందర్, పూజ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.







వరద ప్రాంత ప్రజలను ప్రభుత్వం ఆదుకుంటుంది

- సైడ్ డ్రైనేజీ, కల్వర్టు నిర్మాణానికి వెంటనే ప్రతిపాదనలు పంపండి
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



నవతెలంగాణ - బోనకల్

వరద ప్రాంత ప్రజలను ప్రభుత్వం ఆదుకుంటుందని, బీసీ కాలనీలోని సైడ్ డ్రైనేజీకి, కల్వర్టు నిర్మాణానికి వెంటనే ప్రతిపాదనలు పంపాలని ఆర్అండ్‌బి ఈఈ జి తానేశ్వర్‌ని తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ఇటీవల తుఫాన్ ప్రభావంతో కురిసిన అకాల వర్షాల వలన మండల పరిధిలోని ముష్టికుంట గ్రామంలోని బీసీ కాలనీ వరద నీటికి మునిగింది. దీంతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదివారం వరద నీటికి గురైన బీసీ కాలనీని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బీసీ కాలనీ వాసులు తమ సమస్యలను మల్లు భట్టి విక్రమార్కకు వివరించారు. బీసీ కాలనీలో వర్షపు నీరు ఎటువైపు వెళ్లే పరిస్థితి లేదని, దీని వలన కాలనీ మొత్తం వర్షపు నీటిలోనే మునిగిపోయిందని, దీంతో నాలుగైదు రోజులపాటు తాము తీవ్ర ఇబ్బందులు పడ్డామని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బీసీ కాలనీ నుంచి వర్షపు నీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని, అదే విధంగా సైడ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. దీంతో మల్లు భట్టి విక్రమార్క స్పందించారు. బోనకల్-ఖమ్మం ప్రధాన రహదారిలోని ముష్టికుంట్ల బీసీ కాలనీ వద్ద వరద నీరు, వర్షపు నీరు వెళ్లే విధంగా వెంటనే కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని ఆర్అండ్‌బి ఈఈని ఆదేశించారు. అదే విధంగా బీసీ కాలనీలో వర్షపు నీరు, వరద నీరు వెళ్లే విధంగా సైడ్ నిర్మాణానికి కూడా వెంటనే ప్రతిపాదనలు పంపించాలని మండల ఏఈ మొండితోక నవీన్ కుమార్‌ను ఆదేశించారు. మండల ప్రాథమిక కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పెద్దినేని శ్రీనివాసరావు, హెల్త్ సూపర్వైజర్ మందా దానయ్య, పల్లె దవాఖాన డాక్టర్ ప్రియాంక ముష్టికుంటలో గల ఆరోగ్య ఉపకేంద్రం దిగు ప్రాంతంలో ఉండటం వలన చిన్నపాటి వర్షానికి కూడా మునిగిపోతుందని వినతి పత్రం అందజేశారు. దీంతో భట్టి స్పందిస్తూ ఆరోగ్య ఉప కేంద్రాన్ని వెంటనే పరిశీలించి ప్రమాదకరంగా ఉంటే వెంటనే కూల్చివేసి మరోచోట భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని మండల ఏఈని ఆదేశించారు. ఈ సందర్భంగా ముష్టికుంట గ్రామవాసులు వివిధ సమస్యలపై మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రాలను అందజేశారు. అనంతరం మల్లు భట్టి విక్రమార్క విలేకరులతో మాట్లాడుతూ వరద ముంపు ప్రాంత ప్రజలను ప్రభుత్వం ఆదుకుటుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని కోరారు. రైతుల విజ్ఞప్తి మేరకు మండల వ్యాప్తంగా దెబ్బతిన్న పంటలను వెంటనే సర్వే చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. పంట నష్ట సర్వే అనంతరం రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందన్నారు. దెబ్బతిన్న ప్రతి పంటను వ్యవసాయ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో సర్వే చేయాలని ఆదేశించారు. మండల పరిధిలోని గోవిందాపురం ఏ గ్రామానికి చెందిన షేక్ నాగుల మీర గత ఏడాది ఇంట్లో విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. కానీ విద్యుత్ శాఖ నుంచి పరిహారం అందలేదని మృతుని భార్య షేక్ షాహిని మల్లు భట్టి విక్రమార్కకు వినత పత్రం అందజేసింది. దీంతో డిప్యూటీ సీఎం స్పందించి విద్యుత్ వైరా ఏడిఈ రామకృష్ణను పిలిచి వెంటనే సమస్య పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల తహసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్, ఇన్చార్జి ఎంపీడీవో వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, గిర్దావర్ గుగులోతు లక్ష్మణ్, ఎస్ఐ కడగండ్ల మధుబాబు, మండల విద్యుత్ ఏఈ దొండేటి ఉమామహేశ్వరరావు, మధిర ఆర్అండ్‌బి డి జి శంకర్రావు, ఏఈ కొండూరి శ్రీకాంత్, టిపిసిసి సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్, డిసిసి కార్యదర్శి బంధం నాగేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, కలకోట, రావినూతల సొసైటీ అధ్యక్షులు కర్నాటి రామకోటేశ్వరరావు, మైనేని నారాయణ, కాంగ్రెస్ నాయకులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, చేబ్రోలు వెంకటేశ్వరరావు, బోనకల్ మాజీ సర్పంచ్ బుక్య సైదా నాయక్, కాంగ్రెస్ యువ నాయకుడు బిపి నాయక్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మారుపల్లి ప్రేమ్ కుమార్, మాజీ సర్పంచ్ ఎర్రంశెట్టి సుబ్బారావు, భూక్యా బద్రు నాయక్, గూడ నరసయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకోవాలి : సీపీఐ(ఎం)



నవతెలంగాణ - బోనకల్

తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాల, వరదల ప్రభావంతో దెబ్బతిన్న ప్రజలను ప్రభుత్వమే పూర్తిస్థాయిలో ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు కోరారు. స్థానిక వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల భవనంలో సిపిఎం మండల స్థాయి విస్తృత సమావేశం సిపిఎం మండల కమిటీ సభ్యులు కిలారి సురేష్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అనేక పంటలు దెబ్బతిన్నాయన్నారు దెబ్బతిన్న పంటలను వెంటనే సర్వే చేసి పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తుఫాన్ ప్రజలకు, రైతులకు తీవ్ర నష్టం కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా బోనకల్-ఖమ్మం ప్రధాన రహదారిపై వరద నీరు ఉధృతంగా ప్రవహించడతో ఐదు రోజులు పాటు ఆర్టీసీ బస్సులో రాకపోకలు పూర్తిగా నిలిపివేశారన్నారు. చింతకాని మండలం నాగలవంచ వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు ఆలస్యంగా నిర్లక్ష్యంగా జరుగుతున్నాయని, దీనివలన ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి అన్నారు. వెంటనే బ్రిడ్జి నిర్మాణ పనులు వేగంగా చేపట్టాలని ఆ విధంగా ఆర్అండ్‌బి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ముష్టికుంటలోని బీసీ కాలనీ వరద నీటితో మునిగిపోయిందని, దీనివల్ల అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆ కుటుంబాలన్నింటినీ ప్రభుత్వమే తక్షణ సహాయం చేసే ఆదుకోవాలని కోరారు. మండల అధికారులు అప్రమత్తంగా ఉంటూ తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. మండలంలోని అనేక గ్రామాలలో వరద ప్రభావంతో వాగులు పొంగిన ఎటువంటి ప్రాణాష్టం జరగకుండా మండల అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారని అభినందించారు. ఈ సమావేశంలో నాయకులు గుగులోతు పంతు, దొప్ప కొరివి వీరభద్రం, నిమ్మ తోట ఖాన, నిమ్మల రామారావు, తెల్లాకుల శ్రీనివాసరావు, బంధం శ్రీనివాసరావు, ఉప్పర శ్రీను, భూక్య జాలు తదితరులు పాల్గొన్నారు.

బాణాల బ్రదర్స్‌కు మాతృవియోగం

నవతెలంగాణ-వైరా



సీపీఐ(ఎం) నాయకులు బాణాల శ్రీనివాసరావు, బాణాల కృష్ణమాచారి మాతృమూర్తి పార్వతమ్మ (86) వారి స్వగ్రామం లింగన్నపాలెం గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం మృతి చెందారు. గ్రామంలో పార్టీకి గట్టి పునాది వేసిన బాణాల చిన్న రామయ్య కుటుంబం ఆయన మరణానంతరం కూడా ఆయన కుమారులు శ్రీనివాసరావు పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులుగా, కృష్ణమాచారి పార్టీ గ్రామ శాఖ కార్యదర్శిగా గరికపాడు సొసైటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. పార్వతమ్మకు లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, నాగబ్రహ్మాచారి, కృష్ణమాచారి ఐదుగురు కుమారులు ఉన్నారు. అంత్యక్రియలు సోమవారం మధ్యాహ్నం లింగన్నపాలెంలో నిర్వహిస్తామని శ్రీనివాసరావు తెలిపారు.



బచ్చల నంద స్ఫూర్తితో పోరాటాలు

నవతెలంగాణ-కారేపల్లి

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు బచ్చల నంద స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కే.నరేంద్ర అన్నారు. ఆదివారం కారేపల్లి మండలం పాటిమీదిగుంపులో బచ్చల నంద 15వ వర్ధంతి ని నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లబోయిన కొండల్‌రావు అధ్యక్షతన జరిగిన సభలో కే.నరేంద్ర మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటాన్ని చీమలపాడు ప్రాంతంలో ఉధృతం చేయటం కోసం చంద్రగొండ మండలం నుండి వచ్చి పార్టీ అప్పచెప్పిన పనిని బచ్చల నంద నిర్వహించారన్నారు. సాయుధ పోరాటం విరమణ అనంతరం వెట్టి, జీతగాళ్ల పోరాటం, పోడు, కూలీరెట్ల పోరాటాలల్లో కీలక భూమికి పోషించిన బచ్చల నంద సీపీఐ(ఎం) నిత్యం పరితపించారన్నారు. అంతకు ముందు పార్టీ పతాకాన్ని బాజుమల్లాయిగూడెం మాజీ సర్పంచ్ కరపటి రాంబాయి అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మన్నెం బ్రహ్మయ్య, సూరభాక సర్వయ్య, బచ్చల బుజ్జమ్మ, బచ్చల వెంకన్న, ధరావత్ వినోద్, గుగులోతు రవి, బానోతు శివ, చిలక వెంకటేష్, బచ్చల నంద కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు అండదండగా ఉండాలి..

న్యూ లక్ష్య స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు గరిడేపల్లి సత్యనారాయణ

నవతెలంగాణ- ఖమ్మం

పేదలకు స్వచ్ఛంద సంస్థలు, ధనికులు, ప్రభుత్వం అండగా ఉండాలని న్యూ లక్ష్య స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు గరిడేపల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం న్యూ లక్ష్య స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రవి, వెంకట్, శ్రీలత ఇంకా తదితరులు పాల్గొన్నారు.



క్షేత్రస్థాయిలో పంట పొలాలు పరిశీలించాలి

- పంట నష్టం అంచనా వేసి పరిహారం రైతులకు చెల్లించాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో గత పది రోజులు నుండి కురుస్తున్న భారీ వర్షాలకు వరద ముంపునకు పంట పొలాలు నీట మునిగి రైతులకు భారీ నష్టాన్ని తెచ్చిపెట్టిందని, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టం అంచనా వేసి రైతులకు నష్టపరిహారం అందేలాగా సహకరించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని రామిశెట్టి పుల్లయ్య భవనం నందు ఆంగోతు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పొన్నం మాట్లాడుతూ మూడు రెవెన్యూ గ్రామాలకు ఒక విస్తరణాధికారి మాత్రమే విధులు నిర్వహిస్తుండటంతో ముంపునకు గురైన పంటలను పరిశీలించడంలో సాధ్యపడటం లేదని సంబంధిత శాఖ అధికారులను పంటలను పరిశీలించడానికి ఎక్కువ మందిని ఏర్పాటు చేసి రైతులందరికీ న్యాయం జరిగేలాగా చూడాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య, సగ్గుర్తి సంజీవరావు, షేక్ నాగుల మీరా, నాగులవంచ వెంకట్రామయ్య, కూడెల్లి నాగేశ్వరరావు, దూదిగం బసవయ్య కోటి సుబ్బారెడ్డి, శ్యామలరావు, నక్క పుల్లారావు, రాజేందర్ పాల్గొన్నారు.



నష్టం ఆధారంగా పరిహారం ఇవ్వాలి

ఎమ్మెల్యే కూనంనేని

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

రైతాంగంతో పాటుగా ఆకేరు, మున్నేరు పరివాహక ప్రాంతాల ప్రజలు వరదల వల్ల తీవ్రంగా నష్టపోయారని, నష్టం ఆధారంగా బాధితులకు పరిహారం ప్రకటించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కస్నాతండాలో బాధితులకు సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా కూనంనేని మాట్లాడారు.ప్రభుత్వం ఎకరానికి రూ.10వేలు పరిహారం ఇస్తామని ప్రకటించిందని,ఆ పరిహారం రైతులకు ఏమాత్రం సరిపోదని, పంటలు మాత్రమే కాదు భూముల ఆనవాళ్లు లేకుండా కొట్టుకుపోయాయని, ఇసుక మేటలు వేశాయని వివరించారు. సర్వం కోల్పోయిన వారిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. వరద నష్టాన్ని కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలన్నారు. తెలంగాణ విషయంలో వివక్ష ప్రదర్శిస్తున్న కేంద్ర ప్రభుత్వం కనీసం విపత్తు సమయంలోనైనా ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేశ్, రాష్ట్ర నాయకులు మౌలానా, నాయకులు జితేందర్ రెడ్డి, లతాదేవి, యర్రబాబు, పోటు కళావతి, వెంకటేశ్వరరావు, రామాంజనేయులు, అజ్మీరా రామ్మూర్తి నాయక్, పుచ్చకాయల సుధాకర్, ఇటికల రామకృష్ణ, అజ్మీరా ఆశ, శంకరయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

పేరుపల్లి-మాధారం మధ్య రాకపోకలు బంద్

నవతెలంగాణ-కారేపల్లి

తుఫాన్‌తో బుగ్గవాగు ఉధృతి విపరీతంగా పెరిగింది. దీంతో పేరుపల్లి-మాధారం ఆర్అండ్‌బీ రహదారిపై గల కాజ్‌వే పొంగి పొర్లిపోతుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఆ కాజ్‌వే వద్ద అధికారులు ముందస్తుగా ట్రాక్టర్లను అడ్డు పెట్టి నిఘా ఏర్పాటు చేశారు.తహశీల్దార్ సంపత్, ఎంపీడీవో రమేష్, ఎస్సై ఎన్.రాజారాం, కార్యదర్శి బీ.నిరంజన్ నిత్యం పర్యవేక్షణ చేపట్టారు. పేరుపల్లి డబల్ బెడ్ రూమ్ కాలనీ వాసులను హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని తరలించారు.

10 క్వింటాల రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ - బోనకల్

గోవిందాపురం ఎల్ గ్రామంలో 10 క్వింటాల రేషన్ బియ్యాన్ని శనివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. పట్టుకున్న బియ్యాన్ని బోనకల్ పోలీస్ స్టేషన్‌కు అధికారులు అప్పగించారు. మధిర సివిల్ సప్లై అధికారుల ఫిర్యాదు మేరకు రేషన్ బియ్యం దందాదారుడుపై కేసు నమోదు చేయనున్నట్లు ఎస్సై కడగండ్ల మధుబాబు తెలిపారు. ఎస్సై మధుబాబు తెలిపిన వివరాల ప్రకారం గోవిందపురం గ్రామానికి చెందిన షేక్ పెంటు సాహెబ్ అనే అతను గ్రామంలో ప్రజల నుంచి అక్రమంగా రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నాడని తెలిపారు. కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు వాహనాల ద్వారా తరలిస్తున్నట్లు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించగా షేక్ పెంట్ సాహెబ్ వద్ద పది క్వింటాల రేషన్ బియ్యం పట్టుబడినట్లు తెలిపారు. పట్టుకున్న రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు తమకు అప్పగించినట్లు తెలిపారు. మధిర సివిల్ సప్లై అధికారులు సోమవారం వచ్చి షేక్ పెంట్ సాహెబ్ పై ఫిర్యాదు చేయనున్నారని వారి ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

అడ్డు అదుపు లేకుండా అక్రమ రేషన్ బియ్యం దందా?

మండల పరిధిలోని గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన షేక్ పెంట్ సాహెబ్ విలేకరి ముసుగులో పెద్ద ఎత్తున అడ్డు అదుపు లేకుండా అక్రమ రేషన్ బియ్యం దందా చేస్తున్నాడని గ్రామస్తులు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా రేషన్ బియ్యం వ్యాపారాన్ని గుట్టుచప్పుడు కాకుండా చేస్తూ లక్షల దండుకుంటున్న అక్రమార్కుడుపై చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియాలో పోస్టింగ్ పెడుతున్నారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేస్తూ నకిలీ విలేకరి రూపంలో నిరుపేదలకు చెందాల్సిన రేషన్ బియ్యాన్ని రాష్ట్రాలు దాటిస్తున్న వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

• ఆర్డీవో రాజేంద్రగౌడ్



నవతెలంగాణ-కల్లూరు

వాతావరణ శాఖ సమాచారం మేరకు మరో రెండు రోజులపాటు భారీ నుండి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, కల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలోని అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండి ఎలాంటి ప్రమాదాలకు తావివ్వకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో రాజేంద్రగౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు వైద్య సిబ్బంది అందుబాటులో స్థానికంగా ఉండాలని, గ్రామపంచాయతీ పరిధిలోని వాగులు, వంకలు, కాలువలు, కల్వర్టులు దగ్గర ప్రజలు దాటకుండా ఉండేందుకు ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. తహసీల్దార్లు, ఎంపీడీవో నిరంతరం పర్యవేక్షణ చేస్తూ క్షేత్రస్థాయి అధికారులను అప్రమత్తం చేయాలని సూచించారు. డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లో అన్ని గ్రామాల్లోనే గ్రామ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు నిరంతరం అందుబాటులో ఉండి పొంగే రహదారుల వెంట ప్రజలు పోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో ఎలాంటి సంఘటన జరిగిన వెంటనే మండల స్థాయి అధికారులకు సమాచారం అందించి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలోనూ మండల స్థాయి అధికారులు అందుబాటులో ఉండాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీసీ కాలనీవాసులకు డీజే బహూకరణ

నవతెలంగాణ-పెనుబల్లి

మండల కేంద్రంలోని బీసీ కాలనీవాసులకు శనివారం ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ డీజే సౌండ్ సిస్టం అందజేశారు. బీసీ కాలనీవాసులు బతుకమ్మ వేడుకలు, వినాయక చవితి వేడుకలు, అయ్యప్పస్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి గతంలో ఎమ్మెల్యేని కోరగా ఆమె బీసీ కాలనీకి అందజేశారు. రూ.75 వేల విలువైన డిజే సౌండ్ సిస్టమ్ అందజేయడం పట్ల కాంగ్రెస్ నాయకులు బొర్ర కోటేశ్వరరావు, ఈ కాలనీ మహిళలు, యూత్ వ్యక్తం చేశారు.

ఎంపీ వద్దిరాజు ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-ఖమ్మం



రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర వినాయక చవితి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఖమ్మం బ్రాహ్మణ బజార్ శివాలయం వీధిలో ఏర్పాటు చేసిన 32 అడుగుల త్రిశుండ్ మట్టి వినాయకుడిని ఎంపీ రవిచంద్ర సందర్శించి తన గోత్ర నామంతో ప్రత్యేక పూజలు చేశారు. గణనాథుడి దర్శనానికి విచ్చేసిన ఎంపీ వద్దిరాజుకు వేద పండితులు మంత్రాలు పఠిస్తూ పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర బొజ్జ గణపయ్యకు గజమాల, పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యుల సాయి కిరణ్, విజయ్, గోపి, పృధ్వి, మురళి, తేజ తదితరులు పాల్గొన్నారు.

మీటకోటి సింహాచలంకు ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు

• పలువురి అభినందనలు

నవతెలంగాణ-ఖమ్మం



గురుపూజోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు పొందిన సింహాచలంకి ఖమ్మంలో అభినందనలు తెలియజేసినట్లు తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్- 475, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ తెలిపారు. ఈనెల 5 హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన గురుపూజోత్సవ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతులమీదుగా మీదుగా సింహాచలం అవార్డులు పొందారు. శనివారం ఖమ్మంలోని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్- 475, ఆధ్వర్యంలో సింహాచలంకి సన్మానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ కంచర్ల శ్రీకాంత్, ఖమ్మం జిల్లా గౌరవ అధ్యక్షులు ఐ.కృష్ణార్జునరావ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుమ్మడి మల్లయ్య, కొండా వినోద్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ పోలూరు మురళీకృష్ణ, కోశాధికారి భాస్కర్, నాయకులు కిరీటి తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో విద్యార్థి మృతి



నవతెలంగాణ-ఎర్రుపాలెం

మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో శనివారం సాయంత్రం ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతంతో ఇంటర్ విద్యార్థి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం...నారాయణపురం గ్రామానికి చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నరెడ్ల నాగకార్తీక్‌రెడ్డి(17) తమ కోళ్ల ఫారం షెడ్‌లో లైట్లు వెలిగించే క్రమంలో ప్రమాదవశాత్తు కరంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి నాగ మల్లేశ్వరరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వినాయక చవితి పర్వదినాన ఈ ఘటన జరగడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

లోతట్టు ప్రాంతాలలో ఎమ్మెల్యే పర్యటన

నవతెలంగాణ-వైరా

వైరా మున్సిపాలిటీలోని లోతట్టు ప్రాంతాలలో ఎమ్మెల్యే మాలోత్ రాం దాస్ నాయక్ ఆదివారం పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, టిపిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, పొదిల హరినాథ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, వైరా తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాలలో కళాశాల విద్యా కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులలో అతిథి అధ్యాపక కుల నియామకాలు జరపడానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తుల ను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకిరుల్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్ 1, హిస్టరీ 3, ఎకనామిక్స్ 1, పొలిటికల్ సైన్స్ 2, కామర్స్ 2, బీబీఏ2, బీసీఏ 1, గణితం 3, కంప్యూటర్ సైన్స్,అప్లికేషన్స్ 3, డేటా సైన్స్ 1, బయోటెక్నాలజీ 1,బాటనీ1, ఖాళీలున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను సోమవారం నుంచి 10వ తేది మంగళవారం సాయంత్రం 5గంటల వరకు అన్ని సర్టిఫికెట్ల జిరాక్సులను జతచేసి కళాశాల కార్యాలయంలో అందజేయాలని కోరారు. జనరల్, బీసీ అభ్యర్థులు సంబంధిత పీజీ లో, 55శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50శాతం మార్కులతో పాటు, నెట్, సెట్, పీహెచ్‌డీ అదనపు అర్హతలు ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఇంటర్వ్యూ, డెమోలను ఈనెల 11 నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు కళాశాల లో హాజరు కావాలని సూచించారు.


పునరావాస కేంద్రాలకు తరలింపు

నవతెలంగాణ-వేంసూరు

మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న కుటుంబాలను అధికారులు గుర్తించి దగ్గర్లో ఉన్న కేంద్రాలకు తరలించారు. కుంచ పరిధిలో 15 కుటుంబాలను హాస్టల్ లో ఎర్రగుంట ఎస్టి కాలనీ చెందిన కుటుంబాలలో వేంసూరు ఎస్సీ హాస్టల్ కందుకూరులో రైతు వేదికలలో రైతు వేదిక నందు తరలించి బాధితులకు సహాయక చర్యలు చేపట్టారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఎంప రాజు, ఎంపీడీవో రమాదేవి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు గ్రామ పెద్దలు ఉన్నారు.

ప్రజలకు ఎలాంటి నష్టమూ జరగకుండా చూడాలి

• ఎంపీ రఘురాంరెడ్డి



నవతెలంగాణ-ఖమ్మం

ఇటీవలి భారీ వర్షాలు, వరదల ప్రభావం నుంచి ప్రజలు ఇంకా కోలుకోక ముందే.. శనివారం మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి స్పందించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందిని నిరంతరం అప్రమత్తం చేయాలని సూచించారు. లోతట్టు, వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని ఆదేశించారు.

పేద, మధ్యతరగతి ప్రజల కోసం మెడికల్ క్యాంపు

• సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా
• నెల నెలా మెడికల్ క్యాంపుకు విశేష స్పందన



నవతెలంగాణ-ఖమ్మం

బీపీ, షుగర్ టెస్టులకు, మందులకు బాగా ఖర్చు పెరిగిందని, ఈ నేపథ్యంలోనే పేదలకు, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రతి నెలా తప్పకుండా మెడికల్ క్యాంపు నిర్వాహణకు ఏర్పాటు చేశామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ప్రతి నెలా మొదటి శనివారం ఖమ్మం మంచికంటి ఫంక్షన్‌లో నిర్వహించే ఉచిత మెడికల్ క్యాంపుకు విశేష స్పందన వచ్చింది. సీపీఐ(ఎం) ఖమ్మం టూ టౌన్ కమిటీ, బీవీకే కమిటీ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ మెడికల్ క్యాంపులో బీపీ, షుగర్, పక్షవాతం, ఎండోక్రైన్, చర్మవ్యాధులు, కంటి, చెవి, ముక్కు, గొంతు పేషెంట్లకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ బీపీ, షుగర్‌తో ఇబ్బంది పెడుతున్న ప్రజల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మనిషి రోజు వారి జీవితంలో ఒత్తిడికి లోనుకావడం, బిజీ బిజీగా నడుస్తున్న ఈ కాలంలో బీపీ, షుగర్‌తో బాధపడుతున్న వారు సంఖ్య పెరిగిందని తెలిపారు. సమతుల్య ఆహారం తీసుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అన్నారు. ఉదయం ఉచితంగా అల్పాహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి నెలా మరింతగా మెరుగైన వైద్యం కోసం స్పెషలిస్ట్ డాక్టర్‌ను క్యాంపుకు ఆహ్వానించి టెస్ట్‌లు ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే కాలంలో ఈ మెడికల్ క్యాంపులో వైద్య సేవలను విస్తృత పరచడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. వచ్చే నెల మొదటి శనివారం అక్టోబర్ 5న తిరిగి మెడికల్ క్యాంపు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్లు ఎండొక్రైన్ సర్జన్ డాక్టర్ రమేష్ కళ్యాణపు, డాక్టర్ శశాంక, డాక్టర్ సీ.భారవి, డాక్టర్ పీ.సుబ్బారావు, డాక్టర్ జీ.రాజేష్, డాక్టర్ జెట్ల రంగారావు, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై. విక్రమ్, ఖమ్మం నగర ప్రముఖులు కే.సాగర్ రెడ్డి, వాసిరెడ్డి దయానంద్, నాయకులు వై.శ్రీనివాసరావు, ఎం. సుబ్బారావు, బోడపట్ల సుదర్శన్, పీ.ఝాన్సీ, నర్రా రమేష్, పీ. వాసు, అరుణా, వాసిరెడ్డి వీరభద్రం, సిహెచ్.భద్రం, జే.వెంకన్నబాబు, మల్లికార్జున్‌రెడ్డి, గుమ్మడి బిక్షం, శివనారాయణ, నాగేశ్వరరావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ ఆశయాల సాధనకై ఉద్యమిస్తాం

• సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు

చలమాల విఠల్‌రావు



నవతెలంగాణ-పెనుబల్లి

విద్యుత్ పోరాట అమరుడు సత్తెనపల్లి రామకృష్ణ ఆశయాల సాధనకై ఉద్యమిస్తామని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు అన్నారు. ఆదివారం సత్తెనపల్లి రామకృష్ణ 24వ వర్ధంతి సభ లంకసాగర్ గ్రామంలో కండే సత్యం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ చిత్రపటానికి విఠల్‌రావు పూలమాల వేసి నివాళు లర్పించి మాట్లాడారు. 2000 సంవత్సరంలో పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, సుదీర్ఘంగా సాగిన పోరాటంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపట్టిన తరుణంలో పోలీస్ లాఠీచార్జి కాల్పులు జరిపిన ఘటనపై ఘటనలో సత్తెనపల్లి రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డి మృతి చెందారన్నారు. రామకృష్ణ మరణం వృధా కాదని, పాలకులపై కార్మిక హక్కుల కోసం, శ్రమజీవుల జీవనం కోసం సాగే పోరాటాల్లో సీపీఐ(ఎం) ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గాయం తిరపతిరావు, మండల కమిటీ సభ్యులు మిట్టపల్లి నాగమణి, ప్రజా సంఘాల నాయకులు తడికమళ్ళ చిరంజీవి, హమాలి యూనియన్ నాయకులు మిద్దె స్వామి, బరిగుల గోపి, కంటే ముత్తయ్య, గోళ్ళ పద్మప్రియ, కండే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తల్లాడలో ఎమ్మెల్యే రాగమయి పర్యటన

నవతెలంగాణ-తల్లాడ



మండలంలో భారీ వర్షాలతో ఏర్పడిన పరిస్థితులను ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పరిశీలించారు. తల్లాడ నారాయణపురం గ్రామాల మధ్యలో ఉన్న చాకలి వాగును పరిశీలించారు. భారీ వర్షాలతో భారీగా నీరు చేరడంతో 20 గృహాలలో నీళ్ల నిలిచాయి. వరద నీటిని జెసిబితో తొలగించేందుకు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే వారికి పునరావాసం కల్పించాలన్నారు. అధికారులు మండల కేంద్రంలోనే ఉండి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మరోసారి దాతృత్వాన్ని చాటిన తోట కుటుంబం

నవతెలంగాణ-ఖమ్మం



మున్నేరు వరద బీభత్సానికి సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు మరోసారి తోట రామారావు కుటుంబ సభ్యులు అండగా నిలిచారు. సుమారు 20 లక్షల రూపాయలతో గత వారం రోజులుగా కుటుంబ సభ్యులు మున్నేరు వరద బాధితుల ప్రాంతాలలో సేవలందిస్తున్నారు. పగలు, రాత్రి బాధితులకు భోజనాలు పెడుతూ, మరోవైపు వైద్య సేవలందిస్తూ కుటుంబ సభ్యులందరూ బాధిత కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుతున్నారు. మరోవైపు బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ మంత్రి హరీష్ రావు, అజయ్ కుమార్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సహకారాలతో వరద బాధితులకు నిత్యవసర వస్తువులు ఇంటింటికి తిరుగుతూ అందజేస్తున్నారు. ఎంపీ గాయత్రీ రవి వరద బాధిత కుటుంబాలకు నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ కార్పొరేటర్ తోట గోవిందమ్మ, బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు తోట రమేష్, ఆర్థోసర్జన్ తోట లక్ష్మణ్, బీఆర్ఎస్ పార్టీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులను తక్షణమే ఆదుకోవాలి : సీపీఐ(ఎం)



నవతెలంగాణ-నేలకొండపల్లి

గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తగిన పరిహారం అందించి తక్షణమే ఆదుకోవాలని సీపీఐ(ఎం) మండల నాయకులు రచ్చ నరసింహారావు, పగిడికత్తుల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని అమ్మగూడెం గ్రామంలో పార్టీ గ్రామశాఖ మహాసభను పార్టీ సీనియర్ నాయకులు అడపాల సత్యనారాయణ అధ్యక్షతన అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభించారు. తొలుత పార్టీ మండల మాజీ కార్యదర్శి అమరజీవి అడపాల కోటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పార్టీ జెండాను వారు ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వరద బాధితులను ఆదుకోవడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. వరదలు సంభవించి పంట పొలాలు ఇండ్లు మునిగిపోయి, బాధిత కుటుంబాలు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయి వారం రోజులు గడుస్తున్న ప్రభుత్వం తగిన పరిహారం అందించకపోవడం దారుణమన్నారు. ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో కూడా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వరదల్లో ఇల్లు మునిగిపోయి తీవ్ర నష్టం కలిగిన కుటుంబాలకు 5 లక్షల రూపాయల పరిహారం, పంటలు నీట మునిగి నష్టపోయిన రైతులకు ఎకరానికి 50,000 రూపాయలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ గ్రామశాఖ నూతన కార్యదర్శిగా అడపాల వెంకటరమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో పార్టీ మండల నాయకులు బెల్లం లక్ష్మి, గ్రామ నాయకులు వాసంశెట్టి నరసయ్య, వాసంశెట్టి నాగేశ్వరరావు, అడపాల సత్యనారాయణ, పుల్లారావు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్సీలను సందర్శించిన డీఎంహెచ్ఓ

నవతెలంగాణ-ముదిగొండ

మండల కేంద్రమైన ముదిగొండ, వల్లభి, పిహెచ్సిలను జిల్లా వైద్యారోగ్యశాఖ ఇన్‌చార్జి అధికారి వరికూటి సుబ్బారావు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా పిహెచ్సిలలో పలు రికార్డులను పరిశీలించి వైద్యాధికారులతో ఆయన మాట్లాడారు. వాన, వరదలు కారణంగా అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామాలలో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్యాధికారులకు ఆయన చెప్పారు. వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించాలన్నారు. వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సెలవులు ఎవరికి మంజూరు చేయొద్దని ఆయన ఆదేశించారు. వర్షాకాలం సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలని పలు సూచనలు, సలహాలు వైద్యాధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్సిల వైద్యాధికారులు అంకం అరుణాదేవి, కె. ధర్మేందర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పాలసీ దారులకు క్లైమ్ చెక్కులు అందజేత

• వరదల దాటికి నష్టపోయిన వాహనదారులు తక్షణమే క్లైమ్ చేసుకోండి
• క్లైమ్ హబ్ ఇంచార్జ్ హేమలత



నవతెలంగాణ-ఖమ్మం

వరదల దాటికి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం వాటిల్లింది. దీంతోపాటు కాయ కష్టం చేసి వచ్చిన డబ్బుతో కొనుగోలు చేసిన వాహనాలు సైతం వరదల్లో కొట్టుకుపోవడం, ధ్వంసం కావడం వంటి ఘటనలు జరిగిన నేపథ్యంలో ఆపన్న హస్తం అందించడానికి నేనున్నాను అన్న భరోసా ఇస్తూ ది న్యూ ఇండియా ఎస్యురెన్స్ కంపెనీ లిమిటెడ్, ఖమ్మం మండల కార్యాలయం, నాన్ సూట్ హబ్ వారు నష్టం జరిగిన 24 గంటలలోనే పాలసీ హెూల్డర్లకు ది న్యూ ఇండియా ఎస్యురెన్స్ కంపెనీ లిమిటెడ్, ఖమ్మం మండల కార్యాలయ ఇన్చార్జి హేమలత పాలసీదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోషన్ బాబు, రమేష్, నరేష్‌లు శ్రమకోర్చి క్లెయిమ్లు సెటిల్ చేయడం, పాలసీదారులకు జరిగిన నష్టాన్ని పూడ్చడంలో సహాయ పడ్డారు. ఆపద సమయాలలో కంపెనీ ముందుకొచ్చి బాధిత పాలసీదారులను ఆదుకోవడం ఒక మంచి ఉదాహరణగా నిలిచిందని, వరదల ప్రభావానికి నష్టపోయిన వాహనదారులు తక్షణమే ఎస్యురెన్స్ కంపెనీని సంప్రదించి తగిన నష్ట నివారణ పారితోషికాన్ని పొందాలని కంపెనీ యంత్రాంగం విజ్ఞప్తి చేశారు.

ప్రకాష్ నగర్ మున్నేరు వంతెన మూసివేత

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని ప్రకాష్ నగర్ మున్నేరు వంతెన మరమ్మత్తులు, పునరుద్ధరణ పనులు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయ మార్గాలలో వాహనాల రాకపోకలు కొనసాగించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరద ప్రవాహంతో ఖమ్మం నగరంలోని ప్రకాష్ నగర్ మున్నేరు వంతెన స్పాన్ బేరింగ్ పై నుంచి పక్కకు జరిగిన దృష్ట్యా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రోడ్లు, భవనాలశాఖ అధికారులు మరమ్మత్తుల కోసం వంతెన ఇరువైపులా గోడ నిర్మాణం చేపట్టారని తెలిపారు. అదేవిధంగా తదుపరి సూచనల వరకు భారీ వాహనాలు కూడా పాత మున్నేరు కాల్వఒడ్డు వంతెన మీదుగా రాకపోకలు నిలిపివేయడం జరిగిందని, ఖమ్మం టౌన్ నుండి వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు ప్రయాణికులు కింది ట్రాఫిక్ మళ్లింపు మార్గాలు అనుసరించాలని విజ్ఞప్తి చేశారు. 1. అన్ని భారీ వాహనాలు శ్రీ శ్రీ సర్కిల్ - బైపాస్ రోడ్డు మీదుగా కరుణగిరి వంతెన - వరంగల్ క్రాస్ రోడ్డు మీదుగా రాకపోకలకు అనుమతిస్తారు. 2. పాత బస్టాండ్ నుండి కోదాడ లేదా వరంగల్ వైపు వెళ్లే టిజి ఆర్టీసీ బస్సులు పాత బస్టాండ్- మయూరి బ్రిడ్జ్ - జూబ్లీ - నెహ్రూ సర్కిల్- ఎఫ్సిఐ గోడౌన్ - కరుణగిరి - వరంగల్ క్రాస్‌రోడ్ నుండి, అటువైపుగా నడపబడతాయి. 3. కొత్త బస్టాండ్ నుండి కోదాడ లేదా వరంగల్ వైపు వెళ్లే టీజీ ఆర్టిసి బస్సులు కొత్త బస్టాండ్- కరుణగిరి బ్రిడ్జ్-వరంగల్ క్రాస్‌రోడ్ నుండి రాకపోకలు కొనసాగుతాయి. 4. ద్విచక్ర వాహనం, కార్లు, ఆటోలు మొదలైన అన్ని తేలికపాటి మోటారు వాహనాలు పాత మున్నేరు వంతెన (కాల్వ ఒడ్డు) గుండా వెళ్లేందుకు అనుమతిస్తారు. పై సూచనలు గ్రహించి, ప్రజలు సహకరించాలని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

• కష్టాల్లో ఉన్న మిత్రులకు ఆపన్నహస్తం

నవతెలంగాణ-ఖమ్మం

వారంతా ఇరవై, ముప్పై ఏండ్ల కిందట జిల్లాలోని ఏన్కూర్ గురుకుల పాఠశాలలో చదివారు. వారి పాఠశాలను రాష్ట్ర స్థాయిలో అగ్రగామిగా నిలపటానికి రాత్రింబవళ్ళు కష్టించారు. స్కూల్‌లో చదివిన వారంతా ఇప్పుడు ఇతర జిల్లాల్లో, రాష్ట్రాల్లో మరి కొంతమంది విదేశాల్లో ప్రభుత్వ, ప్రయివేట్ రంగాల్లో స్థిరపడ్డారు. అయితేనేం వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దిన ఆ గురుకులం అంటే వారికి ప్రాణం. మిత్రులకు ఏదైనా ఆపద వస్తే క్షణాల్లో ముందుంటారు. ఏన్కూర్‌కి చెందిన మేనుగు నాగరాజు అనే యువకుడు అదే గురుకుల పాఠశాలలో చదివి, ప్రస్తుతం హైద్రాబాద్‌లో ఓ ప్రైవేట్ కాలేజ్‌లో బి.టెక్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల ఖమ్మం నూతన కలెక్టరేట్ ముందు రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయలపాలై, హైద్రాబాద్ నిమ్స్‌లో అత్యవసర విభాగంలో చికిత్స తీసుకుంటున్నాడు. తండ్రి సుతారి పనికి వెళ్తుండగా, తల్లి రోజు వారి కూలీ పనులకు వెళ్తుంది. విషయం తెలుసుకున్న వెంటనే మిత్రులు చలించిపోయారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఐటీడీఏలో ప్రాజెక్టు ఉద్యాన అధికారిగా పని చేస్తున్న గుడిమళ్ల సందీప్ కుమార్ ఆధ్వర్యంలో మిత్రుల నుండి శస్త్ర చికిత్సల కోసం విరాళాలు సేకరించారు. అందరూ తమ వంతు సాయం చేశారు.. శనివారం



హైద్రాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్న నాగరాజును, తన తల్లి దండ్రులు (శ్రీనివాస రావు, విజయ లక్ష్మి) ను హాస్పిటల్‌లో ప్రత్యక్షంగా కలసుకొని ధైర్యం చెప్పి, చికిత్స నిమిత్తం స్నేహితులు అందరూ కలిసి జమ చేసిన ఒక లక్ష యాభై ఏడు వేల రూపాయలను పూర్వ విద్యార్థులు ఉద్యాన అధికారి గుడిమళ్ల సందీప్ కుమార్, మరో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పసలాది ఉప్పస్వామి తదితరులు వారికి అందజేశారు.

మహారాజశ్రీ గౌరవ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఖమ్మం
ఒ.యస్. నెం. 1185/2023

బిట్వీన్ :
రామసహాయం మాధవి ....వాది
మరియు
రామసహాయం మురళీధర్‌రెడ్డి ... ప్రతివాది

నోటీసు

పైన తెలిపిన వాది, ప్రతివాది అయిన మీపై ఇంజక్షన్ దావా వేసియున్నారు. అట్టి దావా నందు మీకు ఎన్నిసార్లు కోర్టు నోటీసులు పంపినను అందనందున, ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియ జేయునది ఏమనగా! అట్టి దావా **డి. 01-10-2024న మీ హాజరు నిమిత్తం ఉన్నది. కావున పైన తెలిపిన కోర్టు నందు డి. 01-10-2024న ఉ.గం. 10.30 నిIIలకు** వ్యక్తిగతంగా కానీ లేదా వకీలు ద్వారా కానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేని యెడల అట్టి దావా మీ పరోక్షమున తీర్పు వెలుపరిం చెదరు.

//కోర్టు వారి అనుమతితో//

యమ్. విజయ్ భాస్కర్
న్యాయవాది, ఖమ్మం.
ఖమ్మం
డి.08-09-2024
సెల్:9440728309

నాను తండాకు మార్పు స్వచ్ఛంద సంస్థ చేయూత

• 33 కుటుంబాలకు నూతన వస్త్రాలు పంపిణీ




నవతెలంగాణ-కూసుమంచి

పాలేరు వరదల వలన సర్వస్వం కోల్పోయిన నాను తండకు మార్పు స్వచ్ఛంద సంస్థ చేయూత అందించారు. శనివారం ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మండలంలోని నర్సింహులుగూడెం పంచాయతీ పరిధిలోని నాను తండా ముంపుకు గురైంది. మార్పు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు సందర్శించి తండాలో నివాసం ఉంటున్న 33 కుటుంబాలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత మాట్లాడుతూ భారీ వర్షాలతో ముంపుకు గురైన ప్రాంతాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. వరదలతో ఇంట్లో వస్తువులు అన్ని పాడైపోయినాయని, బియ్యం, ధాన్యం, కోళ్ళు మేకలు, పశువులను కోల్పోయారన్నారు. వరద బాధితులకు ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం, మార్పు స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి గుడిమెట్ల మోహన్‌రావు, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాణోత్ బస్కీ నాయక్, నర్సింహులగుడేం మాజీ సర్పంచ్ శీలం గురుమూర్తి, గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు హలావత్ నరశింహరావు, మండల కార్యదర్శి మూడు గన్యానాయక్, మండల కమిటీ సభ్యులు అజ్మీర్ శంకర్, గుగులోత్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండ తహసీల్దార్‌గా సునీత ఎలిజిబెత్

నవతెలంగాణ-ముదిగొండ



మండల కేంద్రమైన ముదిగొండ నూతన తహసీల్దార్‌గా సునీత ఎలిజిబెత్ ఆదివారం బాధ్యతల చేపట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న సునీత పదోన్నతి పొంది తహసీల్దార్‌గా వచ్చారు. ఇక్కడ ఇన్చార్జి తహసీల్దార్‌గా పనిచేసిన తిరుమల కరుణాకర్‌రెడ్డి తిరిగి బోనకల్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా సునీత ఎల్జిబెత్ మాట్లాడుతూ మండలంలోని ప్రజా, భూసమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

బాదిత కుటుంబానికి రూ.ఐదు లక్షలు అందజేత

నవతెలంగాణ-మధిర

మధిర మండలం దెందుకూరు వాగులో ఇటీవల తుఫాన్‌కు గల్లంతై మృతి చెందిన నన్నేబోయిన పద్మావతి కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి 5 లక్షల రూపాయల చెక్కును ఆదివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నమ్మిక తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | సెప్టెంబర్ 09, 2024 | www.navatelangana.com

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించే బాధ్యత నాది

• ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



నవతెలంగాణ-దుమ్ముగూడెం

నేను ఈ ప్రాంత వాసిని, ఎక్కడ ఏ సమస్య ఉందో తనకు అణువు అణువు తెలుసునని నియోజకవర్గంలో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరించే బాధ్యత తనదేనని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. మండలంలోని అచ్యుతాపురం గ్రామస్తులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న రహదారి నిర్మాణం కోసం రూ.కోటి 25 లక్షలు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేశారు. దీనికిగాను అచ్యుతాపురం గ్రామస్తులు శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి పూల బొకే అందజేసి శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోయం కామరాజు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ వ్యాప్తంగా అనేక గ్రామాలలో త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం లేదని, గిరి వికాస్ ద్వారా బోర్లు వేయడం లేదని దీనివలన చేతి కొచ్చిన పంటలు సాగునీరు లేక ఎండిపోతున్నాయని తెలిపారు. పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే జిల్లా మంత్రులు, సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షులు కుర్సం రవి, సోయం రవి, కారం చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా...

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

సెంట్రింగ్ సామన్లు తీసుకెళ్తున్న ట్రాక్టర్ అడవి మార్గంలో బోల్తా పడిన ఘటన ఆళ్ళపల్లి మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మర్కోడు గ్రామంలో నూతన ఇంటి నిర్మాణం పనులకు మణుగూరు నుంచి సెంట్రింగ్ సామన్లు కిరాయికి ఓ మేస్త్రి తీసుకుని వచ్చాడు. నిర్మాణం పనులు పూర్తి కావడంతో సెంట్రింగ్ సామాన్లను ఓ ట్రాక్టర్‌లో వయా రేగళ్ల మణుగూరుకు తీసుకుని వెళ్తున్న క్రమంలో గుంతలు, రాళ్లమయమైన గ్రావెల్ రోడ్డుపై సెంట్రింగ్ సామాన్లతో సహా ట్రాక్టర్ బోల్తా పడిందని చెప్పారు. అప్రమత్తంగా ఉన్న డ్రైవర్ పక్కకు దూకడంతో ప్రాణాపాయం తప్పింది అన్నారు. పడిన సామాన్లు, ట్రాక్టర్ లేపి తీసుకుని వెళ్లడానికి నానా అగచాట్లు పడినట్లు మేస్త్రీ తెలిపాడు. పాలకులు, అధికారులు ఇకనైనా చొరవ తీసుకొని ఫారెస్ట్ అనుమతులు సదరు గుత్తేదారుడికి ఇప్పించి, బీటీ రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

కంపు కొడుతున్న కొత్తూరు గ్రామపంచాయతీ

• బీఎస్పీ మండల కార్యదర్శి సైదులు

నవతెలంగాణ-జూలూరుపాడు

మండల వ్యాప్తంగా కురుస్తున్నటువంటి భారీ వర్షాలకు కొత్తూరు గ్రామపంచాయతీ కంపు కొడుతుందని బహుజన్ సమాజ్ పార్టీ మండల కార్యదర్శి గార్లపాటి సైదులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇండ్లలోకి వరద నీరు వచ్చి పెద్ద హరిజనవాడ ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మండల వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు దోమలు ఈగలు వ్యాపించి ప్రజలను డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికెన్ గునియా తదితర రోగాల బారిన పడేటట్లుగా చేస్తున్న తరుణంలో సంబంధిత సెక్రటరీ అందుబాటులో ఉండట్లేదన్నారు. తక్షణమే యుద్ధ పాతిపదికంగా పారిశుద్ధ్య పనులు నిర్వహించి కొత్తూరు గ్రామపంచాయతీ ప్రజల ఆరోగ్యాలు కాపాడవలసిందిగా ఆయన సంబంధిత అధికారులను కోరారు.

కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల బోనస్ చెల్లించాలి

నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల బోనస్‌ను చెల్లించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జడ సీతారామయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తోడేటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఐఎఫ్టియు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన రెండు సంఘాల జాయింట్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల ఎడల ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

లక్ష్మీనగరం ప్రైమరీ పాఠశాలకు మరమ్మతులు



నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో గల ప్రైమరీ పాఠశాలకు గ్రామస్తుల సహకారంతో ఆదివారం మరమ్మతులు చేపట్టారు. గతంలో ఈ పాఠశాల సీఎస్ఐ ఆధ్వర్యంలో నిర్వహించేవారు. గత మూడు సంవత్సరాలుగా పాఠశాల ఆలనా పాలన పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు ఇక్కడ నెలకొన్న సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ప్రైమరీ పాఠశాలగా మార్చడంతో పాటు డిప్యూటేషన్ పై ఓ ఉపాధ్యాయురాలిని నియమించారు. కాగా పాఠశాల మరమ్మతుల పనులకు గ్రామస్తులు శ్రీకారం చుట్టారు. గ్రామస్తులు అందించినటువంటి ఇసుక, సిమెంటు, చిప్స్‌తో పాటు కొంతమంది అందించిన నగదుతో పగిలిపోయిన ఫ్లోర్ పనులను చేపట్టారు. ఈ పనులను లక్ష్మీనగరం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ గుడ్ల రామ్మోహన్ రెడ్డి దగ్గర ఉండి పరీక్షించారు. మరమ్మతుల కోసం సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ యూత్ కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గుర్తింపు పత్రం కాలపరిమితి రెండేండ్లు మాత్రమే ఉండాలి : సీఐటీయూ



నవతెలంగాణ-మణుగూరు

సింగరేణిలో గుర్తింపు పత్రం రెండు సంవత్సరాలు మాత్రమే ఉండాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ బ్రాంచ్ సెక్రటరీ వల్లూరు వెంకటరత్నం యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో టివియంవి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో గుర్తింపు ఎన్నికల జరిగి 9 నెలలు అయిందని, అయినా ఇప్పటివరకు గుర్తింపు పత్రం ఇవ్వలేదన్నారు. ఈ సమావేశంలో మాచారపు లక్ష్మారావు, వై.రామ్మూర్తి, నందం ఈశ్వరరావు, విల్సన్ రాజు, లక్ష్మణరావు, బొల్లం రాజు, ప్రభాకర్ రావు, బిక్షపతి, బుచ్చిరెడ్డి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

నవతెలంగాణ-చంద్రుగొండ

భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరివార ఇవ్వాలని అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు షేక్ ఉమర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రైతు కూలీల సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మర్ ప్రధానంగా వివిధ జిల్లాలలో కురుస్తున్న వర్షాలకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, హనుమకొండ, వరంగల్, కరీంనగర్ ఇంకా వివిధ జిల్లాలలో కురుస్తున్న అతి వర్షాల వల్ల పంటలు దెబ్బతిని రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో మండల నాయకులు వెంకట్రావు, టి.బీముడు, డి.బాలు, టి.వెంకటేశ్వర్లు, కిషన్, దంజ నాయక్, టి.రాముడు, టి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాంపురం తండావాగులో కొట్టకపోయిన ఆంబోతు

నవతెలంగాణ-టేకులపల్లి

మండలంలోని రాంపురం తండా వాగులో ఆంబోతు కొట్టకపోతున్న సంఘటన ఆదివారం సాయంత్రం 6 గంటలకు చోటుచేసుకుంది. కురుస్తున్న వర్షాలకు వాగు పొంగిపొర్లాడంతో రాంపురం తండాలో ఉన్న ఆంబోతు వాగు దాటుతుండగా కొట్టకపోతున్నట్టు తండావాసులు తెలిపారు. గ్రామస్తులు కాపాడాలని ప్రయత్నించినా ఫలితం దక్కలేదన్నారు.

నేడు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-టేకులపల్లి

మండల కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఉదయం 09:30కు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ జరుగునని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూక్య దేవా నాయక్ ఆదివారం తెలిపారు. ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య పంపిణీ చేస్తారన్నారు. మండల ప్రజా ప్రతినిధులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులు సకాలంలో రాగలరని కోరారు.

మిర్చి నారు నష్టాన్ని పరిగణలో తీసుకోవాలి

• తెలంగాణ రైతు సంఘం డిమాండ్



నవతెలంగాణ-చర్ల

అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలతో పాటు మిర్చి నారు నష్టాన్ని కూడా పరిగణలో తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి మచ్చ రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల వ్యాప్తంగా తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆనంద్ కాలనీ, చింతగుంట, గొంపల్ల లింగాపురం, కొత్తపల్లి, గుంపెనగుడం, కేశవాపురం ప్రాంతాలలో పర్యటించారు.అధిక వర్షాల వలన వేరుకొల్లుడు, మానుమచ్చ, మాగుడు, చుక్క తెగులువంటి జబ్బులతో మిర్చి నారు మొత్తం దెబ్బతిన్నవని మొక్క నాటే సమయానికి నారు చచ్చిపోవటం వల్ల అధిక డబ్బులు వెచ్చించి నారు కొనాల్సిన పరిస్థితి రైతుకి ఏర్పడనుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్యామల వెంకటేశ్వర్లు, కొరసా శ్రీనివాసరావు, శ్యామల శివ, వరస సందీప్, రమేష్, సమ్మక్క, ప్రేమ్ కుమార్, ముత్తయ్య, రాంబాబు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు పట్టించుకోని కాంగ్రెస్

బీజేపీని నిలువరించడంలో ఫెయిల్



• సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య

నవతెలంగాణ-ఇల్లందు

రాష్ట్రంలో అధికారంలో ఉండి కూడా కాంగ్రెస్ పార్టీ కార్మిక సమస్యలను పట్టించుకోవడం లేదని, బీజేపీని నిలువరించడంలో ఫెయిల్ అయ్యిందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య విమర్శించారు. వినోబా భావే కాలని పార్టీ శాఖ మహాసభ ఆదివారం నిర్వహించారు. మహాసభ దేవులపల్లి యాకయ్యనగర్, వంగాల రామస్వామి, పి.రామకోటయ్య ప్రాంగణంలో ఘనంగా జరిగింది. ఈ మహాసభల ప్రారంభ సూచికంగా పార్టీ జండాను కనకయ్య ఆవిష్కరించారు. అనంతరం విద్యుత్ పోరాట అమరవీరులకు సత్తెనపల్లి రామకృష్ణ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. దేవులపల్లి యాకయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం కనకయ్య పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెసు రైతు రుణ మాఫీ రైతులందరికీ చేయాలని, ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని కోరారు. ఈ మహాసభలో అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు, పించన్లు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలని, ఇల్లందు మండలాన్ని పారిశ్రామిక కేంద్రంగా గుర్తించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని, మున్సిపాలిటీ ప్రతిరోజూ మిషన్ భగీరథ నీరు, పారిశుధ్యం పనులు కల్పించాలని, కోతులు, కుక్కల బెడద నివారించాలని మహాసభలో తీర్మానించారు.

వినోబాభావే కాలని నూతన శాఖ కార్యదర్శిగా కడారి వెంకటమ్మను ఎన్నుకున్నారు. మండల కార్యదర్శి అబ్దుల్ నబి, ఆలేటి కిరణ్ కుమార్, తాళ్లూరి కృష్ణ, వరంగంటి రాజ మొగిలి, ఆలేటి సంధ్య, కల్లెపల్లి మరియా, సోమలక్ష్మి, యాకమ్మ దేవేంద్ర, ఎం.లక్ష్మీ, తాళ్లూరి పద్మ, లక్ష్మీ నర్సు తదితరులు పాల్గొన్నారు.



ఎడతెరిపి లేని వానలు...

• ఏరులై పారుతున్న వర్షపు నీరు
• కోతకు గురౌతున్న అంతర్గత రహదారులు
• పలు గ్రామాలు మధ్య నిలిచిపోయిన రాకపోకలు



నవతెలంగాణ-అశ్వారావుపేట

బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో మండల వ్యాప్తంగా ఎడతెరిపిలేని కుండపోత వర్షాలతో జనజీవనం స్తంభించింది. పొద్దస్తమానం కురుస్తున్న వానలతో పలు అంతర్గత రహదారులు పై వర్షపు నీరు ఏరులై పారుతోంది. దీంతో అనేక రోడ్లు కోతకు గురై గండ్లు, గుంతలు ఏర్పడుతున్నాయి. రోడ్లు పై వర్షపు నీరు చేరడంతో పలు గ్రామాలు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అశ్వారావుపేట-భూర్గంపాడు రహదారిలో వినాయక పురం, అశ్వారావుపేట-రామన్నగూడెం రోడ్‌లో వాగొడ్డుగూడెం, పండువారిగూడెం- అనంతారం, వినాయక పురం-మల్లాయిగూడెం మధ్య రహదారులు వర్షపు నీరు ఆక్రమించడంతో తాత్కాలికంగా రాకపోకలు నిలిచిపోయాయి.

రైతులకు పంట నష్ట పరిహారాన్ని చెల్లించాలి

• రైతు సంఘం మండల కార్యదర్శి కనకరత్నం



నవతెలంగాణ-జూలూరుపాడు

ఇటీవల భారీ వర్షాల వలన నష్టపోయిన రైతాంగానికి వెంటనే పరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి గడిదేసి కనకరత్నం డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలో గుండెపుడి, రామచంద్రపురం, సూరారం పలు గ్రామాల్లో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పంటలను పరిశీలించి అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో మొక్కజొన్న, వరి, పత్తి, మిర్చి పంటలు కొట్టుకుపోయాయని, పత్తి పంటలు గాలులకు కిందపడి కాయలు మొత్తం మునిగిపోయాయని, పత్తి చేలల్లో నీళ్లు నిలువ చేరి పూర్తిగా నష్టపోయే పరిస్థితి వచ్చిందని ఆయన తెలిపారు. తక్షణమే రెవెన్యూ వ్యవసాయ శాఖ జాయింట్ సర్వే నిర్వహించి, జిల్లాలో ఇప్పటివరకు నష్టపోయిన పంటల వివరాలు సేకరించి నష్టపోయిన ప్రతి రైతుకు ఆహార పంటలకు ఎకరానికి రూ.25 వేలు, వాణిజ్య పంటలకు ఎకరానికి రూ.50వేలు, చనిపోయిన మనుషులకి రూ.25 లక్షలు, పశు వులు రూ.లక్ష, గొర్రెలు, మేకలు రూ.పదివేల నష్టపరిహారంగా ఇవ్వాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం కనకరత్నం, అభిమిత్ర, పవన్, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం అహర్నిశలు పరితపించిన ముసలయ్య

• పేద ప్రజలు ఇళ్ల స్థలాల కోసం అనేక పోరాటాలు
• సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య



నవతెలంగాణ-మణుగూరు

తిర్లపూరం, రామానుజవారం గ్రామాలలో పేద ప్రజల సమస్యలు కోసం, ఇండ్ల స్థలాల కోసం నిరంతరం పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు తాటి ముసలయ్య పని చేశారని, ఆయన స్ఫూర్తితో ఈ ప్రాంతంలో ప్రజల సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య పిలుపునిచ్చారు. తిర్లాపురం గ్రామంలో కామ్రేడ్ ముసలయ్య 14వ వర్ధంతి సంతాప సభ తాటి నరసింహారావు అధ్యక్షతన నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి కొడిశాల రాములు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో కనకయ్య మాట్లాడుతూ సింగరేణి ఈ ప్రాంతంలో బలవంతంగా భూములు గుంజుకుంటుందని అన్నారు. చట్టాలను అమలు చేయకుండా చేస్తుందన్నారు. బీటీపీఎస్, రైల్వే ట్రాక్ నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు అన్యాయం జరిగిందన్నారు. ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా బినామీలకు లంచాలకు ఉద్యోగాలు ఇచ్చారని తెలిపారు. గిరిజన నేత, మాజీ పార్లమెంట్ సభ్యులు మీడియం బాబురావు ఈ ప్రాంత భూ నిర్వాసితుల తరఫున పోరాటలలో పాల్గొన్నారని అన్నారు. భూ నిర్వాసితులకు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య జరిగే అనేక చర్చలలో ప్రత్యక్షంగా బాబురావు భూ నిర్వాసితుల తరఫున న్యాయం చేసేందుకు ప్రభుత్వంతో పోరాటం నిర్వహించారన్నారు. ఆగస్టు 31న శనివారం మణుగూరు సింగరేణి కారణంగానే ముంపు గురైందని పేర్కొన్నారు. తీవ్ర నష్టం జరిగిందన్నారు. సింగరేణి స్పందించకపోవడం విచారకరమన్నారు. ఈ విపత్తుకు సింగరేణి బాధ్యత వహించాలన్నారు. ఏరియా సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ మణుగూరు ఓసి విస్తరణలో 813 ఎకరాల భూమిని సేకరిస్తుందన్నారు. ఈ ప్రాంతంలో నివసించే గిరిజన, గిరిజనేతర పేదలకు చట్టాలకతీతంగా ప్యాకేజీ అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వర్గ సభ్యులు లెనిన్ బాబు, సత్ర పల్లి సాంబశివరావు, మడి నరసింహారావు, తాళ్లపల్లి ఉప్పలయ్య, కోడి నరసింహారావు, కోరం ముత్తయ్య, పెంటయ్య, ఎన్నిక శ్రీను, కాక నాగేశ్వరరావు, ముత్యాలరావు, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి మాంత్రికుడిని హత్య చేసేందుకు కుట్ర..?

ఎంపీఓపై కుట్ర చేస్తున్నది ఎవరు?

• మండల వ్యాప్తంగా హల్చల్...దీంట్లో నిజం ఎంత?
• నిజాయితీ గల అధికారులకు బహుమానం ఇదేనా అంటూ పలువురు ఆగ్రహం



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీఓ (ఫైల్)

నవతెలంగాణ-పినపాక

1996లో వచ్చిన భారతీయుడు సినిమా చూసి అవినీతి చేస్తున్న కుమారుడిని చంపడం, అవినీతిని ఎదిరించడం బాగా చూసి ఎంజాయ్ చేసాం...కానీ అదే 2024లో వచ్చిన భారతీయుడు-2 సినిమాలో అవినీతి చేయకపోతే చస్తావని చూపించడం చూశాం. ప్రస్తుతం పినపాక మండలంలో ఓ అధికారి పరిస్థితి భారతీయుడు-1లా ఉందామని చూస్తే భారతీయుడు 2లా మారింది. వివరాల్లోకి వెళితే మండలంలో సమస్య తెలియగానే వెంటనే స్పందించి, ఆ ప్రాంతానికి వెళ్లి తన పరిధిలో ఉంటే సమస్యను పరిష్కరించే ఎంపీఓను హత్య చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు అంటూ ఓ వార్త హల్చల్‌గా మారింది. వినాయక చవితి రోజు ఏ నోటన విన్నా గణపతి నామం కంటే ఈ వార్త ఎక్కువగా వినపడింది. ఈ వార్తలో నిజం ఎంతో తెలియాల్సి ఉంది. పినపాక మండలానికి వచ్చిన సంవత్సర కాలంలోనే వలస ఆదివాసీ గ్రామాల్లో సైతం తిరుగుతూ అక్కడ సమస్యలను పరిష్కరించిన ఘనత ఎంపీఓ వెంకటేశ్వరరావుకి దక్కుతుంది. మండలంలోని ఈ.బయ్యారం గ్రామంలో డ్రయినేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడడం, ఈ బయ్యారం పోలీస్ స్టేషన్లో వరద వచ్చినప్పుడు మునగటం, పెట్రోల్ బంకు వద్ద పెద్ద వాగులా ప్రవహించటం, రోడ్డు చిన్నదిగా ఉండటంతో అనేక ప్రమాదాలు జరగటం వంటివి గమనించిన ఆయన రోడ్డుకు ఇరువైపులా ఆక్రమిత విస్తరణ పనులు చేపట్టారు. మేడారం సమయంలో సైతం ఒక్క ప్రమాదం జరగకుండా కాపాడారంటే అతిశయోక్తి కాదు. అదే ఉద్దేశంతో మండల కేంద్రానికి వెళ్లే రహదారి సైతం ఇరుగ్గా ఉండడంతో పినపాక, సీతంపేటలో రోడ్డు ఆక్రమిత విస్తరణ పనులు చేపట్టారు. ప్రతి సంవత్సరం వరదలు వచ్చినప్పుడు గ్రామపంచాయతీలో ఇల్లు మునిగి గిరిజనులు, దళితులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అది గమనించిన ఆయన సీతంపేట చెరువు వైపుగా గతంలో పూడ్చివేసిన అలుగులను మళ్లీ తీసి వరద ముప్పు నుండి గ్రామాన్ని కాపాడారు. ఇలా చెప్పుకుంటూ పోతే మండల అభివృద్ధిలో ఆయన చేసిన పాత్ర అంతా ఇంతా లేదు. గత మూడు రోజులుగా జానంపేట గ్రామపంచాయతీ పరిధిలో మంత్రి సీతక్క వీరాభిమాని కట్టం సాయి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం ఆయనను కలిచి వేసింది. రోడ్డు ప్రమాదాలకు కారణం తెలుసుకొని వెంటనే జానంపేటలో స్థానికులను కలిసి రోడ్డు ఆక్రమణల ప్రమాదాలు జరుగుతున్నాయని గమనించి నోటీసులు జారీ చేసి రోడ్డు ఆక్రమిత విస్తరణ పనులు చేపట్టారు. ఇదంతా బాగానే ఉన్నా ఆ గ్రామంలో కొంతమంది తమకు నష్టం వస్తుందని ఎంపీఓను, గ్రామ సెక్రెటరీ, ఓ పంచాయతీ గుమస్తాను హత్య చేయడానికి పథకం పన్నారంటూ వార్త హల్చల్ చేస్తుంది. దీనిలో నిజం ఎంతో తెలియదు గాని ఈ వార్త మాత్రం మండల వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. నిజాయితీ గల ఆఫీసర్ పని చేస్తుంటే అక్రమార్కులు ఇలా చేస్తున్నారంటూ గిరిజన సంఘాలు, దళిత సంఘాలు, బీసీ సంఘాలు మండిపడుతున్నాయి. పినపాక మండలంలో గల 11 వలస ఆదివాసీ గ్రామాల్లో వేసవిలో సైతం తాగునీరు అందించిన ఘనత ఆయనకే ఉంది. గత సంవత్సరం ఉత్తమ ఎంపీఓగా సైతం అవార్డు సాధించారు. అలాంటి ఎంపీఓ సార్ వెనక మేమున్నామంటూ పలువురు అండగా నిలుస్తున్నాయి. ఇదిలా ఉంటే జానంపేట, ఈ బయ్యారం గ్రామపంచాయతీలలో క్యాష్ బుక్కుల నకళ్లను సైతం ప్రజలందరికీ తెలిసేలా గ్రామపంచాయతీ గోడలు అతికించిన ఘనత ఆయనకే ఉంది. దీని వెనక ఇంకా ఏమైనా కుట్రలు ఉన్నాయా అభివృద్ధి చేస్తున్న ఎంపీఓపై కుట్ర పన్నింది ఎవరు అన్నది తెలియాల్సి ఉంది. ఈ వార్తలో నిజం ఉందా లేదా అన్నది సైతం తెలియాల్సి ఉంది.

నా దృష్టికి వచ్చింది.. స్టేషన్లో ఫిర్యాదు చేస్తాం



తనపై, తన సెక్రెటరీ పై, పంచాయతీ గుమస్తా పై హత్యాయత్నం ప్రయత్నం చేస్తున్నారని తన దృష్టికి వచ్చిందని దీనిపై స్థానిక సెక్రటరీ, గ్రామపంచాయతీ గుమస్తాతో ఈ బయ్యారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయించామని తెలిపారు. నేడు తాను పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్నట్లుగా తెలిపారు. బెదిరింపులకు భయపడేది లేదని, ప్రాణాపాయమున్న విధులలో వెనుకాడనని తెలియజేశారు. అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. మండలంలో ప్రజలందరూ నుండి సహకారం ఉందన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి కచ్చితంగా కట్టుబడి ఉంటామని, ప్రతి పైసను ప్రజల అభివృద్ధికి ఉపయోగపడేలా దుర్వినియోగం కాకుండా చూడడమే తన బాధ్యత అన్నారు.

- ఎంపీఓ వెంకటేశ్వరరావు

ఎంపీఓ నుండి ఫిర్యాదు అందలేదు...పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తాం : ఎస్సై

ఎంపీఓపై హత్యాయత్నం ప్రయత్నం పైన ఎటువంటి ఫిర్యాదు పోలీస్‌స్టేషన్లో అందలేదని ఈ బయ్యారం సబ్ ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్ తెలిపారు. ఆ వార్తల్లో నిజం ఉండకపోవచ్చు అని కొంతమంది ఆకతాయిలు ఇలా ప్రచారం చేసి ఉండవచ్చన్నారు. ఆ పుకారులో నిజం ఉంటే పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తామని తెలిపారు. ఎంపీఓ నుండి ఫిర్యాదు వస్తే అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తామని తెలిపారు.

ఏడీఎంఎస్ షోరూంను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-మణుగూరు

మండలంలోని గుట్ట మల్లారం గ్రామ పరిధిలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నూతన ఏడీఎంఎస్ షోరూంను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్యాటరీ వాహనాలకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించే విధంగా పెట్రోల్, డీజిల్ వాహనాలను నివారించే చర్యల్లో భాగంగా ఏడీఎంఎస్ ఎలక్ట్రికల్ వెహికల్స్ షో రూమ్ ప్రారంభించడం ఎంతో సంతోష దాయకమన్నారు. అనంతరం షోరూం నిర్వాహకులు మాట్లాడుతూ ఏడీఎంఎస్ కంపెనీ 2021వ సంవత్సరంలో కర్ణాటకలోని బెల్గామ్‌లో ఏర్పాటుచేసి నాలుగు సంవత్సరాలు పూర్తయి 5వ సంవత్సరంలో కడుగు పెడుతున్న సందర్భంగా మన మణుగూరులో నూతన షో రూమ్‌ను ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ షో రూమ్ నందు 18 రకాల రిజిస్టర్డ్ అన్ రిజిస్టర్డ్ వాహనాలు అందుబాటులో ఉంటాయి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నియోజకవర్గ నాయకులు, శివాజీ, శంకర్, షోరూం నిర్వాహకులు జనార్దన్ రెడ్డి, మురళి, బాల సుబ్బారెడ్డి, హుస్సేన్, నాగేంద్రబాబు మహేష్, రమేష్, భరత్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీల నిర్వహణ

నవతెలంగాణ-గుండాల

కలెక్టర్ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 8వ తేదీన అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని యాస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా గుండాల మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ డ్రాయింగ్ పోటీలను స్థానిక మండల విద్యాశాఖ అధికారి పి.కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. గుండాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ ప్రతి పోటీకి సంబంధించి మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి. వ్యాసరచన పోటీలో ప్రథమ స్థానం ఎ.శృతి 9వ తరగతి ఇంగ్లిష్ మీడియం, జడ్పీహెచ్ఎస్ గుండాలకు రాగా, ద్వితీయ స్థానం బి.నికిత ఏకలవ్య హై స్కూల్ మామ కన్ను సాధించింది. అదేవిధంగా వక్తృత్వ పోటీలో ప్రథమ స్థానం ఎ.శృతి 9వ తరగతి జెడ్పీహెచ్ఎస్ గుండాల విద్యార్థిని సాధించగా, ద్వితీయ స్థానం జె.ప్రసన్న పదవ తరగతి ఏకలవ్య హై స్కూల్ మామకన్ను సాధించింది. అలాగే చిత్రలేఖనంలో ప్రథమ స్థానం ఆర్.గుంజన్ పదవ తరగతి ఇంగ్లీష్ మీడియం జడ్పీహెచ్ఎస్ గుండాల సాధించగా, ద్వితీయ స్థానం వై.రేవంత్ టీజీటీడబ్ల్యూఆర్ జేసీ గురుకులం హై స్కూల్ గుండాల విద్యార్థి సాధించాడు. జిల్లా కలెక్టర్ గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందించనున్నారని ఎంఈఓ తెలిపారు. వ్యాసరచన పోటీలో సాక్షర భారతదేశం ఆ దేశ ప్రగతికి ఎలా తోడ్పడుతుంది? అనే అంశంపై లేదా మీ ప్రాంతంలో నిరక్షరాస్యత రూపుమాపడానికి నీవు ఎలా సహాయపడగలవు? అనే అంశంపై పోటీలు జరిగాయని తెలిపారు.

మట్టి విగ్రహాల పంపిణీ



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణంలో పర్యావరణాన్ని రక్షించాలన్న లక్ష్యంతో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు పూజల లక్ష్మీ మాట్లాడుతూ... వినాయక ఉత్సవాలలో పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మట్టి ప్రతిమలను పూజించడం ద్వారా ప్రకృతిని కాపాడుకోవచ్చు అని స్పష్టం చేశారు. ఇటీవల ప్రపంచవ్యాప్తంగా వస్తున్న ప్రకృతి వైపరీత్యాలు మానవ తప్పిదాలేనని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా మరో నాలుగు రోజులపాటు అతి భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దిశా ప్రొటెక్షన్ తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముంపు బాధితులకు అన్ని రకాల సహాయ, సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని పూజల లక్ష్మి హామీ ఇచ్చారు.



గ్రామాల్లో పడకేసిన ప్రజా ఆరోగ్యం

- విషజ్వరాలతో అల్లాడిపోతున్న ప్రజలు
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య

నవతెలంగాణ-ములకలపల్లి

గ్రామీణ ప్రాంతాలలో ప్రజా వైద్యం పడకేసిందని, ప్రజలు విష జ్వరాలతో అల్లాడిపోతుంటే ప్రభుత్వానికి పట్టదా అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని విమర్శించారు. ఆదివారం పార్టీ మండల కార్యాలయంలో గౌరీ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయిందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో దోమల నివారణకు శానిటేషన్ పనులు తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. హెల్త్ క్యాంపులు నిర్వహించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల బ్లెడ్ టెస్టులు నిర్వహించాలని, ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, వూకంటి రవికుమార్, నిమ్మల మధు, మాలోతు రావూజ, గొగ్గల రవికుమార్, గోపగాని లక్ష్మీ నరసయ్య, కుంజ రామ్మూర్తి, కీసరి వెంకట్రావు, తిరుపతమ్మ వర్సా శ్రీరాములు, సున్నం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి దక్కిన అరుదైన గౌరవం

- జాతీయ 16వ ఆర్థిక సంఘం సదస్సుకు చైర్మెన్‌కి ఆహ్వానం
- ప్రజల సహకారంతోనే గుర్తింపు



నవతెలంగాణ-ఇల్లందు

దశాబ్దాల చరిత్రలో మున్సిపాలిటీకి అరుదైన గౌరవం దక్కింది. జాతీయ 16వ ఆర్థిక సంఘం ప్రతినిధులు తెలంగాణ రాష్ట్రంలో ఈనెల 9, 10 తేదీలలో ఆర్థిక సంఘం నిధులు స్థానిక సంస్థలకు ఏ విధంగా కేటాయిస్తే బాగుంటుందో, కేటాయించిన నిధులు ఏ విధంగా ఖర్చు చేయాలో తదితర అంశాలపై రాష్ట్రంలో పర్యటిస్తూ ప్రజా భవన్ నందు సదస్సులు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి 16 ఫైనాన్స్ చైర్మెన్ డాక్టర్ అరవింద్ పంగారియా హాజరవుతున్నారు. ఈ సదస్సులకు తెలంగాణ రాష్ట్రం నుండి ఐదుగురు మున్సిపల్ కార్పొరేషన్ చైర్మెన్లకు, పదిమంది మునిసిపల్ చైర్మెన్లకు సదస్సులో పాల్గొనవలసిందిగా ఆహ్వానం అందింది. 16 ఆర్థిక సంఘం వారు నిర్వహించే సదస్సుకి ఇల్లందు మున్సిపల్ చైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుకు సీడీఎంఏ కమిషనర్ వీపి గౌతమ్ ఆహ్వానం పంపించారు. ఈ సందర్భంగా చైర్మెన్ డీవి మాట్లాడుతూ స్థానిక సంస్థల బలోపేతానికి 16 ఆర్థిక సంఘానికి తన వంతు సలహా సూచనలు అందజేస్తానని తెలియజేశారు. 16 ఆర్థిక సంఘం వారు నిర్వహించే సదస్సుకి నాకు ఆహ్వానం అందడం చాలా సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు.

ఘనంగా వినాయక చవితి వేడుకలు

- వాడవాడలా పందిళ్లు

నవతెలంగాణ-కొత్తగూడెం

వినాయక చవితి పండుగను వాడవాడలా ప్రజలు జరుపుకున్నారు. శనివారం వినాయక చవితి సందర్భంగా పెద్ద ఎత్తున పట్టణంలో గణనాథుని విగ్రహాలు వెలిశాయి. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని కొత్తగూడెం మున్సిపల్ మధురబస్తిలో వేంచేసియున్న శ్రీలక్ష్మి గణపతి ఆలయ ఆవరణలో ఆర్‌జెఎం యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. గత 30 సంవత్సరాలుగా నవరాత్రులు ఏర్పాటు చేస్తున్న వారి ఉత్సవాలు ఈ ఏడాది 31 సంవత్సరంలోకి అడుగేడుతున్న సందర్భంగా ఈ సంవత్సరం 21 అడుగులతో శివ గణేష్ ప్రతిమను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి, 11 రోజుల పాటు పూజలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు ఎర్రా లింగేశ్వర్, ఎర్రా నాగేందర్, ఆరవ విజయ్, కనకరాజు, జశ్వంత్, ధనుంజయ్, ధనుష్, విశ్వనాథ్, సర్వేశ్వర్, మైక్ శ్రీనివాస్, నరేష్, ధీరజ్, సాయి, సిద్ధు, గంగా చరణ్, హర్ష పాల్గొన్నారు.

దుమ్ముగూడెం : మండల కేంద్రమైన దుమ్ముగూడెం గ్రామంలో గల విఘ్నేశ్వర స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీ నగరం బాలికల గిరిజన వసతి గృహంతో పాటు పలుచోట్ల వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేసి విద్యార్థులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అశ్వాపల్లి : మండల కేంద్రంతో పాటు అనంతోగు, మర్కోడు, బందారుగూడెం, సీతానగరం, తదితర గ్రామాల్లో శనివారం వినాయక చవితిని పురస్కరించుకుని నవరాత్రి ఉత్సవాలు జరపడానికి మండపాలు ఏర్పాటు చేసి, వినాయకుడి విగ్రహాలను ఆయా గ్రామాల ఉత్సవ కమిటీలు ప్రతిష్ఠించాయి. ఆయా చోట్ల జరిగిన ఈ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి

- పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో గాయపడిన ఆటో డ్రైవర్ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... గంగోలు గ్రామానికి చెందిన కుసిని సందీప్ (36) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుంటాడు. మృతుడికి భార్య లావణ్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. సందీప్ ఈనెల 3న రాత్రి 8 గంటల సమయంలో తన ఆటోలో గంగోలు గ్రామం నుంచి భద్రాచలం వైపు వెళుతున్నాడు. భద్రాచలం-చర్ల ప్రధాన రహదారి రేగుబల్లి గ్రామంలో గల వెంకటేశ్వర స్వామి గుడికి సమీపంలో సందీప్ వెళ్తున్న ఆటోని భద్రాచలం నుంచి దుమ్ముగూడెం వైపు వస్తున్న టీఎస్ 28 టీఏ 7051 అనే నెంబర్ గల ఆటోను డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ సందీప్ వెళ్తున్న ఆటోను బలంగా ఢీ కొట్టాడు. దీంతో రెండు ఆటోలు పల్టీ కొట్టాయి. ఈ ప్రమాదంలో సందీప్ తలకు, ఇతర శరీర బాగాలపై బలమైన దెబ్బలు తగిలాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు తీవ్ర గాయాల పాలు అయిన సందీప్‌ను భద్రాచలం తరలించి వైద్యం అందించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సలహా మేరకు హైదరాబాద్ లోని గాంధీ ఆసుపత్రిలో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. కాగా చికిత్స పొందుతూ సందీప్ ఉదయం 9 గంటల సమయంలో మృతి చెందాడు. లక్ష్మీ నగరం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ చంద్రమౌళి నిర్లక్ష్యం మూలంగానే సందీప్ మృతి చెందాడని సందీప్ మేనమామ బర్ల రవి ఫిర్యాదు మేరకు ఎస్సై గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుల సహకారం

నవతెలంగాణ-చంద్రుగొండ

శనివారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు స్థానికంగా నివాసముండే ఒంటరి వృద్ధ మహిళ జైతున్నిసా బేగం ఇంట్లోకి మోకాళ్లలోతు వర్షపు నీరు చేరి ఇబ్బంది పడుతుండడంతో స్పందించిన స్థానిక యువకులు పరుగు, పార పట్టారు. వర్షపు నీరు పారేలా కాలువ తవ్వి సమస్యను పరిష్కరించారు. యువకుల సహకారాన్ని గమనించిన పలువురు అభినందించారు.

ఎదుళ్ల వాగుకు వరద ప్రవాహం

- అప్రమత్తమైన అధికారులు



నవతెలంగాణ-చంద్రుగొండ

భారీ వర్షాలు సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుండగా అధికారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. శనివారం రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని అయ్యన్నపాలెం-సీతయ్య గూడెం గ్రామాల మధ్య ఎదుళ్ల వాగు ఉధృతంగా ప్రవహించింది. లో బ్రిడ్జి పైనుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో అప్రమత్తమైన అధికారులు రాకపోకలను నివారించారు. శాఖల వారీగా సమస్యలను అధిగమించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. మండల కేంద్రంతో సహా పలు గ్రామాలలో ఇండ్లలోకి వర్షపు నీరు చేరి సామాన్య ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రోడ్లన్నీ జలమయమయ్యాయి. సమస్యలను ఎప్పటికప్పుడు అధిగమించేందుకు సిబ్బంది సహకారంతో అధికారులు కృషి చేశారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేని లోటు స్పష్టంగా కనిపించింది.

ఫుడ్ సెంటర్లలో పాచిన పదార్థాలు

- ప్రజల ప్రాణాలతో చెలగాటం
- పట్టించుకోని ఫుడ్ ఇన్‌స్పెక్టర్

నవతెలంగాణ-కొత్తగూడెం

ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో పాచి వాసన కొడుతున్న పదార్థాలు అమ్ముతూ సొమ్ములు చేసుకుంటూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న హెూటల్ యాజమాన్యాలపై సంబంధిత అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోవడంలేదు. విచ్చలవిడిగా వెలుస్తున్న ఫుడ్ ప్లాజాలలో పాచిన పదార్థాలు అమ్ముకుంటూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. దీన్ని పూర్తిగా నియంత్రించాల్సిన ఫుడ్ ఇన్స్పక్టర్ కానీ, మున్సిపల్ శాఖ అధికారులు కానీ తనిఖీలు నిర్వహించకపోవడంతో హెూటల్ యజమాన్యం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. లక్షలాది రూపాయల వ్యాపారాలు చేసుకుంటూ కోట్లు గడిస్తున్న యాజమాన్యాలు సక్రమమైన ఆహార పదార్థాలు అందజేయడంలేదని ఆరోపనలు వినిపిస్తున్న తరుణంలో...ఆదివారం ఒక్కరోజే కొత్తగూడెం పట్టణంలో రెండు చోట్ల పాడైన పదార్థాలు అమ్మి వినియోగ దారులకు చిక్కిన సంఘటనలు వెలుగు చూశాయి. సూపర్ బజార్ సెంటర్లోని ఒక ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో పాచిపోయిన మంచూరియాను వినియోగదారుడికి అందజేయడంతో వెలుగుచూసింది. పూర్తిగా పాడైపోయి మంచూరియాపై తెల్లని ఫంగస్ చేరి కంటికి కనిపిస్తున్న వాటికి ఘాటైన మసాలాలు చేర్చి, ప్రజల నెత్తిన వేస్తున్నారు. అవి తిన్న చిన్న పిల్లలు తీవ్ర కటుపు నొప్పికి గురవుతున్నారు. కొన్ని ఆపరేషన్‌కు దారి తీస్తున్న సంఘటనలు లేక పోలేదు. ఇదే సందర్భంలో కొత్తగూడెం బస్టాండ్ కాంప్లెక్స్ ఆవరణలో మధురంగా ఉందని చెప్పుకునే నెంబర్ వన్ ఫుడ్ ప్లాజాలో పాచిపోయిన బిర్యాని కట్టబెట్టారు. కొత్తగూడెం పట్టణంలో మధు ఫుడ్ ప్లాజాలో తీసుకున్న బిర్యాని పాచిపోయిన విషయం గురించి వినియోగదారుడు తెలిపిన వివరాల ప్రకారం కొత్తగూడెం మధురబస్తీకి చెందిన ఒక వ్యక్తి ఆదివారం మధ్యాహ్నం బస్టాండ్ కాంప్లెక్స్‌లోని మధు ఫుడ్ ప్లాజాలో వెజ్ బిర్యానీని ఆర్డర్ చేశాడు. డబ్బులు చెల్లించి బిర్యానీని ఇంటికి తీసుకువెళ్లి కుటుంబ సభ్యులు తినేందుకు పార్సల్ తెరిచి కొంత తినగా విపరీతమైన దుర్వాసన వచ్చింది. అవాక్కఅయిన వినియోదారుడు తినలేకపోయాడు. వెంటనే సదరు వినియోగదారుడు జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు, మున్సిపల్ కమిషనర్ శేషాంజనేయ స్వామికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశాడు. మధు ఫుడ్ ప్లాజాకి వెళ్లి సిబ్బందిని నిలదీశాడు. స్పందించిన సిబ్బంది పొరపాటు జరిగిందని, మరోసారి ఇలా జరగకుండా చూసుకుంటామని సర్దిచెప్పి వినియోగదారుడిని చల్లబరిచారు. పేరుగొప్ప...ఊరు దిబ్బ అన్న చందంగా పట్టణంలోని హెూటల్స్‌లో పదార్థాలు తయారు చేస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇలాంటి సందర్భాలలో సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించాల్సి ఉంది. ముడుపుల మైకంలో అధికారులు ఎలాంటి తనిఖీలు చేయడంలేదని ప్రజలు మండి పడుతున్నారు. ఇప్పటికైనా తరుచూ తనిఖీలు చేయాలని కోరుతున్నారు.



పాడైపోయిన బిర్యానీని చూపిస్తున్న దృశ్యం

ఆకస్మికంగా మాస్టార్ జీవీబీ ప్రసాద్ మృతి

- గూడెం కళాకారుల నివాళి



నవతెలంగాణ-కొత్తగూడెం

ప్రముఖ సీనియర్ రచయిత, కవి, గాయక కళాకారుడు, విశ్రాంత ప్రభుత్వ ప్రధాన పాధ్యాయుడు జీవిబి.ప్రసాద్ (75) ఆకస్మిక మృతి చెందారు. కొత్తగూడెం మునిసిపల్ పరిధిలోని గాజుల రాజం బస్తికి చెందిన జీవిబి.ప్రసాద్ ప్రభుత్వ విద్యా సంస్థలో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ కొత్తగూడెం కళాకారులు సంగీత్ర దర్శకులు మారపాక కృష్ణ స్వామి స్థాపించిన ప్రియదర్శిని ఆర్కెస్ట్రాలో రచయితగా, గాయకుడిగా ఎన్నో సమాజ చైతన్య గీతాలు, జానపద గీతాలు, భక్తి గీతాలు రాసి కళారంగానికి ఎంతో సేవ చేసారు. ప్రత్యేకంగా రమ్యమైన లలిత సంగీత విభావరిని కొత్తగూడెం సంగీత ప్రియులకు పరిచయంచేసిన మొదటి కళాకారులు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని భసవ తారకం కాన్సర్ హాస్పిటల్‌లో చేరారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఆయన ఆకస్మిక మరణం కొత్తగూడెంలోని ఆయన శిష్యబృందానికి దిగ్భ్రాంతిని కలిగించింది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కొత్తగూడెం వాస్తవ్యులు ప్రముఖ సినిమా సంగీత దర్శకులు మారపాక కృష్ణ స్వామి, ఘంటాడి కృష్ణ, ఆల్లి శంకర్, మద్దెల శివకుమార్, కె.రాందాస్, ఎస్‌కె.ఇక్బాల్ పాషా, లక్ష్మణ్, కె.దేవసహాయం, రాజ లింగం, బీక్కులాల్, రంజీత్ కోరి, అంబురి ప్రసాద్, షరిష్ బాబా, రామిశెట్టి వెంకటేశ్వరరావు, పాపయ్య, జలంధరా చారి, మేదరి నర్సయ్య తదితరులు వారి కుటుంబానికి సంతాపాన్ని తెలిపారు.

ప్రజా పోరాటాలను బలోపేతం చేయడమే కామ్రేడ్ టీ.వీ.ఆర్.చంద్రంకు మనమిచ్చే నివాళి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

సమస్యలపై ప్రజలను కదిలించి ప్రజా పోరాటాలను బలోపేతం చేయటమే అమరజీవి కామ్రేడ్ టీ.వీ.ఆర్.చంద్రంకు మనమిచ్చే ఘన నివాళి అని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. చంద్రం 28వ వర్ధంతి సందర్భంగా ఆయన స్థూపం వద్ద పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యం.బి.నర్సారెడ్డి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన చిత్ర పటానికి మచ్చా వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు యం.వి.యస్.నారాయణలు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన సభలో మచ్చా మాట్లాడారు. భద్రాచలం డివిజన్‌లో కమ్యూనిస్ట్ పార్టీ ఏర్పాటు చేసిన ప్రథమ శాఖకు ఆయన సెక్రటరీగా వున్నారని అన్నారు. భద్రాచలం డివిజన్ సీపీఐ(ఎం) కార్యదర్శిగా వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించి భద్రాచలం డివిజన్ సీపీఐ(ఎం) నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారని అన్నారు. నిజాయితీ, నిరాడంబరతకు నిలువెత్తు రూపం చంద్రం అని కొనియాడారు. నాడు ఇందిరా గాంధీ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ పెట్టిన సందర్భంలో చంద్రం కామ్రేడ్ బండారు చందర్ రావులను కనిపిస్తే కాల్చివేత ఆదేశాలు జారీ చేశారని అన్నారు. రహస్య జీవితాన్ని గడిపారని అన్నారు. అనేక నిర్బంధాలను ఎదుర్కొని ప్రజా ఉద్యమాన్ని నిర్మించే దానిలో ఆయన కీలకంగా పని చేశారని అన్నారు. అనంతరం పార్టీ పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు బండారు శరత్ బాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్ బాబు, సీనియర్ నాయకులు ఎం.వి.ఎస్ నారాయణ, పట్టణ కమిటీ సభ్యులు నకిరేకంటి నాగరాజు, కుంజా శ్రీనివాస్, సంద్ర భూపేంద్ర, అన్వేష్, రాయల రాములు, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చయ్య మృతి తీరని లోటు

- యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి
- ఉపాధ్యాయ నేతలు నివాళి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

యూటీఎఫ్ ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ కార్యదర్శి ఇర్పా అనసూయ భర్త చీమల పిచ్చయ్య మృతి సంఘానికి, ఆ కుటుంబానికి తీరని లోటు అని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి అన్నారు. ఆదివారం గుండెపోటుతో మృతి చెందిన హిందీ ఉపాధ్యాయులు చీమల పిచ్చయ్య మృదేహానికి యూటీఎఫ్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై నివాళులర్పించారు.

ఈ సందర్భంగా చావా రవి మాట్లాడుతూ... ఇర్పా అనసూయ యూటీఎఫ్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శిగా అనేక పోరాటాలు నిర్వహించారని ఆమె పోరాటాలకు చీమల పిచ్చయ్య అన్ని రకాల సహాయ, సహకారాలు అందించాలని గుర్తు చేశారు. నివాళులర్పించిన వారిలో యూటీఎఫ్ నాయకులు రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు కృష్ణ, విజయ్, సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ, ఏ.వెంకటేశ్వర్లు, బూర్గంపాడు మండల కార్యదర్శి ఎం.సత్యనారాయణ, టి.రమేష్, సంగం శ్రీనివాస్, శైలజ, పద్మారాణి, రమేష్, ఆశాలత, సీనియర్ నాయకులు రాజ శ్రీనివాస్, తదితరులు పాల్గొని పిచ్చయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పిచ్చయ్య మృతికి సీపీఐ(ఎం) నివాళి

పిచ్చయ్య అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) బృందం రాజుపేటలోని తన నివాసం వద్ద పిచ్చయ్య మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... అందరితో స్నేహపూర్వకంగా ఉండే పిచ్చయ్య అకస్మాత్తు మరణం బాధాకరమని అన్నారు. ఉపాధ్యాయ రంగంలో పిచ్చయ్య సహకారులతోనే అనసూర్య అనేక రకాల ఉద్యమాలను నిర్వహిస్తుందని గుర్తు చేశారు. పిచ్చయ కుటుంబానికి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శి వర్గ సభ్యులు నాదెండ్ల లీలావతి, స్థానిక సభ్యులు పిచ్చయ్య మృతదేహానికి నివాళులర్పించారు.

మృతుని కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటాం

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-బూర్గంపాడు

కిన్నెరసాని వాగులో గల్లంతైన జారె సాయి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ఉప్పుసాక గ్రామంలోని మృతుని కుటుంబాన్ని పరామర్శించి జరిగిన సంఘటను అడిగి తెలుసుకున్నారు. జరిగిన విషయాన్ని కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌తో ఫోన్లో మాట్లాడి మృతుని కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన పేర్కొన్నారు. తక్షణ సాయంగా రూ.10000 కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఉప్పుసాక గ్రామంలో విస్తృతంగా పర్యటించి స్థానికుల వద్ద నుంచి పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. రహదారుల మరమ్మతు, విద్యుత్స్తంభాల అవసరం తదితర సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీనిచ్చారు. అలాగే తుఫాను దాటికి పంట పొలాలు నష్ట పోయిన రైతులను పరామర్శించారు. దెబ్బతిన్న పంటల వివరాలను నమోదు చేసి తనకు అందించాలని మండల వ్యవసాయశాఖ అధికారి శంకర్‌ను ఆదేశించారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మండలంలోని పలువురు సీఎం సహాయ నిధి ద్వారా లబ్ది పొందిన లబ్దిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట నియోజకవర్గ నాయకులు మాజీ జెడ్పీటీసీ బట్టా విజయ్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, టీపీసీసీ సభ్యుడు తాళ్లూరి చంద్రశేఖర్ చక్రవర్తి, మాజీ సొసైటీ చైర్మెన్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ శంకరయ్య సతీమణి ఉమాదేవి కన్నుమూత

- మృతదేహానికి ప్రముఖులు నివాళి



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం ఏజెన్సీకి వైద్య సేవలు అందించిన ప్రముఖుల్లో ఒకరైన డాక్టర్ శంకరయ్య సతీమణి ఉమాదేవి (77) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. 2013వ సంవత్సరంలో డాక్టర్ శంకర య్య మృతిచెందగా ఆయన సతీమణి ఉమాదేవి అనారోగ్యంతో ఆదివారం పట్టణంలోని తమ స్వగృహంలో తుది శ్వాస విడిచారు. డాక్టర్ శంకరయ్య-ఉమాదేవి దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు మొత్తం నలుగురు సంతానం. ఉమాదేవి మరణ వార్త తెలుసుకొని పట్టణ, ప్రముఖులు, తాజా, మాజీ ప్రజాప్రతినిధులు ఆమె భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణంలోని ప్రముఖ వైద్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వివిధ మెడికల్ షాపుల యజమానులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు ఉమాదేవి మృతదేహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏజెన్సీ ప్రాంతానికి డాక్టర్ శంకరయ్య చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

సీపీఐ(ఎం) నివాళి : ఉమాదేవి మృతదేహానికి సీపీఐ(ఎం) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ సీనియర్ నాయకులు జీఎస్ శంకర్రావు, ప్రభావతి, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్ బాబు, సంతోష్ కుమార్, పట్టణ కమిటీ సభ్యులు భూపేంద్ర తదితరులు ఉమాదేవి మృదేహానికి నివాళులర్పించారు.



బెజవాడ బాధితులకు నిత్యావసర కిట్లు పంపిణీ



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భారీ ఎత్తున విస్తారంగా కురిసిన వర్షాలతో విజయవాడలోని సింగ్ నగర్, దాబాకొట్టు సెంటర్, బాంబే కాలనీతో పాటుగా మరెన్నో ప్రాంతాలు జలమయమై జన జీవనం అతలాకుతలం అయింది. మీడియా మాధ్యమాల ద్వారా ప్రసార సాధనాల ద్వారా విషయాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకున్న అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్‌లోని నిమ్మలగూడెం గ్రామానికి చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, తెలుగుదేశం నాయకులు మహమ్మద్ జమాల్ ఖాన్ తన సహచర సిబ్బందిని జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యుల సహాయంతో ప్రతి కుటుంబానికి ఐదు కేజీల బియ్యం, చింతపండు, ఉప్పు, పప్పు, కారం మంచి నూనె తోపాటుగా బంగాళ దుంపలు కూరగాయలను కూడా చేర్చి 500 కిట్లను విజయవాడ నగరానికి చేరుకున్నారు. మొత్తం 500 కుటుంబాల నిర్వాసితులకు రూ.9 లక్షలు విలువ చేసే నిత్యవసరాలను జేకేసిటీ ట్రస్ట్ భాద్యులు జమాల్ ఖాన్, ఇమ్రాన్ ఖాన్ చేతుల మీదుగా నిత్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా జమాల్ ఖాన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ సుభాని, షేక్ గౌస్ బాషా, షేక్ సుభాని, నాగుల్ మీరా, టీడీపీ నాయకులు మాజీ జడ్పీటీసీలు ముత్యాల రామారావు, వాళ్ళ రంగారెడ్డి, బురక కన్నారావు, పాయం రామారావు, రసూల్, శ్రీరామ్, పుట్టి రమేష్ బాబు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు కనితి మధు, జెకె సిటీ ట్రస్ట్ సభ్యులు జావేద్, రియాజ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యమే కట్ట కుంగుబాటుకు కారణం

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వీర్ల రమేష్



నవతెలంగాణ-సుజాతనగర్

గత ప్రభుత్వంలో అధికారులు చేసిన నిర్లక్ష్యం కారణంగానే సింగభూపాలెం ప్రాజెక్ట్ కరకట్ట కుంగుబాటుకి గురైందని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వీర్ల రమేష్ అన్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సింగభూపాలెం ప్రాజెక్ట్ కరకట్ట కుంగిపోయింది. కుంగిపోయిన ప్రాంతాన్ని పార్టీ మండల బృందం ఆదివారం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2016లో రూ.20 కోట్ల వెచ్చించి ప్రాజెక్టు మరమ్మతులు నిర్వహించారని అదే సమయంలో కరకట్ట ఊటవాగు దగ్గర్లో ఇరుపక్కల ప్రొటెక్షన్ వాళ్ళు నిర్మించాలని పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించి అధికారులకు తెలియజేశామని అన్నారు. అయినా అప్పటి అధికారులు పట్టించుకోకపోవడం వలనే ఈ పరిస్థితికి కారణమని అన్నారు. వర్షాలు పెరిగి కట్ట తెగిపోతే వేపల గడ్డ, మంగపేట, నరసింహ సాగర్ వంటి గ్రామాలకు పెను ప్రమాదం ఏర్పడుతుందని అన్నారు. తక్షణమే యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నర్ర శివరామకృష్ణ, కాట్రాల తిరుపతిరావు, కొండే కృష్ణ, నల్లగోపు పుల్లయ్య, బచ్చలకూర శ్రీను, ఏడుకొండలు, శ్రీకాంత్, శ్రీను, తిరుపాలు, ముత్తయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న



నవతెలంగాణ-కరకగూడెం

అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని బట్టుపల్లి గ్రామంలో పార్టీ మండల కమిటీ సమావేశం ఊకే నరసింహరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ గత బీఆర్ఎస్ పార్టీ విధానాలనే అనుసరిస్తుందని అన్నారు. ఆ విధానాలతోనే ప్రజలు గత ప్రభుత్వాన్నీ ఎన్నికల్లో తిరస్కరించారని గుర్తు చేశారు. ఆరు గ్యారెంటీల స్కీమ్‌తో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చిన్న, సన్న కారు రైతులను కొట్టి బడా బాబులకు కట్టపెట్టే విధానాన్ని అనుసరిస్తుందని తెలిపారు. ప్రజలు ఎదుర్కొనే సమస్యలను చర్చించి ప్రజా ఉద్యమాలుగా మలుస్తామని దీర్ఘకాలికంగా ఉన్నటువంటి పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రజలు సహకరించి ఆదరించాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కొమరం కాంతారావు, మండల కమిటీ సభ్యులు చర్ప సత్యం, బిలపాటి శంకరయ్య, కణితి రాము తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా తయారీకి ఉపయోగించే బెల్లం స్వాధీనం



నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం మున్సిపల్ పరిధిలోని మేదరబస్తీ ఏరియాలో గుడుంబా తయారీకి ఉపయోగించే బెల్లం, పట్టికను కొత్తగూడెం ఎక్సైజ్ శాఖ అధికారులు వలపన్ని పట్టుకున్నారని ఎక్సైజ్ శాఖ సీఐ జయశ్రీ తెలిపారు. శనివారం రాత్రి బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 10 లీటర్ల నాటుసారా, 70 కేజీల పట్టిక, 3740 కేజీల బెల్లంను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీటి విలువ సుమారు రూ.2లక్షల 50 వేలు ఉంటుందని తెలిపారు. ఏలూరు జిల్లా అకిరా పల్లి గ్రామానికి చెందిన షేక్ బాజీ అక్రమంగా గుడుంబాకు ఉపయోగించే ముడి సరుకును వాహనంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి కొత్తగూడెంకు తీసుకొస్తున్నరన్న విశ్వసనీయ సమాచారం మేరకు పట్టుకున్నట్టు ఆమె చెప్పారు. గుడుంబా ముడి సరుకును తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ శాఖ హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్, కిరణ్, సత్యనారాయణ, సాయి పల్లవి పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | సెప్టెంబర్ 09, 2024 | www.navatelangana.com

జిల్లా వ్యాప్తంగా 730.6 మి.మీ వర్షపాతం

నవతెలంగాణ-అశ్వారావుపేట

బంగాళఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో గత రెండు రోజులుగా ఎడతెరిపిలేని వానలు కురుస్తున్నాయి. దీంతో జన జీవనం స్తంభించి పోతుంది. తెలంగాణ డెవెలెప్మెంట్ ప్లానింగ్ సొసైటీ తెలిపిన వివరాలు ప్రకారం శనివారం ఉదయం 8.30 గంటలు నుండి ఆదివారం ఉదయం 8 గంటలు వరకు గడిచిన 24 గంటల్లో జిల్లాలోని 23 మండలాల్లో, 27 ప్రాంతాల్లో మొత్తం 730.6 మి.మీ వర్షపాతం నమోదు అయింది.

ఇందులో ప్రాంతాల వారీగా అన్నపురెడ్డిపల్లి మండలం పెంట్లంలో అత్యధికంగా 98.0 మి.మీ, సుజాత నగర్‌లో అత్యల్పంగా 1.0 మి.మీ వర్షపాతం నమోదైంది.

మండలాల వారీగా దమ్మపేట మండలంలో 5 ప్రాంతాల్లో అత్యధికంగా 111.4 మి.మీ, అన్నపురెడ్డిపల్లి మండలంలో 98.0 మి.మీ, చంద్రుగొండలో 93.8 మి.మీ, టేకులపల్లిలో 68.0 మి.మీ, భద్రాచలంలో 52.5 మి.మీ వర్షపాతం నమోదు అయింది. జిల్లా మొత్తం 730.6 మి.మీ వర్షపాతం కాగా అశ్వారావుపేట నియోజక వర్గం 5 మండలాల్లో మొత్తం 381.7 మి.మీ వర్షపాతం నమోదు అయింది.

తాడు సహాయంతో వాగు దాటిన జవాన్లు

- గ్రామస్థులు వాగు దాటేందుకు సైనికులు సహాయం చేస్తున్న వీడియో వైరల్

నవతెలంగాణ-చర్ల

సరిహద్దు చతీస్‌గడ్ సుక్మా జిల్లాలోని చింతల్నార్ పోలీస్ స్టేషన్ పరిధి నాగారం సమీపంలో పొంగిపొర్లుతున్న వాగులను సైనికులు తాడు సహాయంతో దాటడంతోపాటు గ్రామస్థులకు వాగు దాటే ఎందుకు సహాయం చేస్తున్న వీడియో వైరల్ అయింది. సుమారు 15 రోజుల నుండి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా దండకారణ్యంలో వాగులు వంకలు పొంగి ప్రమాద స్థాయిలో ప్రవహిస్తున్న క్రమంలో కూంబింకు వెళ్లి వస్తున్న జవాన్లు ప్రమాద స్థాయిలో ప్రవహిస్తున్న వాగును తాడు సహాయంతో దాటడం జరిగింది. అడవిలో ఇరుక్కుపోయిన గ్రామస్తులను సైతం సైనికులు ఎంతో భద్రంగా తాడు సహకారంతో దాటించడం జరిగింది.

కాటమయ్య రక్షణ కవచం సేఫ్టీ కిట్లుపై శిక్షణ

నవతెలంగాణ-బోనకల్

మండల కేంద్రమైన బోనకల్‌లో కాటమయ్య రక్షణ కవచం సేఫ్టీ కిట్లుపై గీత కార్మికులకు రాష్ట్ర కోఆర్డినేటర్ బెల్లంకొండ వెంకటేశ్వర్లు ఆదివారం శిక్షణ ఇచ్చారు. తాటిచెట్టు ఎక్కి వృత్తి చేస్తున్నప్పుడు ప్రమాదాలు నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం శిక్షణ కార్యక్రమం చేపట్టింది. అందులో భాగంగా బోనకల్ గ్రామంలో తాటివనంలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గీత కార్మికులందరూ కాటమయ్య రక్షణ కవచం వాడి ప్రమాదాల నుంచి బయటపడవచ్చునన్నారు. గీత కార్మికులు అదరూ తప్పనిసరిగా రక్షణ కవచం కిట్లు వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ మండల అధికారి శ్రీనివాస్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు రాధాకృష్ణ, రియాజ్, గోపి, శిక్షకులు నోముల వెంకన్న, ఆలూరు కోటయ్య, మొక్క నాగేశ్వరావు, ఆకుల రమేష్, అనంతల చంద్రయ్య, వంగ పవన్, పలువురు గ్రామ గీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు కూలిన కుటుంబానికి గౌసుద్దీన్ సాయం

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి భరత్‌నగర్ కాలనీ వర్షాలకు ఇల్లుకూలిన బాధితుడుకు బీఆర్ఎస్ జిల్లా మైనార్టీ నాయకులు ఎస్‌కె.గౌసుద్దీన్ ఆదివారం ఆర్ధిక సాయం చేశారు. వారంరోజులుగా ఎడతెరిపి లేని వర్షాలతో మట్టిగోడలు కూలి చలివేంద్రం లక్ష్మినారాయణ కుటుంబం ఇబ్బందులు పడుతుంది. విషయం తెలుసుకున్న గౌసుద్దీన్ తన దాతృత్వాన్ని చాటుతూ రూ.3వేల నగదు బాధిత కుటుంబానికి అందజేశారు. తుఫాన్‌తో కూలి పనులు లేని దశలో పేదలు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని 30 మంది పేదలకు గౌసుద్దీన్ నిత్యావసర వస్తువులను అందజేశారు. నిత్యం సేవా కార్యక్రమాలు చేస్తున్న గౌసుద్దీన్ సేవలను రాజకీయాలకు అతీతంగా ప్రశంసిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఖలిలూల్లాఖాన్, చెవుల అనిల్‌కమార్, ఉదయ్, నరేష్, అబ్దుల్ వాయబ్. కాంతయ్య, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరద ముంపును పరిశీలించిన భట్టి

నవతెలంగాణ-ముదిగొండ

బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణితో విరివిగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మండల కేంద్రమైన ముదిగొండ పిహెచ్సితో పాటు అమ్మపేట, చిరుమర్రి, బాణాపురం, వల్లాపురం, వల్లభి గ్రామాలలో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వరద ముంపుకు గురైన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. వరద ముంపుకు దెబ్బతిన్న పంటలు, బాధితుల వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భట్టి మాట్లాడుతూ వర్షాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలకు కోతకు గురై ధ్వంసమైన రోడ్లతోపాటు, వంతెనలు ఎత్తు పెంచి నిర్మాణం చేసేందుకు నివేదిక అందజేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, తాసిల్దార్ సునీత ఎల్జిబేత్, రెవెన్యూ అధికారులు కరుణాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొమ్మినేని రమేష్ బాబు, నాయకులు పిల్లుట్ల రాఘవ, వడ్డెల్లి వీరరాఘవులు, సిహెచ్ ఎల్లయ్య, బిచ్చాల బిక్షం, పల్లపాటి కృష్ణ, సామినేని సాంబయ్య, బెందు లక్ష్మణ్, మరికంటి వెంకటేశ్వర్లు, తాటికొండ రమేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోని గోవిందాపురం ఎ గ్రామానికి చెందిన షేక్ షాహినాకు అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు భాగం నాగేశ్వరరావు తన తండ్రి భాగం నాయుడు సోదరి బాలినేని విమల జ్ఞాపకార్థం ఐదువేల రూపాయల నగదును టీపీసీసీ సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్ ద్వారా ఆదివారం ముష్టికుంట గ్రామంలో అందజేశారు. షేక్ షాహినా భర్త షేక్ నాగుల్ మీరా గత సంవత్సరం విద్యుత్ షాక్ తో మతి చెందాడు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ముష్టికుంట వచ్చిన సందర్భంగా ఈ నగదు ఆమెకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్, గిర్దావర్ గూగు లోతు లక్ష్మణ్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు కలకోట సొసైటీ అధ్యక్షులు కర్నాటి రామకోటేశ్వరరావు కాంగ్రెస్ గోవిందాపురం గ్రామ కమిటీ అధ్యక్షులు భాగం పాపారావు ఎస్సీ సెల్ అధ్యక్షులు గండమాల రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థంగా దుస్తుల సేకరణ

నవతెలంగాణ-కల్లూరు

ఖమ్మం వరద బాధితుల సహాయార్థం ఆదివారం కల్లూరు, చెన్నూరు గ్రామాల్లో దాతలు దగ్గర నుండి దుస్తుల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. చెన్నూరు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు దంతాల సుధాకర్ ఆధ్వర్యంలో కల్లూరు, చెన్నూరు గ్రామాలలో దుస్తుల సేకరణ కార్యక్రమం జరిగింది. మైక్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తూ దాదాపు 210 చీరలు, 230 ప్యాంట్‌లు, 220 షర్టులు, చిన్నపిల్లలు బట్టలు 180 వరకు సేకరణ జరిపినట్లు సుధాకర్ తెలిపారు. ఖమ్మం వరద బాధితుల సహాయార్థం పంపింబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోడిసాని విజయకుమార్, ఇమ్మడి చిన వీరభద్రరావు, ఇమ్మడి చిన వీరభద్రరావు, ఉదయ లక్ష్మీ, నాళ్ళ శ్రీనివాసరావు, రమదేవి, దిగుమర్తి శిరీష, శ్రీను, చారుగుండ్ల మురళీకృష్ణ, శ్రీదేవి, వేంకటేశ్వర క్లాత్ షో రూం, నాళ్ళ నరసింహారావు, సుభద్ర, కొడవాటి పుల్లారావు, అంజలి, ఏలూరి రమ్య తదితరులు అందించారు.

మార్పు స్వచ్ఛంద సంస్థ చేయూత

నవతెలంగాణ- కూసుమంచి

పాలేరు వరదల వలన సర్వస్వం కోల్పోయిన నానుతండ గ్రామంలో మార్పు స్వచ్ఛంద సంస్థ చేయూత అందించారు. శనివారం ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన కూసుమంచి మండలం నర్సింహులగూడెం పంచాయతీ పరిధిలోని నానుతండాను మార్పు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు సందర్శించి తండాలో నివాసం ఉంటున్న 33 కుటుంబాలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత మాట్లాడుతూ భారీ వర్షాలతో ముంపుకు గురైన ప్రాంతాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. వరద బాధితులకు ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం, మార్పు స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి గుడిమెట్ల మోహన్‌రావు, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాణోత్ బస్కీ నాయక్, నర్సింహులగూడెం మాజీ సర్పంచ్ శీలం గురుమూర్తి, గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు హలావత్ నరసింహరావు, మండల కార్యదర్శి మూడు గన్యా నాయక్, మండల కమిటీ సభ్యులు అజ్మీర్ శంకర్, గుగులోత్ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం, చిమ్మ చీకట్లో, అటవీ ప్రాంతంలో...

ప్రాణాలకు తెగించి..

- పలువురిని కాపాడిన ఎస్ఐ రాణా ప్రతాప్, సిబ్బంది

నవతెలంగాణ-జూలూరుపాడు

భారీ వర్షం కారణంగా అటవీ ప్రాంతంలోని ఎలకలొడ్డు సమీపంలో పోలారం చెరువులో ఉన్న వాగులకు వరద ఉధృతి ఒక్కసారిగా పెరిగింది. వాగు అవతలి వైపుకు మేతకు వెళ్లిన 300 (జీవాలు) మేకలు, గొర్రెలు, వీటితో పాటు తొమ్మిది మంది కాపరులు (మనుషులు) అవతలి వైపు అడవిలో చిక్కుకుపోయారు. వాగుకు ఒక్కసారిగా భారీగా వరదరావడంతో వాగు దాటడానికి వారికి అవకాశం లేకుండా పోయింది. భారీ వర్షంతో పాటు చీకటి పడటంతో భయాందోళన చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న జూలూరుపాడు పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ రాణా ప్రతాప్ సిబ్బందితో కలిసి భారీ వర్షంలో ఆ ప్రాంతానికి హుటా హుటిన చేరుకున్నారు. పోలీస్ వాహనాల వెలుతురులో వాగు అవతలి వైపు నుంచి జీవాలను, మనుషులను



ఇవతలివైపుకు శ్రమించి సురక్షితంగా తీసుకొచ్చారు. భయాందోళనలో ఉన్న వ్యక్తులకు ధైర్యం చెప్పి, 300 జీవాలను వాగు ఇవతలి ఒడ్డుకు చేర్చిన ఎస్సై రాణా ప్రతాప్, సిబ్బందికి వారు చేతులెత్తి నమస్కరించారు.

బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

తడిసిన ధాన్యాన్ని కొనాలి

ప్రతి కుటుంబానికి 50వేల రూపాయలు తక్షణ సాయం చేయాలి

నానుతండా పరిశీలించిన గిరిజన సంఘం జిల్లా బృందం

నవతెలంగాణ -కూసుమంచి



నానుతండా పాలేరు వరదలో పూర్తిగా మునిగిపోయి గిరిజనులు సర్వస్వం కోల్పోయారని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వరద బాధితులను గిరిజన సంఘం జిల్లా బృందం నానుతండ పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గిరిజన సంఘం పర్యటన సందర్భంగా నాను తండ విచ్చేసిన జిల్లా పరిషత్ సిఈఓ దీక్షి రాణుకి తండా సమస్యలను వివరించారు. తడిసిపోయిన వడ్లను వెంటనే కొనుగోలు చేయాలని, వరదల్లో కొట్టకపోయిన మేకలు, వరిగడ్డి, తడిసిపోయిన సామాన్లకు ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. వరద బాధితులకు కుటుంబానికి 50వేల ఆర్థిక సాయం చేయాలని కోరారు. గిరిజన సంఘం ప్రతిపాదించిన అంశాలను జిల్లా కలెక్టర్‌తో చర్చించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని జెడ్పీ సీఈవో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోతు బస్కినాయక్, తెలంగాణ గిరిజన సంఘ మండల కార్యదర్శి మూడు గన్యా నాయక్, జిల్లా కమిటీ సభ్యులు హలవత్ నరసింహారావు, నర్సింహులగూడెం మాజీ సర్పంచ్ శీలం గురుమూర్తి, సైదులు, జిల్లా మండలాధికారులు గిరిజన సంఘం నాయకులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

మున్నేరు జర్నలిస్ట్ వరద బాధితులకు చేయూత

నవతెలంగాణ - బోనకల్



మండల పరిధిలోని గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన మిస్సైల్ మ్యాన్ హెల్పింగ్ హాండ్స్ సంస్థ ఖమ్మంలోని మున్నేరు వరద బాధితుల జర్నలిస్టులకు ఆదివారం ఖమ్మంలో నిత్యావసర సరుకులను అబ్దుల్ కలాం హెల్పింగ్ హ్యాండ్స్ బాధ్యులు వల్లంకొండ సురేష్ అందజేశారు. ఇటీవల ఖమ్మం పట్టణంలో కురిసిన భారీ వర్షాలకు మున్నేరు వరద ప్రాంతంలో తీవ్రంగా నష్టపోయిన జర్నలిస్ట్ సోదరులు గుమ్మడి నరసయ్య, బండారు వీరేష్‌లు తీవ్రంగా నష్టపోయారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మిస్సైల్ మ్యాన్ హెల్పింగ్ హాండ్స్ (ఎంఎంహెచ్‌హెచ్) తరుపున బాధ్యులు వల్లంకొండ సురేష్, వడ్లానపు నరేష్ స్పందించి తమ శక్తి మేరకు బాధితులకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఐదువేల విలువ చేసే దుస్తులు, బియ్యం, నిత్యావసర సరుకులు వారికి అందజేశారు. ఈ హెల్పింగ్ హ్యాండ్స్ ద్వారా ఇప్పటికే మున్నేరు వరద ప్రాంతంలోని చాలా మంది వరద బాధితులకు నిత్యావసర సరుకులు, బియ్యం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు, కొత్తపల్లి సత్యనారాయణ, వల్లం కొండ సుమంత్, సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో మహిళ మృతి

నవతెలంగాణ-పెనుబల్లి

పెనుబల్లి మండలంలోని లంక సాగర్ పంచాయతీ పరిధిలో ఆదివారం విద్యుద్ఘాతానికి గురై ఓ మహిళ మృతి చెందింది.

మొక్కజొన్న సీడ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీకి కాపలాగా వృద్ధ దంపతులు అక్కడ నివాసం ఉంటున్నారు. వారు నివసిస్తున్న రేకుల షెడ్డు ముందు భాగంలో ఉన్న ఇనుప స్తంభానికి విద్యుత్ ప్రవహించడంతో అది గమనించని కోటగిరి సత్యవతి(70) తాకడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మొక్కజొన్న సీడు ప్రాసెసింగ్ పూర్తయి రెండు నెలలు గడిచినా విద్యుత్ వైర్లను నిర్లక్ష్యంగా పడేయడం వల్లే ఈ సంఘటన జరిగిందని బంధువుల ఆరోపిస్తున్నారు. ప్లాంట్ యాజమన్యాం అశ్రద్ధగా వ్యవహరించడం వల్లే ఆ ఘటన జరిగినట్లు ఆరోపిస్తున్నారు.

వాగులో కొట్టుకుపోయిన మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ - ఎర్రుపాలెం

తుఫాను ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన వరదలకు వాగులో యువకుడు కొట్టుకొనిపోయి మృతి చెందిన సంగతి పాఠకులకు విదితమే. మండల పరిధిలోని భవానిపురం గ్రామానికి చెందిన మలిశెట్టి సాంబశివరావు (18) ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో కొట్టుకొనిపోయిన ఘటనలో మృతుడు కుటుంబానికి ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్ గ్రేషియో 5 లక్షల రూపాయల చెక్కును ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మృతుడి తల్లిదండ్రులు మలిశె ట్టి రాఘవరావు జ్యోతి దంపతులకు అందించారు. కార్యక్రమంలో ఆర్డిఓ గణేష్, ఎమ్మార్వో మన్నే ఉషా శారద, ఎంపీడీవో సురేందర్, డిసిసిబి డైరెక్టర్ ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, పిసిసి సభ్యులు శీలం ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు బండారు నరసింహారావు, అనుమో లు వెంకటకృష్ణారావు, సేలం శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డి, బొగ్గుల గోవర్ధనరెడ్డి, శీలం వెంకటరామిరెడ్డి, షేక్ఇస్మాయిల్, మల్లెల లక్ష్మణరావు, రాజీవ్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్



గత కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అకాల వర్షాల వల్ల సర్వం కోల్పోయిన వడ్డెర సంఘం కులస్తులను ఆదుకునేందుకు వడ్డెర సంఘం ముందుకొచ్చింది. ఆదివారం వడ్డెర సంఘం అధ్యక్షులు గుంజా శ్రీను, సెక్రటరీ కూరాకుల మల్లికార్జున్ ప్రకాష్ నగర్ మున్నేరు వరద బాధితులైన వడ్డెర సంఘ సభ్యులకు నష్టాన్ని అంచనా వేసి పంపింగ్ వెల్ రోడ్ పెద్దమ్మ గుడి దగ్గర ఒక్కొక్క కుటుంబానికి 12 వేల రూపాయలు, 6వేల రూపాయల చొప్పున 30 కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో వేముల శ్రీను, ఓర్స్ కృష్ణ, వేముల వీరయ్య, వల్లెపు శ్రీను, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నెలనెలా వైద్య శిబిరం విజయవంతం

- 149 మంది రోగులకు వైద్య సేవలు

నవతెలంగాణ-నేలకొండపల్లి

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి నూతక్కి గంగాధర్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయంలో జరిగిన 21వ నెల నెలా వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ వైద్య శిబిరంలో 149 మంది రోగులకు డాక్టర్లు వైద్య సేవలందించారు. వైద్య శిబిరంలో షుగర్, బీపీ, ఎముకలు కీళ్ల వ్యాధులకు డాక్టర్లు పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. నెలకు సరిపడా మందులను కేవలం 100 రూపాయలకే అందించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ కొల్లి అనుదీప్(ఎండి జనరల్ మెడిసిన్), డాక్టర్ హస్నద్ బాబా (ఎంబీబీఎస్) ఎముకలు కీళ్ల ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ మేదరమెట్ల అనిల్ కుమార్ రోగులకు వైద్య సేవలు అందించారు. 122 మంది బిపి షుగర్ తో పాటు ఇతర సాధారణ జబ్బులకు మరో 27 మందికి ఎముకలు కీళ్ల వ్యాధులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఎన్జీఆర్




ఫౌండేషన్ కన్వీనర్ ఏటుకూరి రామారావు మాట్లాడుతూ నెల నెల వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందన్నారు. భవిష్యత్తులో వీటికి అనుబంధంగా మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఎడతెరిపిలేని వర్షంలో రోడ్లు, ఇల్లన్నీ వరదలో మునిగిపోయినా లెక్కచేయకుండా ప్రజలకిసేవ చేయాలనే సంకల్పంతో ఖమ్మం నుండి వచ్చిన ఎముకలు, కీళ్ల ప్రత్యేక వైద్యులు డాక్టర్ మేదరమెట్ల అనిల్ కుమార్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ కొల్లి అనుదీప్, జనరల్ వైద్యులు డాక్టర్ హస్నద్ బాబాలకు, దాతలు, సిబ్బంది, వాలంటీర్లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రతి నెల రెండవ ఆదివారం షుగర్ బిపి జనరల్ వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వాతావరణం అనుకూలించక జోరుగా వర్షం పడుతున్న కూడా ప్రజలు స్పందించి తమకి అవసరమైన వైద్య సేవలు పొందారని తెలిపారు. ప్రజలకు బీపీ చెకప్, మాత్రలు వేసుకునే విధానంలో సేవలందించిన గ్రామీణ వైద్యులు బండి పుష్పలత, బండారుపల్లి నాగేశ్వరరావు, వసుంధర ఒకేషనల్ విద్యార్థులకు, ఎన్జీఆర్ ఫౌండేషన్ తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్జీఆర్ ఫౌండేషన్ సభ్యులు కెవి.రామిరెడ్డి, గుడవర్తి నాగేశ్వరరావు, కట్టెకోల వెంకటేశ్వర్లు, చెరుపు నరసింహారావు, వృద్ధుల సేవా కమిటీ జిల్లా నాయకులు రాయల వెంకటేశ్వర్లు, వాలంటీర్లు షేక్ అబ్దుల్, షేక్ రహీం, డి.నాగేశ్వరరావు, ఎస్‌కె.జమాల్, మంకెనపల్లి నరసింహారావు, ఏలూరి కోదండ రామారావు, మార్తి కొండలరావు, దండా సూర్యనారాయణ, బొడ్డు బాబురావు, దండా సైదారావు, వల్లంచెట్ల భాస్కరరావు, సామల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల డంపు స్వాధీనం

- ఛతీస్‌గఢ్ సుకుమా జిల్లాలో ఘటన

నవతెలంగాణ-చర్ల

మావోయిస్టుల సురక్షిత స్వర్గధామమైన గోగుండా-సిమ్మెల్ కోర్ జోన్‌లో భారీ వర్షం సమయంలో భద్రతా బలగాలు సంయుక్తంగా నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ విజయవంతమయ్యాయి. నక్సలైట్ల గృహలోకి ప్రవేశించి 30 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి భద్రతా బలగాలు విజయవంతమైన ఆపరేషన్ నిర్వహించాయి. భద్రతా బలగాలు ప్రత్యేకంగా అవలంబిస్తున్న జంగిల్ వార్‌ఫేర్ వ్యూహాల కారణంగా నక్సలైట్లు, తమ కోర్ జోన్‌లోని భద్రతా బలగాలను సురక్షితంగా భావించడం చూసి, నక్సలైట్లు దాచిన డంప్ మెటీరియల్‌ని వదిలి పారిపోయారు. పై చర్యలో, డిస్ట్రిక్ట్ ఫోర్స్, డిఆర్జీ, బస్తర్ ఫైటర్, 206 కార్ప్స్ కోబ్రా, 74 కార్ప్స్ సిఆర్పిఎఫ్ ఉమ్మడిగా ఆపరేషన్ నిర్వహించారని సుకుమా ఎస్పి కిరణ్ చౌహన్ తెలిపారు. కేరళపాల్ ఏరియా కమిటీకి చెందిన నక్సలైట్ల నిరంతర ఉనికి సమాచారంపై సీనియర్ అధికారుల ఆధ్వర్యంలో జిల్లా సుక్మాలో నక్సల్ నిర్మూలన ప్రచారం నిర్వహించబడుతోంది. కార్ప్స్ కోబ్రా 74 కార్ప్స్ ఆర్పిఎఫ్ జాయింట్ పార్టీ శనివారం సాయంత్రం ఆపరేషన్ సమయంలో నక్సలైట్ల గ్రామం గారం, కొత్తపల్లి, నాగారం, నెడుం, తోయపర, సిమ్మెల్, గోగుండ, దోగిన్‌పర పరిసర ప్రాంతాలలోని కోర్ ఏరియా వైపు పారిపోయారని ఎస్పీ తెలిపారు. గోగుండా-సిమెల్ గ్రామంలోని అటవీ-కొండలలో భద్రతా బలగాల కార్యకలాపాలను చూసిన నక్సలైట్లు సంఘటనా స్థలంలో క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాత బీజీయల్ లాంచర్, 315 నక్సలైట్ల రహస్య స్థావరంలో దాచిపెట్టారు. పేలుడు పదార్థాలు ఇతర నక్సలైట్ పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత, ఆపరేషన్ నిర్వహిస్తూనే భద్రతా దళాల పెట్రోలింగ్ పార్టీలందరూ సురక్షితంగా శిబిరానికి



తిరిగి వచ్చారు.

నక్సలైట్ల డంప్ నుండి స్వాధీనం చేసుకున్న సామాగ్రి

ఒక 12 బోర్ గన్, ఒక బిజిఎల్ లాంచర్ గన్, రెండు 315 బోర్ సింగిల్ షాట్ గన్, 8 బిజిల్ బాంబ్‌లు, ఎనిమిది బిజిఎల్, 8 కాట్రిడ్జ్‌లు, ఆరు 12 బోర్ గన్ రౌండ్లు, నమిది 315 బోర్ గన్ రౌండ్లు, ఎనిమిది కార్డెక్స్ వైర్ (01-01 మీటర్), ఒక జత బ్లాక్ నక్సలైట్ షూ, నాలుగు చిన్న పోచ్, ఒక పెద్ద పూచ్, ఒక కిట్టు బ్యాగ్, ఒక కిట్టు సంచి, నలుపు రంగు నక్సలైట్ యూనిఫాం క్లాత్ 1.5 మీటర్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

పదవి లేకున్నా ప్రజా సేవలో తరలించవచ్చు

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సండ్ర

నవతెలంగాణ-సత్తుపల్లి

ప్రజలకు సేవ చేయడానికి పదవి ముఖ్యం కాదని, పదవి లేకున్నా ప్రజల సేవలో తరించవచ్చని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. మండలంలోని గంగారం గిరిజన బెటాలియన్ ఫంక్షన్‌హాలులో బేతుపల్లి గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఎంపీపీ దొడ్డా హైమవతి శంకరరావు పదవీ విరమణ సభలో సండ్ర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సన్మాన సభలో పాల్గొన్న సండ్ర హైమవతి శంకరరావు దంపతులకు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఐదేండ్ల పాటు ఎంపీపీగా హైమవతి శంకరరావు మండల ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు. మున్ముందు ప్రజలకు సేవచేసే భాగ్యాన్ని దొడ్డా హైమవతి శంకరరావుకు ఆ భగవంతుడు కలగజేయాలని ఈ సందర్భంగా సండ్ర ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ ఛైర్మెన్ కూసంపూడి మహేశ్, జెడ్పీటీసీ సభ్యులు కూసంపూడి రామారావు, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు యాగంటి శ్రీనివాసరావు, ఎస్కే రఫీ, మల్లూరు అంకమరాజు, గంగారం సొసైటీ అధ్యక్షులు మందపాటి వెంకటరెడ్డి, గంగారం సర్పంచ్ మందపాటి శ్రీనివాసరెడ్డి, నాయకులు వీరపనేని అప్పారావు (బాబీ), వల్లభనేని పవన్, పర్వతనేని వేణు, వినుకొండ వెంకటేశ్వరరావు, చీపు జగదీశ్, సిద్దినిబోయిన సత్యనారాయణ, కలసాని గజేంద్రరావు, చీపు బ్రహ్మాం, చీపు సత్యనారాయణ, ఓరుగంటి వెంకటేశ్వరరారవు, కందుల శ్రీనివాసరావు, తోట నాగరాజు, మల్లెల్లి పవన్, చందూ పాల్గొన్నారు.

'వృత్తి శిక్షణ తరగతుల'కు దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణి సేవా సమితి ఇల్లందు ఏరియా ఆధ్వర్యంలో నిర్వహించబోయే ఉచిత వృత్తి శిక్షణా కోర్సులలో భాగంగా వృత్తి శిక్షణ తరగతులు బోధించుటకు దరఖాస్తు చేసుకోవాలని జీయం జాన్ ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సులు బోధించడానికి ఆసక్తి గల యువతులు ఈనెల 15 లోపు జీఎం కార్యాలయంలోని సింగరేణి సేవా సమితి కార్యాలయం నందు ధరఖాస్తులు అందజేయాలని తెలిపారు. ఫ్యాషన్ డిజైనింగ్,, స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సుల శిక్షణలో ప్రావీణ్యం ఉన్నవారికి కోర్సు శిక్షకులుగా అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

వైసీఓఏ క్లబ్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు

నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణి వైసిఓఎ క్లబ్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఏరియా సింగరేణి అధికారులు, వారి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు 9 రోజుల పాటు ఘనంగా నిర్వహించబడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీయం జాన్ ఆనంద్, సేవా అధ్యక్షురాలు నిమ్మి ఆనంద్, యస్ఓటూజియం బొల్లం వెంకటేశ్వర్లు, క్లబ్ సెక్రటరీ మహేష్, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి ఇతర అధికారులు కుటుంబ సమేతంగా పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజాసేవకులను చంపడం అమానుషం

- నేడు రాష్ట్ర బంద్‌కు మావోయిస్టుల పిలుపు

నవతెలంగాణ-చర్ల

అనునిత్యం ప్రజా సేవకు పరితపించే మావోయిస్టు పార్టీ సభ్యులను హత్య చేయడం అమానుషం అని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ అన్నారు. ఆ మేరకు ఆదివారం పాత్రికేయులకు లేక పంపారు. అందులో ముఖ్యంగా చతీస్‌గడ్ రాష్ట్రం దంతేవాడ జిల్లా ఆంద్రి గ్రామంలో 2024 సెప్టెంబర్ 03వ తేదీన ఇన్ ఫార్మర్ ఇచ్చిన సమాచారంతో డీఆర్జీ, సీఆర్పీఎఫ్ వందలాది పోలీసు బలగాలు, పిఎల్జీఏ వున్న మాకాంను చుట్టి ముట్టి జరిపిన కాల్పుల్లో 9 మంది కామ్రేడ్స్ అమరులైన విషయం ప్రజలందరికి తెలిసిందదే. ప్రజాసేవకులను చంపడం అమానుషమని నేడు రాష్ట్ర బంద్‌కు మావోయిస్టులు బంద్‌కు పిలుపునిచ్చారు.

భారీగా గంజాయి స్వాధీనం

నవతెలంగాణ-జూలూరుపాడు

వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 246 కేజీల గంజాయిని ఆదివారం జూలూరుపాడు పోలీస్ స్టేషన్ సమీపంలో జూలూరుపాడు పోలీసులు, టాస్క్ ఫోర్ సిబ్బంది కలిసి పట్టుకున్నట్లు కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. ఆదివారం జూలూరుపాడు పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. సారపాక మండలం తాళ్లగొమ్మూరు గ్రామానికి చెందిన దుగ్గెంపూడి శివ శంకర్ రెడ్డి, సారపాక మసీదు బజారుకు చెందిన నాగేంద్రబాబులు కలిసి 246 కేజీల గంజాయిని కొనుగోలు చేసి వాహనంలో సారపాక నుంచి ఖమ్మం వైపు తరలిస్తున్నారు. నమ్మ దగ్గ సమాచారం మేరకు పోలీస్ స్టేషన్ సమీపంలో వాహనాల తనిఖీలో గంజాయిని పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ. 87 లక్షలు చేస్తుందన్నారు. ఇద్దరిని అరెస్టు చేసి రెండు వాహనాలను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై రాణా ప్రతాప్, టాస్క్ ఫోర్స్ ఎస్సై ప్రవీణ్, సిబ్బంది దయానంద్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గుట్కా, అంబర్ ప్యాకెట్లు స్వాధీనం

నవతెలంగాణ-ఇల్లందు

మండలంలోని కొమ్ముగూడెం క్రాస్ రోడ్ వద్ద ఒక ఆటో తనిఖీ చేయగా, ఆటోలో గవర్నమెంట్ నిషేధిత గుట్కా, అంబర్ ప్యాకెట్లు ఉన్నట్లు సిఐ సత్యనారాయణ ఆదివారం విలేకరులకు తెలిపారు. ఆటోలో ఉన్న వ్యక్తి పేరు రేపాకుల చిన్న వెంకటేశ్వర్లు తండ్రి పేరు నాగయ్య లచ్చగూడెం గ్రామంలో వ్యాపారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అతని ఆటోలో ఉన్న మూడు గన్ని బ్యాగులను చెక్ చేయగా ఆర్ఆర్ అంబర్ ప్యాకెట్స్ టుబాకో ఒక్కో బ్యాగులో 40 పెద్ద ప్యాకెట్స్ ఉన్నట్లు పేర్కొన్నారు. మూడు బ్యాగులల్లో మొత్తం కలిపి 120 పెద్ద ప్యాకెట్స్ ఉన్నాయి. దీని విలువ సుమారు రూ.48 వేలు ఉంటుంది. ప్యాకెట్స్, ఆటోను సీజ్ చేయడం జరిగిందని నిందితుడు రేపాకుల చిన్న వెంకటేశ్వర్లు మీద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వరద బాధితులకు అన్నదానం

నవతెలంగాణ-ఖమ్మం

49 వ డివిజన్ నివాసి వల్లపుదాసు గోవర్ధన్, వారి కూతురు యార్లగడ్డ స్నేహ సహకారంతో వారి ఆధ్వర్యంలో ఓవర్ బ్రిడ్జి క్రింద గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వరద బాధిత పేదలకు ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంను కార్పొరేటర్ దుద్దుకూరి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వరద బాధితులకు అన్నదానం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వల్లపుదాసు గోవర్ధన్, వారి కూతురు యార్లగడ్డ స్నేహ, చంద్రకాని రేవంత్, గిరిధర్, జక్కుల వెంకటరమణ, కందుకూరి మహేష్, మొఘపోతుల హరీష్, చాపల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఇదారా తాలీముల్ ఇస్లాం ట్రస్ట్ గొల్లగూడెం ఆధ్వర్యంలో..

నగరంలోని 60 వ డివిజన్ రామన్నపేట కాలనీకి చెందిన మున్నేరు వరద బాధితులకు ఇదారా తాలీముల్ ఇస్లాం ట్రస్ట్ గొల్లగూడెం ఆధ్వర్యంలో శనివారం అన్నదానం నిర్వహించారు. కాలనీకి చెందిన సుమారు 300 కుటుంబాలు వరద ప్రవాహానికి సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులయ్యారు. వరద ప్రవాహం తగ్గి వారం రోజులు కావస్తున్నా.. బాధితులు ఇంకా తమ ఇళ్లలోకి వెళ్లి వంట చేసుకునే పరిస్థితి లేదు. ఆకలి కడుపుతో చెదిరిన తమ ఇంటిని ఇంకా సర్దుకునే పనిలోనే ఉన్నారు. రామన్న పేట వాసుల కష్టాలు తెలుసుకుని తాలీముల్ ఇస్లాం ట్రస్ట్ బాధ్యులు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బాధ్యులు ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ ఖాన్ ఖాస్మీ, యాకుబ్ పాష, అఫ్జల్ హసన్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు నిత్యవసరాల పంపిణీ

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం జిల్లా మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్నేరు పరివాహక ప్రాంత ముంపు బాధితులకు ఆదివారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. బియ్యం, పప్పు, ఉప్పు వంటనూనె తదితర సామగ్రిని బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ సభ్యులు మాట్లాడుతూ...రానున్న రెండు మూడు రోజుల్లో భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం స్పష్టం చేస్తుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ గుండెపోగు నరేష్, వైస్ ప్రెసిడెంట్ యం. వినయ్ కుమార్, ట్రేసరర్ వంకాయల నవీన్, వినయ్, సల్మాన్, నాని, పాషా నోవాకేర్ బ్లడ్ బ్యాంక్ వినయ్, ల్యాబ్ టెక్నీషియన్స్ పాల్గొన్నారు.

ఎస్టీ బాలికల హాస్టల్లో ఎమ్మెల్యే కోరం జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఇల్లందు

పట్టణంలోని ఎస్టీ బాలికల హాస్టల్‌లో ఆదివారం ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదిన వేడుకలు ఆదివారం నిర్వహించారు. పిల్లల మధ్యలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. జన్మదిన సందర్భంగా హాస్టల్ పిల్లల కోరిక మేరకు 42 ఇంచెస్ టీవీని మున్సిపల్ చైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు-బేబీ భార్గవి దంపతులు వితరణ చేశారు. దళితుల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు పులిగండ్ల మాధవరావు, పట్టణ నాయకులు, టిఎంఆర్పిఎస్ జిల్లా అధ్యక్షులు మేకల శ్యాంలు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో దళితుల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కనకయ్య ఆహర్నిశలు కృషి చేసే, దళితుల ఆపద్బాంధవుడని అన్నారు.

మళ్లీ వరద పోటు



నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్/నిజాంసాగర్/విలేకరులు

అటు మహారాష్ట్ర.. ఇటు కర్నాటకలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. మంజీరా నది నుంచి ప్రవాహం పెరగడంతో ఎస్సారెస్పీకి మరోసారి వరద ఉధృతి పెరిగింది. లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా.. 24 గేట్లు ఎత్తి దిగువకు 1.26 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్టు ఏఈఈ రవి తెలిపారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రతో పాటు ఇటు నిజాంసాగర్ గేట్లు సైతం ఎత్తివేయడంతో మంజీరా నీరు వచ్చి గోదావరిలో కలుస్తుండటంతో వరద ప్రవాహం పెరిగింది. దాంతో శనివారం పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరువకావడంతో ఉన్నత అధికారుల ఆదేశాల ప్రకారం శనివారం రాత్రి 10:45 గంటలకు 9 గేట్లు ఎత్తి 28,116 క్యూసెక్కుల మిగులు జలాలు దిగువకు విడుదల చేశారు. వరద పెరుగుతున్నా కొద్దీ క్రమంగా గేట్లు ఎత్తివేత పెంచుతూ ఆదివారం సాయంత్రం 7 గంటల సమయానికి 24 గేట్ల ద్వారా 99,968 క్యూసెక్కులు గోదావరి నదిలోకి వదిలి ఎస్కేప్ గేట్ల ద్వారా 4000 క్యూసెక్కుల జలాలు గోదావరి నదిలోకి వదులుతూ వరద కాలువ ద్వారా 18000, కాకతీయ ప్రధాన కాలువకు 4000 క్యూసెక్కుల జలాలు వదులుతూ మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు 80.50 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1090 అడుగులు 80 టీఎంసీల నీటిమట్టం ఉన్నట్టు ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు.

నాగార్జునసాగర్‌కు పోటెత్తుతున్న వరద

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. దాంతో 24 గేట్లు ఎత్తి 2.99 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్ట 590 అడుగులు 308 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 588 అడుగులు 312 టీఎంసీలుగా ఉంది. అల్మట్టి డ్యామ్ దాని దిగువన ఉన్న జూరాల, సుంకేసుల ప్రాజెక్టు నుంచి 2 లక్షలకు పైగా వరద నీరు శ్రీశైలం డ్యామ్‌కు చేరుతోంది. ఆదివారం నాటికి శ్రీశైలం ప్రాజెక్టు 8గేట్లను 10 అడుగులు పైకి ఎత్తి నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు, 215.807 టీఎంసీల సామర్థ్యం కాగా, ప్రస్తుతం 883.50 అడుగులు, 207.4103 టీఎంసీలకు చేరుకుంది. నిజాంసాగర్‌కు 39 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా.. మొత్తం 5 గేట్లు ఎత్తి దిగువకు అదే స్థాయిలో నీటిని మంజీరా నదిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1405 అడుగులు(17.802 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1404.62 అడుగుల(17.252 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. నిజాంసాగర్ ఎగువ భాగాన సింగూరు ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి నీటిని విడుదల చేస్తుండటంతో ప్రాజెక్టుకు వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది.

ఎస్సారెస్పీలో ఒకరు గల్లంతు

నవతెలంగాణ-బాల్కొండ

శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు గోదావరి నదిలో ఆదివారం ఒకరు గల్లంతయ్యారు. మహారాష్ట్రలోని ముంబైకి చెందిన ఫెరోజ్ (28) జగిత్యాల జిల్లా కోరుట్లలో స్నేహితుల వద్దకు వచ్చాడు. ఈ క్రమంలో వారితో కలిసి ఆదివారం శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు సందర్శనకు వచ్చి ప్రమాదవశాత్తు గోదావరి నదిలో పడి కొట్టుకుపోయాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.


సీఎం సహాయనిధికి విరాళాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



ప్రముఖ వ్యాపారవేత్త రవి రహేజా ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.ఐదు కోట్లు విరాళంగా అందించారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో రేవంత్ రెడ్డిని కలిసి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సీఎం ఆయన్ని అభినందించారు. అలాగే మరో ప్రముఖ వ్యాపారవేత్త జీవీకే రెడ్డి కూడా సీఎం సహాయనిధికి రూ. ఐదు కోట్లు విరాళంగా ఇచ్చారు. ఆయన కూడా సీఎం నివాసంలో రేవంత్‌రెడ్డిని కలిసి చెక్ అందచేశారు. వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) వ్యవస్థాపకులు, ఛాన్సలర్ డాక్టర్ జీ విశ్వనాథన్, ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్ కూడా సీఎం రిలీఫ్‌ఫండ్‌కు రూ.50 లక్షలు విరాళం అందచేశారు. కేఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ నర్సింహారెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జలంధర్‌రెడ్డి రూ.రెండు కోట్లు విరాళంగా ఇచ్చారు. నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రంగరాజు, డైరెక్టర్ సూర్య రూ.కోటి విరాళాన్ని సీఎం రేవంత్‌రెడ్డికి అందచేశారు. క్రెడాయ్ తెలంగాణ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో కోటిరూపాయల్ని సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళంగా ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలోక్రెడాయ్ ప్రతినిధులు ఈ చెక్కును ఆయనకు అందచేశారు.

సీఎం ఇంట్లో చవితి వేడుకలు



వినాయక చవితి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు జూబ్లీహిల్స్ నివాసంలో పూజలు చేశారు. వారితో పాటు నూతన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ దంపతులు కూడా ఈ పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మెన్ కోదండరెడ్డి తదితరులు కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీఎం ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 ఏండ్లుగా నిష్ఠతో, భక్తి శ్రద్ధలతో గణేష్ ఉత్సవ సమితి ఇక్కడ ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమనీ, వీటిని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటుందని చెప్పారు. హైదరాబాద్ నగరంలో 1లక్షా 40వేల విగ్రహాలను ఏర్పాటు చేసి పూజిస్తున్నారనీ, ఆ మండపాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తున్నదని తెలిపారు.



సీఎంను కలిసిన బీసీ కమిషన్ ఛైర్మెన్

బీసీ కమిషన్ ఛైర్మెన్‌గా నియమితులైన నిరంజన్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ఛైర్మెన్‌తో పాటు కమిషన్ నూతన సభ్యులు జయప్రకాశ్, సురేందర్, బాలలక్ష్మి కూడా సీఎంను కలిశారు. తమకు కమిషన్‌లో అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

టీజీసీపీజీఈజీ సెట్ తొలి విడతలో 21,505 సీట్ల కేటాయింపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ కామన్ పోస్టు గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్టు(టీజీ సీపీజీఈటీ) తొలి విడతలో 21,505 సీట్లు కేటాయించినట్టు టీజీసీపీజీఈటీ సెట్ కన్వీనర్, ప్రొఫెసర్ ఐ.పాండురంగారెడ్డి తెలిపారు. ఆదివారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో పీజీతో పాటు ఐదేండ్ల పీజీ డిప్లొమా కోర్సులు కూడా ఉన్నాయని తెలిపారు. మొత్తం 28,323 మంది వెబ్ ఆప్షన్లు పెట్టుకోగా తొలి విడతలో 21,505 మందికి సీట్లు కేటాంచామనీ, అందులో పురుషులు 5,811 మంది, మహిళలు 15,694 మంది ఉన్నారని పేర్కొన్నారు. సీట్లు పొందిన వారు నిర్దేశిత ఫీజును కాలేజీలకు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని సూచించారు. సీటీ పొందిన కాలేజీల్లో టీసీ ఇవ్వాలని తెలిపారు. ఎస్ఎస్‌సీ, డిగ్రీ మెమోలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు.

లంచం అడిగితే కంప్లైంట్ చేయండి

- విద్యుత్ వినియోగదారులకు ఎన్పీడీసీఎల్ సీఎండీ విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ సిబ్బంది ఎవరైనా లంచం అడిగితే తక్షణం సంస్థ యాజమాన్యానికి లేదా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కు ఫిర్యాదు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉత్తర ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్పీడీసీఎల్) సీఎండీ వరుణ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన నాణ్యమైన సేవలు అందించేందుకు సంస్థ కట్టుబడి ఉన్నదనీ, సేవలు అందించే క్రమంలో సంస్థ సిబ్బంది వినియోగదారులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. విద్యుత్ సిబ్బంది లంచం అడిగితే 92810 33233 ఫోన్ నెంబర్‌కు లేదా అవినీతి నిరోధక శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1064 కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని చెప్పారు. విద్యుత్ సిబ్బంది వినియోగదారులకు సిటిజన్ చార్టర్‌కి లోబడి సేవలు అందించాలనీ, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.



పారా ఒలింపిక్స్‌లో కాంస్యపతకం సాధించిన తెలంగాణకు చెందిన యువ అథ్లెట్ దీప్తి జీవాంజినీ, కోచ్ రమేశ్‌లను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క) ఆదివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో అభినందించారు. వారిని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో శాట్ ఛైర్మెన్ శివసేనారెడ్డి, దివ్యాంగుల కార్పొరేషన్ ఛైర్మెన్ ముత్తినేని వీరయ్య పాల్గొన్నారు.

పోరాటాల గొంతుక మూగబోయింది

- ఐద్వా పట్టణ అధ్యక్షులు సూర్ణపు సావిత్రమ్మ మృతి
- సీపీఐ(ఎం) సీనియర్ నేత సోమన్నకు సతీ వియోగం
- నివాళులు అర్పించిన పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య
- పలు పార్టీ శ్రేణుల ఘన నివాళి



(ఫైల్)

నవతెలంగాణ-మహబూబాబాద్

పేదలకు భూ పంపిణీ, గుడిసెల పోరాటంలో నేనున్నా.. అంటూ వెన్నంటే నిలిచిన ఐద్వా మహబూబాబాద్ పట్టణ అధ్యక్షులు సూర్ణపు సావిత్రమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. మానుకోట పట్టణ రాజకీయాల్లో నాలుగు దశాబ్దాలుగా అహర్నిశలు కృషి చేస్తున్న పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, సీపీఐ(ఎం) మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సూర్ణపు సోమయ్య సతీమణి సూర్ణపు సావిత్రమ్మ(54).. ఆయన వెంటనే నడుస్తూ పార్టీ నిర్వహించే అన్ని పోరాటాల్లో అండగా నిలిచారు. సోమయ్య ఆరుసార్లు ప్రజాప్రతినిధులు గెలుపొందడంలో సావిత్రమ్మ కీలక పాత్ర పోషించారు. ఆమె మృతి పట్ల సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, పార్టీ జిల్లా నాయకులు.. ఆమె మృతదేహంపై ఎర్రజెండా కప్పి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. నివాళి అర్పించిన వారిలో.. ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంపీ మాలోతు కవిత, మున్సిపల్ ఛైర్మెన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు ఉన్నారు. హైదరాబాదులో ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ డాక్టర్ ఉమా పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యేలు బానోతు శంకర్ నాయక్, బండి పుల్లయ్య బండి పుల్లయ్య ఆమె మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. సావిత్రమ్మ మరణ వార్త వినగానే జిల్లా నలుమూలల నుంచి ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నివాళులు అర్పించారు. నేడు సోమవారం మానుకోటలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు పార్టీ శ్రేణులు తెలిపారు.

మైనర్ బాలికపై లైంగిక దాడి

- గర్భం దాల్చిన బాలిక
- యువకులపై పోక్సో కేసు నమోదు
- నిందితులను రిమాండుకు తరలించిన పోలీసులు
- మీడియాకు వివరాలు వెల్లడించిన సిద్దిపేట ఏసీపీ



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

మైనర్ బాలికకు ముగ్గురు యువకులు మాయ మాటలు చెప్పి, వేరు వేరు సమయాల్లో పలుమార్లు ఆమెపై లైంగికదాడికి పాల్పడగా, బాలిక గర్భవతి కావడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. దాంతో ఆ ముగ్గురు యువకులపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. సిద్దిపేట ఏసీపీ జి. మధు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక మండలంలోని ఒక గ్రామానికి చెందిన తొమ్మిదో తరగతి చదివే బాలిక ఇటీవల అనారోగ్యానికి గురి కావడంతో బాలిక తల్లి బాలికను సిద్దిపేట జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వెళ్ళింది. అక్కడ బాలికను పరీక్షించిన వైద్యులు ఆమె గర్భవతి అని తేల్చారు. వెంటనే వైద్యులు సిద్దిపేట భరోసా కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో.. అధికారులు గర్భవతయిన బాలిక నుంచి పూర్తి వివరాలను సేకరించారు. దుబ్బాక మండలానికి చెందిన ఒక యువకుడు, అక్బర్ పేట-భూంపల్లి మండలానికి చెందిన ఇద్దరు యువకులు గత మార్చి, ఏప్రిల్ నెలల్లో బాలిక తల్లి ఇంట్లో లేని సమయంలో వివిధ సమయాల్లో ఇంటికి వచ్చి బాలికకు మాయ మాటలు చెప్పి, లోబర్చుకొని పలుమార్లు లైంగికదాడి చేశారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురు యువకులపై పోక్సో కేసు నమోదు చేయగా, ఆ యువకులను ఆదివారం రిమాండ్‌కు తరలించారు. ఎవరైనా బాలికలు, మహిళలపై అఘాయిత్యాలకు, అకృత్యాలకు, వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏసీపీ మధు హెచ్చరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రెండు నెలల వేతన విరాళం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వరద బాధితుల విషయంలో కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. వరద బాధితుల కోసం రెండు నెలల జీతాన్ని ఇవ్వాలని ప్రజాప్రతినిధులు నిర్ణయించారు. వరద సాయంలో భాగంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ప్రభుత్వ సలహాదారులు, కార్పొరేషన్ల ఛైర్మెన్లు తమ రెండు నెలల వేతనాన్ని సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళంగా ఇచ్చారు సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ నూతన అధ్యక్షులు బొమ్మన మహేష్‌కుమార్‌గౌడ్ సూచనమేరకు ఆదివారం ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు తమ రెండు నెలల జీతాన్ని సీఎం సహాయనిధికి ఇస్తున్నట్టు ప్రకటించారు.

పోలింగ్ బూత్ కేంద్రంగానే సభ్యత్వ కార్యాచరణ

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అధికారమున్నా, లేకున్నా సిద్ధాంతం కోసమే తమ పార్టీ పనిచేస్తున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. పోలింగ్ బూత్ కేంద్రంగా సభ్యత్వ కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని హోటల్ కత్రియాలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రధాని నుంచి బూత్ లెవల్ ఏజెంట్ వరకు ప్రతి ఒక్కరూ మరోమారు సభ్యత్వం తీసుకోవాలని పార్టీ నిర్ణయించిందన్నారు. పార్టీలో చేరితే ఇన్సూరెన్స్ ఇస్తామని మభ్యపెట్టాల్సిన అవసరం లేదనీ, స్వచ్ఛంధంగా చేరేవారికే సభ్యత్వం ఇవ్వాలని పార్టీ సూచించిందని తెలిపారు. రెండు సీట్ల నుంచి వరుసగా మూడోసారి అధికారం వచ్చే స్థితికి పార్టీ ఎదిగిందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ తమదేనని చెప్పారు. పార్టీలో క్రియాశీల సభ్యత్వం కోసం కనీసం 100 మందితో సభ్యత్వం చేయించాలనీ, సభ్యత్వ సేకరణను నిర్దేశిత షెడ్యూల్ లోపు పూర్తిచేయాలని సూచించారు. ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ..తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తామని చెప్పారు. వికసిత్ భారత్ లక్ష్యంగా తమ పార్టీ ముందుకెళ్తున్నదన్నారు. రంగులు మార్చే రాజకీయ నాయకులను చూసి ఊసరవెల్లి సైతం సిగ్గుపడుతున్నదని విమర్శించారు. దేశ ప్రయోజనాల కోసం వక్ఫ్‌బోర్డుపై నిర్ణయం తీసుకున్నామన్నారు. సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి అరవింద్ మీనన్ మాట్లాడుతూ..నియమాలకు అనుగుణంగా తమ పార్టీ ముందుకెళ్తున్నదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సంస్థాగత ఇన్‌చార్జి చంద్రశేఖర్ తివారీ, ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు, తమిళనాడు, కర్నాటక ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన పసికందు

- గుర్తుతెలియని వ్యక్తులు వదిలేసి వెళ్లిన వైనం
- శిశువు ఏడుపులు గమనించి చేరదీసిన మాజీ ఎంపీటీసీ పస్తం లక్ష్మీ నరహరి
- పసికందు ఆస్పత్రికి తరలింపు
- పిల్లలు అవసరం లేకపోతే 1098 సమాచారం ఇవ్వండి : మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారుల విజ్ఞప్తి

నవతెలంగాణ-దుబ్బాక రూరల్

సిద్దిపేట జిల్లా దుబ్బాక రూరల్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో శనివారం దారుణం చోటుచేసుకుంది. అప్పుడే జన్మించిన నవజాత శిశువును గుర్తుతెలియని వ్యక్తులు బట్టలో చుట్టి ప్లాస్టిక్ టబ్‌లో బోర్లేసి తిమ్మాపూర్ జాతీయ రహదారిపై వదిలేసి వెళ్లారు. ఈ క్రమంలో ఆ పక్కగా వెళుతున్న మాజీ ఎంపీటీసీ పస్తం లక్ష్మీ నరహరి.. జాతీయ రహదారి పక్కనున్న గోదాం సమీపంలో పసికందు ఏడుపులు వినిపించడంతో వెళ్లి చూసి చేరదీశారు. అనంతరం సిద్దిపేటలోని సంరక్ష పిల్లల ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న దుబ్బాక ఐసీడీఎస్ సీడీపీఓ ఎల్లయ్య మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు హుటాహుటిన ఆస్పత్రికి వెళ్లి శిశువుపై ఆరా తీశారు. అనంతరం వైద్యాధికారులతో మాట్లాడి బాబు ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. అనంతరం సీడీపీవో ఎల్లయ్య మీడియాతో మాట్లాడుతూ.. బాబు 2.2 కేజీలు ఉన్నాడని, ప్రస్తుతం ఎలాంటి ఆరోగ్య సమస్యలు గుర్తించలేదని వైద్యులు నిర్ధారించినట్టు తెలిపారు. చికిత్స అనంతరం శిశు గృహానికి పంపనున్నట్టు చెప్పారు. తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు మాట్లాడుతూ.. ఎవరికైనా పిల్లలు అవసరం లేకపోతే చైల్డ్ లైన్ నెంబర్ 1098కు సమాచారం ఇవ్వాలని, అంతే కానీ రోడ్డు పక్కన వదిలి వెళ్లడం సరికాదని విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్‌కు గడ్డం శ్రీనివాస్ యాదవ్ రాజీనామా

నవతెలంగాణ -సుల్తాన్‌బజార్

బీఆర్ఎస్ పార్టీకి ఆ పార్టీ సీనియర్ నేత, హైదరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి గడ్డం శ్రీనివాస్ యాదవ్ గుడ్ బై చెప్పారు. గతంలో హైదరాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్‌గా సేవలందించిన ఆయన ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ పార్లమెట్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పదవితో పాటు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. తన రాజీనామా లేఖను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్‌కు పంపించినట్టు చెప్పారు. త్వరలో గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గం ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అనుచరులు, శ్రేయోభిలాషులతో చర్చించిన అనంతరం భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానన్నారు.

శ్వేతా మంత్రి... ఓ హాస్య నటి. ఓ వికలాంగురాలిగా తనలాంటి వారు ఎదుర్కొనే సమస్యల గురించి పూర్తి అవగాహనతో ఉన్నారు. అవసరమైన మౌలిక సదుపాయాలు లేక వికలాంగులు సమాజంలో వెనకబడి పోవడం గురించి ఆవేదన చెందుతున్నారు. అందుకే వైకల్యంపై ప్రజలకున్న అపోహల గురించి అవగాహన కల్పించేందుకు నడుం బిగించారు. దానికోసం స్టాండ్ అప్ కామెడీని ఆయుధంగా మలుచుకున్న ఆమె పరిచయం నేటి మానవిలో....



మాట్లాడటం మార్పుకు మొదటి మెట్టు

శ్వేతా జీవితంలోకి కామెడీ ఊహించని విధంగా ప్రవేశించింది. 2014లో ఆమె వికలాంగులు ఎదుర్కొంటున్న సవాళ్లపై ఓ చలనచిత్రాన్ని రూపొందించారు. ఇందులో ఆమె అనేక సమస్యల గురించి తెలియజేశారు. అయితే కంటెంట్ ప్రేక్షకులకు అంతగా నచ్చలేదు. దాంతో ఆమెకు ఎదురుదెబ్బ తగిలింది. వికలాంగులకు అనేక సదుపాయాలు అందుబాటులో ఉన్నప్పటికీ ఇలాంటి సినిమా ఎందుకు తీయాల్సి వచ్చిందని ప్రజలు ఆమెను ప్రశ్నించారు. వైకల్యాల పట్ల ప్రజలకున్న అవగాహన గురించి ఈ అనుభవం ఆమెకు నేర్పింది. అప్పటి నుండి వైకల్య అవగాహన కార్యక్రమాల్లో చురుగ్గా పని చేయడం మొదలుపెట్టారు. వికలాంగుల కోసం ఇతర మార్గాలు వెతకడం ప్రారంభించారు. అప్పుడే ఆమె స్టాండ్-అప్ కామెడీ సరైన మాధ్యమం అనే నిర్ణయానికి వచ్చారు. వైకల్యాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలనే కోరిక, కళారూపంపై ఆమెకున్న ఆసక్తి... ఈ రెండింటినీ కలపడానికి దారితీసింది. 'స్టాండ్-అప్‌లో ప్రేక్షకుల నుండి స్పందన తక్షణమే ఉంటుంది. నాకు కామెడీ అనేది వైకల్యం గురించి అవగాహన పెంచడం మాత్రమే కాదు. అది నా శక్తిని తిరిగి పొందడం కూడా' అని ఆమె పంచుకున్నారు.

వాష్‌రూంకు వెళ్లడమే కష్టమయ్యేది

శ్వేత పుట్టడమే వెన్నెముక సమస్య అయిన స్పైనా బిఫిడాతో జన్మించారు. దీనివల్ల ఆమె ఎడమ కాలు పనిచేయలేదు. ఫిజియోథెరపీతో కొంత కదలిక వచ్చింది. ఏడేండ్ల వయసు వరకు ఇతరుల సహాయంతో ఆమె పాఠశాలకు వెళ్లారు. ఆ తర్వాత క్రచెస్, లెగ్ బ్రేస్‌లను ఉపయోగించారు. కదలిక అనేది ఆమె ఇప్పటికీ ఎదుర్కొంటున్న సమస్య. గతంలో ఆమె కాలు నొప్పి లేకుండా 5 నుండి 7 నిమిషాలు నిలబడగలిగేవారు. ఇప్పుడు కేవలం నిమిషం మాత్రమే నిలబడగలరు. వాష్‌రూమ్‌కు తరచుగా వెళ్లాల్సి వచ్చేది. సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఈ సవాళ్లు ఆమెకు రోజురోజుకు పెరిగిపోయాయి. కాలేజీలో ఎలక్ట్రిక్ వీల్ చైర్ ఇచ్చారు. అయితే చాలా చోట్ల ర్యాంప్‌లు లేకపోవడంతో ఆ ప్రాంతాలు ఉపయోగించుకోలేకపోయే వారని ఆమె గుర్తుచేసుకున్నారు. నేటికీ పరిస్థితి పెద్దగా మెరుగుపడలేదు. వాష్‌రూమ్‌లు పని చేయకపోయినా, ఫ్లోరింగ్ నడవడానికి సౌకర్యంగా లేకపోయినా ఆమె ఈవెంట్‌లను దాటవేస్తున్నారు.

సానుభూతి చూపేవారు

కామెడీ క్లబ్‌లో జారే నిగనిగలాడే ఫ్లోరింగ్ ఉండేదని ఆమె గుర్తు చేసుకున్నారు. 'నాకు దానిపై నడవడం అసాధ్యం. వాష్‌రూమ్‌కు వెళ్లడం కూడా పెద్ద సమస్యగా మారింది. ప్రతిసారీ సహాయం కోసం అడగవలసి వచ్చేది. ఇది నా పనితీరుపై కూడా ప్రభావం చూపింది' అని ఆమె చెప్పారు. వైకల్యంతో జీవించడానికి రోజువారీ జీవితంలో ప్రణాళిక అవసరం. వేదిక పై అంతస్తులో ఉంటే, అక్కడ ఎలివేటర్ లేనట్లయితే ఆమె ముందుగానే ప్లాన్ చేసుకోవాలి. స్టేజిపైకి వెళ్లే మెట్లు చాలా ఎత్తుగా ఉంటే ఆమె వేదిక కిందే ప్రదర్శన ఇవ్వాలి. తన చిన్నతనంలో ప్రజలు ఆమెను భిన్నంగా చూసేవారని కూడా గుర్తు చేసుకున్నారు. 'ఇది చాలా దురదృష్టకరం' అంటూ ప్రజలు సానుభూతి చూపేవారు. బంధువులు నా భవిష్యత్తు, కెరీర్, వివాహం గురించి మాట్లాడేవారు. నాకు పూర్తి అవగాహన లేనప్పుడే ఈ విషయాలన్నీ నేను వినాల్సి వచ్చింది. కానీ అవి ఇప్పటికీ నాపై శాశ్వత ప్రభావాన్ని మిగిల్చాయి' అంటూ ఆమె పంచుకున్నారు.





విత్ దిస్ ఎబిలిటీ

మార్పుకు మార్గం స్టాండ్-అప్ కమెడియన్‌ను ఆమె ఎంచుకున్నారు. అయినా తన న్యాయవాద వృత్తికి మాత్రం ఆమె కట్టుబడి ఉన్నారు. వైకల్యం ఉన్న వ్యక్తిగా ప్రేమ, లైంగికత విషయాల పట్ల వివిధ ప్రాజెక్ట్‌లు, ప్యానెల్ చర్చల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఆమె చేతిలో ప్రస్తుతం 'విత్ దిస్ ఎబిలిటీ' అనే కాన్సెప్ట్ షో ఉంది. ఇది ఒక గంట కామెడీ సంభాషణ. ఈ కార్యక్రమాన్ని కార్పొరేట్ ప్రేక్షకుల కోసం, అలాగే పబ్లిక్ షోలలో కూడా ప్రదర్శిస్తారు. వైకల్యం గురించి మాట్లాడటం మార్పుకు మొదటి మెట్టు అని ఆమె అభిప్రాయం. వికలాంగుల వసతి అవసరాలను సాధారణీకరించవలసిన అవసరాన్ని కూడా ఆమె నొక్కి చెబుతున్నారు.

అర్హులు కాదని...

ఆమె కామెడీ ఓ సాధనంగా ప్రారంభమై ఉండవచ్చు. కానీ ఇప్పుడు హాస్యంలోని సూక్ష్మ నైపుణ్యాలను నేర్చుకుంటున్నట్లు చెబుతున్నారు. ఎదుగుదల, అభ్యాసంతో కూడిన ప్రయాణంగా మారింది. ఇక వైకల్యం విషయానికి వస్తే లోతైన సమాజిక వివక్ష ఉందని, వికలాంగులు గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి అర్హులు కాదని సామాజం భావిస్తుందని ఆమె అంటున్నారు. 'వికలాంగుల జీవితాలకు మద్దతు ఇవ్వడానికి మా వద్ద వనరులు ఉన్నాయి. ఏదేమైనా వారి సామర్థ్యాలపై వివక్ష పితృస్వామ్యం వలె లోతుగా పాతుకుపోయింది. మార్పు కోసం మేము ప్రయత్నిస్తున్నాం. కానీ చాలా సమయం పడుతుంది. వికలాంగులు ఇళ్ల నుంచి బయటకు రావడానికి ఇష్టపడరని చాలా మంది అనుకుంటారు. కానీ ఇది నిజం కాదు. వారికి అనుకూలమైన మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్లనే సమాజంలో వికలాంగుల కదలిక తక్కువగా ఉంటుంది. ఈ శారీరక, మానసిక అడ్డంకులను ఛేదించడానికి సమిష్టి కృషి అవసరం' ఆమె అంటున్నారు.

సవాళ్లు ఎదురయ్యాయి

శ్వేత తల్లిదండ్రులిద్దరూ చార్టర్డ్ అకౌంటెంట్లు. చిన్నప్పటి నుండి బ్యాలెన్స్ షీట్లు, ట్రయల్ బ్యాలెన్స్‌ల గురించి వింటూ పెరిగారు. అయితే సీఏ కావడం తన వల్ల కాదని ఆమెకు తెలుసు. దానికి బదులుగా ఆమె సంగీతానికి ఆకర్షితురాలయ్యారు. అయితే ఆమె వృత్తిపరంగా దాన్ని కొనసాగించలేదు. గ్రాడ్యుయేషన్ తర్వాత పూణేలోని సింబయాసిస్‌లో ఎంబిఏ పూర్తి చేశారు. కోర్సు పూర్తయిన వెంటనే ముంబైలో ఉన్న పీఆర్ కంపెనీలో చేరారు. అయితే రోజూ వెళ్లి రావడం గురించి తల్లిదండ్రులు ఆలోచించారు. కంపెనీ బాస్ వారిని స్వయంగా కలిసి ఒప్పించారు. అయితే శ్వేతకు కొన్ని సవాళ్లు ఎదురయ్యాయి. ముఖ్యంగా వర్షాకాలంలో టాక్సీ దొరకడం, దొరికినా లోపల వరకు రావడం వంటివి కష్టంగా మారాయి. చివరకు ఆమె ఉద్యోగాన్ని వదిలిపెట్టి స్వగ్రామానికి తిరిగి వచ్చేవారు. ఫ్రీలాన్స్ రచయితగా కెరీర్ ప్రారంభించారు. అలాగే తన న్యాయ వాద వృత్తిలో కూడా నిమగ్నమయ్యారు.

హాస్యనటన కోసం

శ్వేత స్నేహితురాలితో కలిసి 'గివ్ సమ్ స్పేస్' అనే ప్రాజెక్ట్‌లో పనిచేశారు. ఇందులో వారు ఎస్‌బీ రోడ్, ఫెర్గూసన్ కాలేజ్ రోడ్, పూణేలోని సమీప ప్రాంతాలలో ర్యాంప్‌లను ఏర్పాటు చేశారు. వీల్‌చైర్ వినియోగదారులకు పుస్తక దుకాణాలు, రెస్టారెంట్లు ఉపయోగించుకునేందుకు ఇవి ఎంతో ఉపయోగపడేవి. 2016లో తన హాస్యనటన కోసం స్నేహితులను స్క్రిప్ట్ రాయమని కోరారు. కానీ వారు తిరస్కరించారు. ఎందుకంటే శ్వేత పరిష్కరించాలను కుంటున్న సవాళ్లకు సంబంధించి వారు న్యాయం చేయలేమన్నారు. ఆమెనే రాయాల్సిందిగా ప్రోత్సహించారు. వారి సలహాతో ఓ స్క్రిప్ట్ రాసి ఈవెంట్‌లో ప్రదర్శించారు. సానుకూల స్పందన వచ్చింది. ఇది ఆమెను ముందుకు సాగేలా చేసింది.

రెస్ట్‌రూమ్ ప్రాజెక్ట్

న్యాయవాద పనిని కొనసాగిస్తూనే 'రెస్ట్‌రూమ్ ప్రాజెక్ట్' అనే ఆర్ట్ ఇన్‌స్టాలేషన్‌ను రూపొందించారు. ఈ కళాకృతి పూణేలోని వివిధ ప్రదేశాలలో ప్రదర్శించేందుకు సిద్ధమయ్యారు. టాయిలెట్ సీట్లు కాగితంతో రూపొందించబడ్డాయి. సందర్శకులు సీట్లను ఎత్తినప్పుడు, వారు ప్రతి రెస్ట్‌రూమ్‌కు సంబంధించిన నిర్దిష్ట సమస్యలను వైకల్యం కోణం నుండి వీక్షించ గలరు. ఆమె 2017లో ఓపెన్ మైక్‌తో కామెడీకి మరో షాట్ ఇచ్చారు. ప్రేక్షకుల నుండి చాలా ప్రేమను అందుకుంది. 'నేను వైకల్యం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలను కుంటున్నాను. అయితే కళారూపానికి కూడా అన్యాయం చేయకూడదను కుంటున్నాను' అని జతచేస్తున్నారు. ఆమె ప్రసంగించే అంశాల సున్నితత్వం కారణంగా ప్రజలు తన జోకులు విని నవ్వని సందర్భాలు ఉన్నాయని ఆమె అంగీకరించారు. అయితే కామెడీ, స్టోరీ టెల్లింగ్‌లోని సూక్ష్మ నైపుణ్యాలను నేర్చుకోవ డం ద్వారా ఈ ఛాలెంజ్‌ను ఎలా విజయవంతం చేయాలో తెలుసుకుంటున్నాని ఆమె చెప్పారు. ■

వైద్యులను రక్షించలేం

(మొదటిపేజీ తరువాయి)

విషయం తెలిసిందే. దీంతో దేశవ్యాప్తంగా వైద్యులు, వైద్య సిబ్బందిపై హింసకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలంటూ పలు డిమాండ్లు వినిపించాయి. హింసకు వ్యతిరేకంగా వైద్యులకు రక్షణ కల్పించాలంటూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ)తో పాటు పలు మెడికల్ అసోసియేషన్లు దేశవ్యాప్తంగా క్యాంపెయిన్‌ను నిర్వహించాయి. అయితే, ఇవేమీ పట్టని కేంద్రం.. ఎలాంటి ప్రత్యేక చట్టాన్ని రూపొందించటంలేదని తెలపటం గమనార్హం. వాస్తవానికి 2019లోనే ప్రత్యేక చట్టాన్ని కేంద్రం ప్రతిపాదించింది. ఆ తర్వాత దానిని రద్దు చేసిందన్న విషయం ఈ ఆర్టీఐ ప్రశ్నతో బహిర్గతమైంది. కేరళకు చెందిన సామాజికకార్యకర్త, వైద్యులు కె.వి బాబు ఆర్టీఐ చట్టం కింద సమాచారాన్ని కోరారు. 'ది హెల్త్‌కేర్ సర్వీసెస్ పర్సనల్ అండ్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (ప్రొహిబిషన్ ఆఫ్ వయోలెన్స్ అండ్ డ్యామేజ్ టు ప్రాపర్టీ) బిల్లు, 2019ను ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వ శాఖ రూపొందించిందనీ, సంప్రదింపుల కోసం దానిని సర్క్యులేట్ చేసిందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆర్టీఐ ప్రశ్నకు సమాధానంగా చెప్పింది. ఆ తర్వాత ప్రత్యేక చట్టాన్ని రూపొందించకూడదన్న నిర్ణయానికి వచ్చినట్టు వివరించింది. అయితే, ప్రభుత్వ వైఖరిని మమ్మల్ని నిరుత్సాహపర్చదని ఐఎంఏ జాతీయాధ్యక్షులు డాక్టర్ ఆర్.వి అశోకన్ అన్నారు. కేంద్ర చట్టం కోసం తాము తమ పోరాటాన్ని కొనసాగిస్తామని చెప్పారు.

రాజకీయాలకతీతంగా ఆదుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రాతిపదికన పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర బృందాలు వచ్చి సర్వే చేస్తాయని, తర్వాత కేంద్రం నిధులు ఇస్తుందన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించి కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్‌ఎస్ పార్టీ సహాయం చేయకపోవడమే కాకుండా వరదతో బురద రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్ దత్, బీజేపీ కిషన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తక్కలపల్లి నరేందర్, జిల్లా ఉపాధ్యక్షులు గుండా శ్రీనివాస్‌రెడ్డి, పాలేరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు చావా శివరామకృష్ణ, మాజీ జడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం సోమవారం నాడు తీవ్ర వాయుగుండంగా మారే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న తెలిపారు. సోమవారం సాయంత్రం, రాత్రి సమయంలో అది పూరి-దీఘాల మధ్య తీరం దాటే అవకాశం ఉందనీ, అది పశ్చిమ, వాయువ్య దిశగా సాగుతూ బెంగాల్, జార్ఖండ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్ మీదుగా కొనసాగే సూచనలున్నాయని తెలిపారు. తెలంగాణ మీదుగా నైరుతి రుతుపవనాలు చురుగ్గా కొనసాగుతున్నాయని చెప్పారు. వీటి ప్రభావం వల్ల రాష్ట్రంలో వచ్చే రెండు రోజుల పాటు మోస్తరు వర్షాలు పడే సూచనలున్నాయనీ, పలుజిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. గాలులు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని పేర్కొన్నారు. కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో పలుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు పడొచ్చు. ఈ మేరకు ఆ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. ఆదిలాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షం కురిసే అవకాశముంది.

హైడ్రా దడ..

నవతెలంగాణ-మియాపూర్/అమీన్‌పూర్

ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలపై హైడ్రా కొరడా ఝులిపిస్తున్నది. రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో ఆదివారం తెల్లవారుజామున నుంచే కూల్చివేతలను అధికారులు ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామ పరిధిలోని సున్నం చెరువులో అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్‌లో నిర్మించిన శాశ్వత భవనాలు మూడింటిని, తాత్కాలికంగా ఏర్పాటు చేసిన భారీ షెడ్లు 16కు పైగా నేలమట్టం చేశారు. గతంలో ఈ చెరువు కబ్జాలకు గురవుతుందని ప్రజాసంఘాల నాయకులు.. వివిధ శాఖల అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. చెరువుల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రాకు ఫిర్యాదులు అందాయి. దీనిపై స్పందించిన హైడ్రా ఆదివారం ఉదయం కూల్చివేతలను ప్రారంభించింది. ఒకవైపు కూల్చివేతలు చేపడుతుండగా చాలా రోజులుగా ఇక్కడ నివాసం ఉంటున్నామని, తమకు నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చివేతలు చేపడతారని స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే భారీ పోలీస్ బందోబస్తు మధ్య అధికారులు కూల్చివేతలను పూర్తి చేశారు.



శేరిలింగంపల్లి మండలపరిధిలో 26 ఎకరాల్లో విస్తరించి ఉన్న సున్నం చెరువు.. దాదాపు మాయమైపోయిందనే చెప్పాలి. ఈ చెరువు చాలాకాలంగా కబ్జాలకు గురవుతోంది. 2013లో సర్వే నిర్వహించిన ఇరిగేషన్ అధికారులు ఈ చెరువులో 15.23 ఎకరాల్లో నీళ్లు ఉన్నాయని నిర్ధారించారు. 2013లో హెచ్ఎండీఏ 4805 ఐడీ నంబర్ ఇచ్చింది. చెరువు ఎన్టీఎల్ పరిధిలోనే సర్వే నంబర్ 13, సర్వే నంబర్ 14, సర్వే నంబర్ 16 ఉన్నట్టుగా నిర్ధారించింది. ఆ సర్వే నంబర్లలోనే బఫర్ జోన్లు ఉన్నాయి. సున్నం చెరువు ఎన్టీఎల్, బఫర్ జోన్‌లను నిర్ధారిస్తూ 2014 మే 14న నోటిఫికేషన్ జారీ చేశారు. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా నిర్ధారించిన ఎన్టీఎల్‌కు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. కొందరు కబ్జారాయుళ్లు దాన్ని ముందుకు జరపగా.. ఇంకొందరు ఫెన్సింగే లేకుండా చేశారు. సర్వే నంబర్ 13, 14ల్లో చెరువు భూమి లేకుండా చేయగా, ప్రస్తుతం సర్వే నంబర్ 16పై కబ్జారాయుళ్ల కన్నుపడింది. ఎన్టీఎల్, బఫర్‌జోన్ లేకుండా చేయడానికి గత బీఆర్ఎస్ నేతల సూచనల మేరకు ఇలా రోడ్డు నిర్మించారన్న ఆరోపణలూ ఉన్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాలానగర్ మండలం అల్లాపూర్ రెవెన్యూ పరిధిలోకి వచ్చే ఈ చెరువు, రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని గుంట్లబేగంపేట రెవెన్యూ పరిధిలోనూ కొంత ఉంటుంది. రెండు జిల్లాల యంత్రాంగం పట్టించుకోకపోవడంతో కబ్జాకు గురైంది. అంతేకాదు, ఒకవైపు అక్రమ నిర్మాణాలు, మరోవైపు చెరువు పరిసర ప్రాంతాలను మట్టితో కప్పి బోర్లు వేసి నీటి వ్యాపారం చేస్తున్నారు. గతంలో రెవిన్యూ అధికారులు అడపాదడప నీటి వ్యాపారంపై చర్యలు తీసుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఒక్క సున్నం చెరువులోనే 700 ట్యాంకర్లతో వ్యాపారం జరుగుతుందని గతంలో అనేక ఆరోపణలు వచ్చినా పట్టించుకోలేదు. దుండిగల్‌లోని కొత్వా చెరువులో అక్రమంగా నిర్మిస్తున్న 11 డూప్లెక్స్ విల్లాలను అధికారులు తొలగించి రెండు ఎకరాల చెరువును తిరిగి స్వాధీనం చేసుకున్నారు.

అమీన్‌పూర్‌లో అక్రమ కట్టడాలపై హైడ్రా కొరడా..

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో ఇది వరకే పలు నిర్మాణాలు కూల్చేసిన అధికారులు.. తాజాగా మరిన్ని నిర్మాణాలను ఆదివారం నేలమట్టం చేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు అమీన్‌పూర్ పెద్దచెరువు సర్వే నంబర్ 322, 323, 324, 329లో ఆక్రమించిన ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలోని అక్రమ నిర్మాణాలను బుల్డోజర్లతో ఏకకాలంలో నేలమట్టం చేశారు. అంతేకాదు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డికి చెందిన 20 ఎకరాల భూములపై నజర్ పెట్టి కూల్చివేతలు చేశారు. కాంపౌండ్‌వాల్‌తో సహా గదులను సైతం నేలమట్టం చేశారు. తెల్లవారుజాము నుంచే రంగంలోకి దిగిన మూడు శాఖల అధికారులు పెద్దఎత్తున అక్రమ నిర్మాణాలను ధ్వంసం చేశారు. హైడ్రా కమిషనర్ గత వారం రోజుల కింద పర్యటించిన నేపథ్యంలో అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. చెరువులు, కుంటలు, నాళాలు ఆక్రమించి నిర్మించిన కట్టడాలను ఎట్టి పరిస్థితుల్లో వదిలేది లేదని హైడ్రా అధికారులు స్పష్టం చేశారు.

రైలు ప్రయాణం సురక్షితమా?

పట్టాలు తప్పిన జబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్.. క్షేమంగా బయటపడ్డ ప్రయాణికులు



భోపాల్: మధ్యప్రదేశ్‌లోన్ జబల్‌పూర్‌లో పెను ప్రమాదం తప్పింది. ఇండోర్-జబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కు చెందిన రెండు బోగీలు పట్టాలు తప్పాయి. శనివారం ఉదయం జబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ఇండోర్ నుంచి జబల్‌పూర్ వస్తున్నది. ఈ క్రమంలో జబల్‌పూర్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలు తప్పింది. అయితే రైలు చాలా తక్కువ స్పీడ్‌లో ఉన్నదని, ప్లాట్‌ఫామ్‌పై ఆగుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నది అధికారులు వెల్లడించారు. ప్రయాణికులంతా క్షేమంగానే ఉన్నారని చెప్పారు.అయితే రైలు దిగడానికి సిద్ధమవుతుండగా ఒక్కసారిగా కుదుపులకు లోనవడంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. ప్రమాదం గురించి సమాచారం అందుకు రైల్వే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పట్టాలు తప్పిన బోగీలను మళ్లీ ట్రాక్‌పైకి ఎక్కించేందుకు ప్రయత్నిస్తున్నారు.రైలు జబల్‌పూర్ స్టేషన్‌కు చేరుకోబోతుండగా దాని రెండు కోచ్‌లు పట్టాలు తప్పాయని రైల్వే పీఆర్‌వో హర్షిత్ శ్రీవాత్సవ చెప్పారు. ఆ సమయంలో రైలు వేగం గంటకు 5 కిలోమీటర్లుగా ఉందన్నారు. అందువల్ల పెద్ద ప్రమాదం జరుగలేదని తెలిపారు. అయితే ప్రమాదం జరుగడానికి గల కారణాలను తెలుసుకుంటున్నామని చెప్పారు. కాగా, రైలు పట్టాలు తప్పడంతో ఆ మార్గం గుండా వెళ్లాల్సిన ఇతర రైళ్ల రాకపోకలు అంతరాయం ఏర్పడింది.

ట్రైన్ కప్లింగ్ బ్రేక్..

రెండుగా విడిపోయిన మగధ్ ఎక్స్‌ప్రెస్

పాట్నా: ట్రైన్ కంపార్ట్‌మెంట్స్ మధ్య కప్లింగ్ బ్రేక్ అయ్యింది. దీంతో ఆ రైలు రెండుగా విడిపోయింది. ఈ నేపథ్యంలో ప్రయాణికులు భయాందోళన చెందారు. బీహార్‌లోని బక్సర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. న్యూఢిల్లీ నుంచి ఇస్లాంపూర్‌కు వెళ్తున్న మగధ్ ఎక్స్‌ప్రెస్‌కు కప్లింగ్ తెగిపోయింది. దీంతో ట్వినిగంజ్, రఘునాథ్‌పూర్ రైల్వే స్టేషన్ల మధ్య ఆ రైలు రెండుగా విడిపోయింది. ఆదివారం ఉదయం 11.08 గంటల సమయంలో ఈ సంఘటన జరిగినట్టు రైల్వే అధికారులు తెలిపారు. అయితే ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగలేదని చెప్పారు. 'రైలు ట్వినిగంజ్ స్టేషన్ దాటినప్పుడు ఈ సంఘటన జరిగింది. రైలు ఇంజన్ నుంచి 13, 14వ కంపార్ట్‌మెంట్స్ అయిన ఎస్-7, ఎస్-6 కోచ్‌ల మధ్య కప్లింగ్ బ్రేక్ అయ్యింది. ఆ రైలు రెండుగా విడిపోయింది' అని ఈస్ట్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (సీపీఆర్‌వో) సరస్వతి చంద్ర వెల్లడించారు.కాగా, రెస్క్యూ టీమ్, సాంకేతిక బందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయని రైల్వే అధికారులు తెలిపారు. సమస్యను సరిచేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. రైలు కప్లింగ్ బ్రేక్‌పై దర్యాప్తు జరుపుతున్నట్టు వెల్లడించారు. ఈ సంఘటన వల్ల డౌన్‌లైన్‌లో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్టు వివరించారు.

యూఎస్‌లో రాహుల్

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ యూఎస్ పర్యటన మొదలైంది. ఆదివారం ఆయన యూఎస్‌లో అడుగు పెట్టారు. మూడు రోజుల పాటు ఆ దేశంలో రాహుల్ పర్యటించనున్నారు. ఆయన రాక సందర్భంగా అక్కడి ప్రవాసీ భారతీయులు, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్(ఐఓసీ) సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. యూఎస్ పర్యటనలో తనకు స్వాగతం పలికిన చిత్రాలను సోషల్ మీడియా వేదికగా రాహుల్ పంచుకున్నారు. టెక్సాస్, డల్లాస్‌లో తనకు లభించిన స్వాగతం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నానని రాహుల్ రాసుకొచ్చారు. ఈ పర్యటనలో రెండు దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేసే అర్థవంతమైన చర్చలు, అంతర్‌దృష్టితో కూడిన సంభాషణలలో పాల్గొనేందుకు తాను ఎంతో ఆసక్తితో చూస్తున్నానని ఆయన వివరించారు. భారత్‌లో లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తర్వాత అమెరికా పర్యటనకు రావటం రాహుల్‌కు ఇదే తొలిసారి. ఆదివారం డల్లాస్, టెక్సాస్‌లో, 9,10 తేదీలలో వాషింగ్టన్ డిసి లలో రాహుల్ పర్యటించనున్నారు. కాగా, రాహుల్ వెంట ఐఓసీ చీఫ్ శామ్ పిట్రోడా ఉన్నారు.

నలిమెల భాస్కర్‌కు కాళోజీ పురస్కారం

(మొదటిపేజీ తరువాయి)

సర్కార్ ఎంపిక చేసింది. ఈ నెల తొమ్మిదిన హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో అవార్డును ప్రధానం చేయనున్నారు. ఈ పురస్కారం కింద రూ.1,01,116 నగదుతో పాటు ప్రశంసా పత్రాన్ని ప్రధానం చేస్తారు.

రైతు రుణమాఫీ సగం కూడా కాలేదు

(మొదటిపేజీ తరువాయి)

రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

పబ్లిక్ అకౌంట్స్ కమిటీని వెంటనే ప్రకటించాలి

పబ్లిక్ అకౌంట్స్, అండర్ టేకింగ్, ఎస్టిమేట్ కమిటీలను వెంటనే ప్రకటించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మూడు కమిటీలకు సంబంధించిన ప్రక్రియ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పూర్తయిందనీ, 38 రోజులు గడుస్తున్నా వాటిపై ఎందుకు నిర్ణయం తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఢిల్లీలో కాంగ్రెస్ నేత వేణుగోపాల్ పీఏసీ చైర్మెన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని గుర్తు చేశారు. ఢిల్లీలో ఒక నీతి, తెలంగాణలో మరో నీతి కాంగ్రెస్ ప్రదర్శిస్తున్నదని ఆరోపించారు. రాజ్యాంగం గురించి మాట్లాడే రాహుల్ గాంధీ తెలంగాణలో జరుగుతున్న రాజ్యాంగేతర పనుల గురించి ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. మండలిలో ప్రతిపక్ష నేతగా మధుసూధనాచారి పేరిచ్చి 40 రోజులు గడుస్తున్నా ఇంకా నిర్ణయం తీసుకోలేదని గుర్తు చేశారు. స్పీకర్ పార్టీల కతీతంగా సరైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

ప్రకాశం బ్యారేజీకి మళ్లీ వరద



గుంటూరు : ప్రకాశం బ్యారేజీకి మళ్లీ వరద పోటు పెరిగింది. ఎగువ నుంచి 4.50 లక్షల క్యూసెక్కులు ఆదివారం రాగా వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి 2.86 లక్షల క్యూసెక్కులు రాగా 2.79 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. దిగువ నాగార్జునసాగర్‌కు 2.60 లక్షల క్యూసెక్కుల వరద రాగా అదే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల జలాశయయానికి 2.09 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా 2.02 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేశారు. పులిచింతల దిగువన కురుస్తున్న వర్షాలతో పాటు ఖమ్మం జిల్లా మున్నేరు వాగుతో పాటు కట్టలేరు ప్రవాహం కూడా కలవడంతో ప్రకాశం బ్యారేజీకి 2.48 లక్షల క్యూసెక్కులు వచ్చి కలవడంతో నాలుగున్నర లక్షల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో వచ్చిన నీటిని వచ్చినట్టు సముద్రం లోకి విడుదల చేస్తున్నారు.



పారిస్ పారాలింపిక్స్‌లో టీమ్ ఇండియా సరికొత్త శిఖరాలు అధిరోహించేందుకు రంగం సిద్ధం చేసుకుంది. పారాలింపిక్స్ చరిత్రలోనే అత్యధికంగా 29 పతకాలు ఖాతాలో వేసుకుంది. జావెలియన్ త్రోలో నవదీప్ సింగ్ బంగారు పతకం సొంతం చేసుకోగా.. పరుగు పందెంలో సిమ్రన్ శర్మ కాంస్య పతకం సాధించింది. ఏడు బంగారు, తొమ్మిది రజత, పదమూడు కాంస్య పతకాలు భారత పారా అథ్లెట్లు సాధించారు.

నవదీప్ పసిడి త్రో

- జావెలిన్ త్రోలో బంగారు పతకం
- 200మీ రేసులో సిమ్రన్‌కు కాంస్యం

పారిస్ 2024 పారాలింపిక్స్



నవతెలంగాణ-పారిస్

2024 పారాలింపిక్స్‌లో భారత జోరు కొనసాగుతుంది. పోటీల చివరి రోజు సైతం భారత పారా అథ్లెట్లు పతక వేటలో అసమాన ప్రదర్శన చేశారు. జావెలిన్ త్రోలో నవదీప్ సింగ్ బంగారు పతకం గెల్చుకోగా.. 200 మీటర్ల పరుగు పందెంలో సిమ్రన్ శర్మ కాంస్య పతకం సొంతం చేసుకుంది. పారిస్ పారాలింపిక్స్‌లో భారత్ ఇప్పటివరకు 29 పతకాలు సొంతం చేసుకుని.. పారాలింపిక్స్ చరిత్రలోనే అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది.

నవదీప్.. సూపర్ త్రో

2020 టోక్యో పారాలింపిక్స్ నవదీప్ సింగ్‌కు తీరని వ్యథ మిగిల్చింది. పురుషుల జావెలిన్ త్రో ఎఫ్41 విభాగంలో నవదీప్ సింగ్ నాల్గో స్థానంలో నిలిచాడు. కాంస్య పతకం సాధించిన ఇరాక్ పారా అథ్లెట్ విల్డన్ 41.39 మీటర్ల త్రోతో మూడో స్థానంలో నిలువగా.. 40.80 మీటర్ల త్రోతో నవదీప్ సింగ్ నాల్గో స్థానంలో నిలిచాడు. సెంటమీటర్ల వ్యత్యాసంతో పారాలింపిక్స్ పతకానికి దూరమయ్యాడు. మూడేండ్ల తర్వాత పారిస్ పారాలింపిక్స్‌లో కథ మార్చివేశాడు నవదీప్. టోక్యోలో జరిగిన దానికి పూర్తి భిన్నంగా పారిస్‌లో జరిగింది. పురుషుల జావెలిన్ త్రో ఎఫ్41 విభాగంలో నవదీప్ సింగ్ నిజానికి రెండో స్థానంలో నిలిచాడు. 47.32 మీటర్ల త్రోతో సిల్వర్ మెడల్ సొంతం చేసుకున్నాడు. కానీ ఇరాన్‌కు చెందిన పారా అథ్లెట్ 47.64 మీటర్ల దూరంతో బంగారు పతకం సాధించాడు. కానీ పసిడి సాధించిన ఆనందంలో అతడు పారాలింపిక్స్ క్రీడల నిబంధనలకు విరుద్ధంగా గుర్తింపు లేని రాజ్యం జాతీయ పతాకం ప్రదర్శించటంతో అతడిపై అనర్హత వేటు వేశారు. దీంతో రెండో స్థానంలో నిలిచిన నవదీప్ సింగ్‌కు బంగారు పతకం దక్కింది. డిఫెండింగ్ చాంపియన్, చైనా పారా అథ్లెట్ సన్ కాంస్య పతకాన్ని సిల్వర్ మెడల్ చేసుకోగా.. నాల్గో స్థానంలో నిలిచిన నుకుల్‌వాయ్ కాంస్య పతకం సాధించాడు. 23 ఏండ్ల నవదీప్ సింగ్ తొలినాళ్లలో జావెలిన్‌పై మక్కువ చూపించలేదు. తండ్రి దల్బీర్ సింగ్ బాటలోనే నడిచి రెజ్లింగ్‌లో సాధన చేశాడు. జాతీయ స్థాయిలో కొన్ని టోర్నమెంట్లలోనూ పోటీపడ్డాడు. కానీ మరో పారా జావెలిన్ త్రోయర్ సందీప్ చౌదరిని చూసి స్ఫూర్తి పొందిన నవదీప్ సింగ్ జావెలిన్ త్రోను కెరీర్‌గా ఎంచుకున్నాడు. నాలుగు అడుగుల నవదీప్ సింగ్‌కు ఆరంభంలో ఏడు అడుగుల జావెలియన్‌ను పట్టుకోవటం కాస్త ఇబ్బందిగా ఉండేది. కానీ ఒక్కసారి సాధన షురూ చేశాక ఎక్కడా వెనక్కి తగ్గలేదు. 2024 పారిస్ పారాలింపిక్స్‌లో ఏకంగా పసిడి పతకంతో సరికొత్త చరిత్ర సృష్టించాడు.

సిమ్రన్.. కాంస్య పరుగు

ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో భారత్‌కు మరో మెడల్ లభించింది. మహిళల 200 మీటర్ల టీ12 విభాగం ఫైనల్లో సిమ్రన్ శర్మ కాంస్య పతకం సాధించింది. ఈ విభాగంలో వరల్డ్ చాంపియన్‌గా పతక వేటకు బరిలోకి దిగిన సిమ్రన్ శర్మ.. తొలి ప్రయత్నంలోనే పారాలింపిక్స్ పతకం సొంతం చేసుకుంది. 100 మీటర్ల టీ12 విభాగం ఫైనల్లో నాల్గో స్థానంలో నిలిచి 0.05 సెకండ్ల తేడాతో పతకం చేజార్చుకున్న సిమ్రన్ శర్మ.. 200 మీటర్ల విభాగంలో మెడల్ పోడియంపై నిలిచింది. 24.75 సెకండ్లలో రేసును పూర్తి చేసిన సిమ్రన్ శర్మ..భారత పతకాల సంఖ్యను 29కు మెరుగుపర్చింది. క్యూబా పారా స్ప్రింటర్ ఓమర 23.62 సెకండ్లతో బంగారు పతకం గెల్చుకుంది. వెనుజులా పారా స్ప్రింటర్ లోపెజ్ సిల్వర్ మెడల్ సాధించింది.

బెలారస్ భామ, రెండో సీడ్ అర్యాన సబలెంకా ఎట్టకేలకు సాధించింది. యు.ఎస్ ఓపెన్‌లో గత మూడేండ్లుగా నిరాశ చవిచూసిన సబలెంకా.. 2024 సీజన్‌లో అదరగొట్టింది. నిరుడు ఫైనల్లో రన్నరప్‌గా నిలిచిన సబలెంకా.. అంతకుముందు వరుస సీజన్లలో సెమీఫైనల్లోనే నిష్క్రమించింది. అమెరికా అమ్మాయి, తొలిసారి గ్రాండ్‌స్లామ్ ఫైనలిస్ట్ జెస్సికా పెగులాపై ఉత్కంఠ విజయం సాధించిన సబలెంకా మహిళల సింగిల్స్ చాంపియన్‌గా అవతరించింది.

చాంపియన్ సబలెంకా

- మహిళల సింగిల్స్ టైటిల్ కైవసం
- ఫైనల్లో జెస్సికా పెగులాపై గెలుపు
- యు.ఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

నవతెలంగాణ-న్యూయార్క్



మహిళల సింగిల్స్ టైటిల్‌ను రెండో సీడ్ బెలారస్ స్టార్ అర్యాన సబలెంకా సొంతం చేసుకుంది. సుమారు రెండు గంటల పాటు సాగిన ఉత్కంఠభరిత టైటిల్ పోరులో సబలెంకా కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. ఆరో సీడ్ అమెరికా అమ్మాయి జెస్సికా పెగులాపై 7-5, 7-5తో వరుస సెట్లలో విజయం సాధించింది. తొలిసారి యు.ఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ కిరీటం దక్కించుకుంది. సబలెంకా కెరీర్‌లో ఇది మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్ విజయం కాగా.. ఈ సీజన్‌లోనే రెండోది. ఈ ఏడాది ఆరంభంలో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ సాధించిన సబలెంకా టెన్నిస్ ఓపెన్ చరిత్రలో ఓ సీజన్‌లో రెండు హార్డ్‌కోర్టు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు (ఆస్ట్రేలియన్, యు.ఎస్ ఓపెన్) సాధించిన ఐదో క్రీడాకారిణిగా నిలిచింది.

అద్యంతం ఉత్కంఠ : మహిళల సింగిల్స్ ఫైనల్ అంచనాలకు భిన్నంగా సాగింది. తొలిసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో పోటీపడిన జెస్సికా పెగులా కండ్లుచెదిరే పోరాట పటిమ చూపించింది. ఆఖరు పాయింట్ వరకు గట్టి పోటీ ఇచ్చింది. రెండు గంటల టైటిల్ పోరులో సబలెంకా ఎక్కడా సులువుగా పాయింట్లు సాధించలేదు. ప్రతి పాయింట్ కోసం చెమటోడ్చక తప్పలేదు. నెట్ గేమ్ వద్ద పెగులాపై పైచేయి సాధించిన సబలెంకా.. ఫైనల్లో విజయం సాధించింది. నెట్ వద్ద సబలెంకా 18 పాయింట్లు సాధించగా.. పెగులా కేవలం ఐదు పాయింట్లు సాధించింది. సబలెంకా రెండు సెట్లలో ఏకంగా ఆరు సార్లు పెగులా సర్వ్‌ను బ్రేక్ చేసింది. పెగులా సైతం నాలుగు బ్రేక్ పాయింట్లు సాధించినా.. సబలెంకాపై పైచేయి సాధించటంలో విఫలమైంది. సబలెంకా ఆరు ఏస్‌లు కొట్టగా.. జెస్సికా నాలుగు ఏస్‌లు సంధించింది. విన్నర్ల పరంగా సబలెంకా 40 విన్నర్లు గెలుపొందగా.. జెస్సికా 17 విన్నర్లను మాత్రమే గెల్చుకుంది. పాయింట్ల పరంగా 88-79తో సబలెంకా పైచేయి సాధించింది.

దీప్తికి రూ. కోటి నజరానా

గ్రూప్-2 ఉద్యోగం సైతం.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన



నవతెలంగాణ-హైదరాబాద్/పర్వతగిరి : పారాలింపిక్స్‌లో పతకం సాధించి భారత దేశం గర్వపడేలా చేసిన తెలంగాణ ముద్దుబిడ్డ, పారా అథ్లెట్ దీప్తి జీవాంజికి రాష్ట్ర ప్రభుత్వం భారీ నగదు ప్రోత్సాహకం ప్రకటించింది. పారిస్ పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన దీప్తి జీవాంజి శుక్రవారం హైదరాబాద్‌కు చేరుకోగా.. అభిమానులు, శాట్జ్ యంత్రాంగం భారీ స్థాయిలో స్వాగతం పలికిన సంగతి తెలిసిందే. శనివారం ఉదయం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని దీప్తి జీవాంజి ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా పారాలింపిక్స్‌లో పతకం సాధించిన దీప్తి జీవాంజిని, ఆమె కోచ్ నాగపురి రమేశ్‌ను సీఎం అభినందించారు. తెలంగాణ గర్వపడే పతక ప్రదర్శన చేసినందుకు దీప్తి జీవాంజికి రూ. 1 కోటి నగదు ప్రోత్సాహకంతో పాటు జీవనోపాధికి గ్రూప్-2 ఉద్యోగం ప్రకటించారు. కోచ్ నాగపురి రమేశ్‌కు రూ.10 లక్షల నగదు ప్రోత్సాహకం సైతం ప్రకటించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. పారాలింపిక్స్ చాంపియన్ దీప్తి జీవాంజికి నగదు ప్రోత్సాహకంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం కల్పించటం పట్ల క్రీడా వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. సీఎంను కలిసిన వారిలో.. శాట్ చైర్మెన్ శివసేనారెడ్డి, ఎంపీ బలరాంనాయక్, దీప్తి తల్లిదండ్రులు యాదగిరి, ధనలక్ష్మి, కోచ్ నాగపురి రమేష్, అథ్లెటిక్ మృదుల, వర్ధన్నపేట కాంగ్రెస్ అధికార ప్రతినిధి శేఖర్‌రావు, కల్లెడ గ్రామ పార్టీ అధ్యక్షులు ముదురకోల రమేష్, వడ్లకొండ రమేష్, మేడగాని యాకయ్య, ఎన్నమనేని వెంకటేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

చైనాతో విజయంతో షురూ

3-0తో భారత్ ఘన విజయం
ఆసియా హాకీ చాంపియన్స్ ట్రోఫీ

హులన్‌బిర్ (చైనా) : హాకీ ఆసియా చాంపియన్స్ ట్రోఫీని డిఫెండింగ్ చాంపియన్ టీమ్ ఇండియా విజయంతో మొదలెట్టింది. ఆదివారం చైనాలోని హులన్‌బిర్ నగరంలో ఆరంభమైన ఆసియా చాంపియన్స్ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో ఆతిథ్య చైనాపై భారత్ ఎదురులేని విజయం సాధించింది. 3-0తో సూపర్ విక్టరీ నమోదు చేసింది. సుఖ్‌జిత్ సింగ్, ఉత్తమ్ సింగ్, అభిషేక్‌లు గోల్స్ నమోదు చేసి భారత్‌ను గెలుపు పథంలో నడిపించారు. అనుభవలేమి, యువ చైనా జట్టును భారత్ ఉక్కిరిబిక్కిరి చేసింది. గోల్ అవకాశాలు సృష్టించుకోవటంలో చైనా తేలిపోయింది. 14వ నిమిషంలో సుఖ్‌జిత్ గోల్ కొట్టగా.. 27వ నిమిషంలో ఉత్తమ్ సింగ్ స్కోరును రెట్టింపు చేశాడు. అభిషేక్ మూడో గోల్‌తో భారత్ గెలుపును లాంఛనం చేసుకుంది. సోమవారం జరిగే మరో మ్యాచ్‌లో జపాన్‌తో భారత్ తలపడనుంది.



ఉత్సాహంగా ఫుట్‌బాల్ క్లినిక్

హైదరాబాద్ : తెలంగాణలో ఫుట్‌బాల్ క్రీడకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్జ్) ఆదివారం ఫుట్‌బాల్ క్లినిక్‌ను నిర్వహించింది. తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీలో శిక్షణ పొందుతున్న యువ సాకర్ క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, ఎండీ సోనీ బాలాదేవి ఫుట్‌బాల్ క్లినిక్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఫుట్‌బాల్ కోచ్‌లు మహేశ్, బెనిటో, శాట్జ్ కోచ్‌లు రాంబాబు, రతన్ కుమార్, వినోద్, ప్రసాద్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



ప్రేక్షకులకు ధన్యవాదాలు

నివేద థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం '35-చిన్న కథ కాదు'. సురేష్ ప్రొడక్షన్స్, ఎస్ ఒరిజినల్స్, వాల్టెయిర్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించిన ఈ చిత్రానికి నంద కిషోర్ ఈమాని రైటర్, డైరెక్టర్. ఈనెల 6న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించి బ్లాక్‌బస్టర్ హిట్ అందుకుంది.


ఈ సందర్భంగా నిర్వహించిన థ్యాంక్స్ మీట్‌లో ప్రజెంటర్ రానా దగ్గుబాటి మాట్లాడుతూ,' ఈ సక్సెస్ చాలా తృప్తిని ఇచ్చింది. నివేద థామస్ అద్భుతంగా నటించింది. సురేష్ ప్రొడక్షన్ 'పిట్టగోడ' ద్వారానే విశ్వదేవ్ లాంచ్ అయ్యాడు. ఇందులో తన నటన సర్‌ప్రైజ్ చేసింది. చాలా సంవత్సరాల తర్వాత కిడ్స్, ఫ్యామిలీస్‌ని థియేటర్స్‌లో హౌస్‌ఫుల్‌గా చూడటం చాలా ఆనందంగా ఉంది. దర్శకుడు నందు వల్లే ఇది సాధ్యమైంది. సినిమాని ఆదరిస్తున్న ఆడియన్స్ అందరికీ థ్యాంక్స్' అని అన్నారు.

'మేము చాలా థియేటర్స్‌ని విజిట్ చేశాం. అన్నిచోట్ల సినిమా ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని పంచుతోంది. కిడ్స్, ఫ్యామిలీస్ అందరూ వచ్చి ఇది చిన్న సినిమా కాదని చెప్పడం గొప్ప ఆనందాన్ని ఇచ్చింది' అని హీరోయిన్ నివేద థామస్ చెప్పారు. హీరో విశ్వదేవ్ మాట్లాడుతూ,'ఒక మంచి సినిమా వస్తే ఆడియన్స్, మీడియా ఎంత గొప్పగా సపోర్ట్ చేస్తారో మరోసారి ఈ సినిమాతో ప్రూవ్ అయ్యింది' అని తెలిపారు.

'సినిమాకి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తుంది' అని డైరెక్టర్ నంద కిషోర్ ఈమాని చెప్పారు. నిర్మాత సిద్ధార్థ్ రాళ్లపల్లి మాట్లాడుతూ,'ఇంతమంది ఫ్యామిలీ ఆడియన్స్‌తో థియేటర్స్‌కి రావడం, సినిమాని అనుభూతి చెందడం చూస్తుంటే మా మనసు నిండిపోయింది' అని అన్నారు. 'ఇంత యునానిమస్‌గా సినిమాకి అద్భుతంగా రివ్యూస్ రావడం ఆనందంగా ఉంది' అని నిర్మాత సృజన్ యరబోలు చెప్పారు.

నవచిత్రం

విజువల్ ట్రీట్‌గా సుబ్రహ్మణ్య



అద్వయ్

నటుడు, డబ్బింగ్ ఆర్టిస్ట్ పి.రవిశంకర్ తన దర్శకత్వంలో 'సుబ్రహ్మణ్య' సినిమాతో తన కుమారుడు అద్వయ్‌ని హీరోగా పరిచయం చేస్తున్నారు. ఎస్‌జి మూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై తిరుమల్ రెడ్డి, అనిల్ కడియాల ఈ సోషియో ఫాంటసీ అడ్వెంచర్‌ను నిర్మిస్తున్నారు. ప్రవీణ కడియాల, రామలక్ష్మి సమర్పణలో ఇటీవల విడుదల చేసిన ప్రీ-లుక్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. వినాయక చతుర్ధి సందర్భంగా నిర్మాతలు ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు.

కన్నడ సూపర్ స్టార్ డా. శివ రాజ్‌కుమార్ లాంచ్ చేసిన పోస్టర్‌లో అద్వయ్‌ని టైటిల్ రోల్‌లో సుబ్రహ్మణ్యగా పరిచయం చేశారు. విజువల్ ట్రీట్‌లా ఉన్న ఫస్ట్ లుక్ పోస్టర్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

ఈ చిత్రం ఇప్పటికే 60% నిర్మాణాన్ని పూర్తి చేసుకుంది. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు ముంబయిలోని ప్రముఖ రెడ్ చిల్లీస్ స్టూడియోలో శరవేగంగా జరుగుతున్నాయి. ముంబై, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నుంచి ప్రముఖ స్టూడియోలలో వీఎఫ్ఎక్స్, సీజీ పనులు జరుగుతున్నాయి. పాన్ ఇండియా మూవీగా తెలుగు, కన్నడ, తమిళం, మలయాళం, హిందీభాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రానికి దర్శకత్వం: పి.రవిశంకర్, సంగీతం: రవి బస్రూర్, డిఓపి: విఘ్నేష్ రాజ్, ఎడిటర్: విజయ్ ఎం కుమార్, ప్రొడక్షన్ డిజైనర్: ఉల్లాస్ హైదూర్.

రామ్‌నగర్ బన్నీ



చంద్రహాస్ హీరోగా నటిస్తున్న సినిమా 'రామ్ నగర్ బన్నీ'. విస్మయశ్రీ , రిచా జోషి, అంబికా వాణి, రితూ మంత్ర హీరోయిన్స్‌గా నటిస్తున్నారు.

ఈ చిత్రాన్ని దివిజ ప్రభాకర్ సమర్పణలో మలయజ ప్రభాకర్, ప్రభాకర్ పొడకండ నిర్మిస్తున్నారు. శ్రీనివాస్ మహత్ (వెలిగొండ శ్రీనివాస్) దర్శకత్వం వహిస్తున్నారు.

అక్టోబర్‌లో ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఆదివారం ఈ చిత్ర ఫస్ట్ లుక్, గ్లింప్స్ రిలీజ్ ఈవెంట్‌ను రామానాయుడు స్టూడియోలో నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకలో వరద బాధితుల సహాయార్థం తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి తన వంతు ఆర్థిక సహాయాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కి హీరో చంద్రహాస్ అందజేశారు.

హీరో చంద్రహాస్ మాట్లాడుతూ, 'ప్రస్తుతం మూడు సినిమాల్లో నటిస్తున్నా. వాటిలో ఫస్ట్ మూవీగా ఇది మీ ముందుకు రాబోతోంది. అక్టోబర్‌లోనే రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నాం. యూత్, ఫ్యామిలీకి.. అందరికీ నచ్చుతుంది. అలాగే ఈ సినిమా కలెక్షన్స్‌లో 10 శాతం కూడా వరద బాధితుల సహాయార్థం అందిస్తాం. నేను రియల్‌గా, రీల్ లైఫ్‌లోనూ ఒకేలా ఉంటాను. అలా ఉండటం చాలా మందికి నచ్చడం లేదు. నా ప్రతిభతో మా నాన్నకి మరింత మంచి పేరు తీసుకొస్తాను' అని చెప్పారు.

ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్ - రాజశేఖర్, ఎడిటింగ్ - మార్తాండ్ కె వెంకటేష్, సినిమాటోగ్రఫీ- అష్కర్ అలీ, మ్యూజిక్ డైరెక్టర్ - అశ్విన్ హేమంత్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ - విజయ్, సమర్పణ - దివిజ ప్రభాకర్, నిర్మాతలు - మలయజ ప్రభాకర్, ప్రభాకర్ పొడకండ.



మాట్లాడుతున్న కట్టా నర్సింహ



సాయుధ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి
- నాటి మహోత్తర పోరాటానికి ఇంధనం ప్రజా కళలే : ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు వేముల ఆనంద్
- శౌర్యయాత్రకు స్వాగతం పలికిన నల్లగొండ కళాకారులు



నల్లగొండ : భూమి, భుక్తి ,విముక్తి నినాదంతో ఆరంభమైన తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిని నేటి యువత కొనసాగించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు

ఆదివారం ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న శౌర్య యాత్ర నల్లగొండ పట్టణానికి చేరుకున్న సందర్భంగా సుభాష్ విగ్రహం దగ్గర ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ వెట్టి చాకిరికి వ్యతిరేకంగా సామాజిక న్యాయ సాధన, అక్షరాస్యత, అందరికీ అభివృద్ధి, సమసమాజ స్థాపన అనేదిశగా సాయుధపోరాటం సాగిందని అన్నారు. తొలుత ఆంధ్ర మహాసభ అండతో సాంస్కృతిక సమరంగా మొదలై(1946 జులై 4న) కడివెండిలో దొడ్డి కొమరయ్య అమరత్వంతో సాయుధ పోరాట ఫిరంగులై పేలింది అని అన్నారు. ఈ మహోజ్జ్వల పోరాటంలో దొరలు, జాగిర్దారుల దౌర్జన్య క్రీడలు, నిజాం సేనల నిరంకుశ దాడులు, రజాకార్ల దోపిడీ అకృత్యాలు , నెహ్రూ సైన్యాల అరాచకాల అన్నింటినీ మట్టి కల్పించిన వీరులను స్మరించుకుంటూ, నేటి పాలకులు నాటి చరిత్రను వక్రీకరిస్తూ హిందూ ముస్లిం మత తగాదాగా చూపిస్తున్న విష ప్రచారాన్ని తిప్పి కొడుతూ శౌర్య యాత్ర సాగుతోందని అన్నారు.

ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు వేముల ఆనంద్ మాట్లాడుతూ నాలుగువేల మంది అమరుల రక్తతర్పణతో మూడువేల గ్రామాల్లో ప్రజారాజ్య స్థాపన, పది లక్షల ఎకరాల భూ పంపిణీ ,వెట్టిచాకిరి రద్దు ఇలా అనేక విజయాలు వీర తెలంగాణ సాయుధ పోరాటం సాధించిందని అన్నారు. నిజాం రజాకార్లను నెహ్రూ సైన్యాలను మట్టికరిపించి ఈ నేలను వీర భూమిగా రూపుదిద్దిందని అన్నారు. నాటి మహోత్తర పోరాటానికి ఇంధనం ప్రజా కళలే అని అన్నారు. తెలంగాణ అమరులను స్మరించుకునేందుకు ఉద్యమ పల్లెల్ని, యోధుల సమాధుల్ని సందర్శించేందుకు ఆటపాటల్లో వారి ఆశయాలను నెమరు వేసుకొని రేపటి దిశగా నడిపించేందుకు శౌర్య యాత్ర చేపట్టామని అన్నారు

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హాశం, చిన్నపాక లక్ష్మీనారాయణ, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాంపల్లి చంద్రమౌళి, కుమ్మరి శంకర్ , రాష్ట్ర కమిటీ సభ్యురాలు చింతల విజయ, సీపీ(ఐ)ఎం జిల్లా కమిటీ సభ్యులు దండెంపల్లి సత్తయ్య, పుచ్చకాయల నర్సిరెడ్డి, పోలే సత్యనారాయణ, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు ఎం జె వినోద్ కుమార్, వేల్పుల వెంకన్న, శివ, చరణ్ తదితరులు పాల్గొన్నారు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-చింతకాని

వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వచ్చిన వరదల వల్ల ఇండ్లు మునిగిపోయి, సర్వం కోల్పోయిన ప్రతి బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని, అందుకోసం ఎంతైనా ఖర్చు చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఆదివారం ఆయన చింతకాని, బోనకల్, ముదిగొండ మండలాల్లో పర్యటించి.. ముంపునకు గురైన పొలాలు, రోడ్లను పరిశీలించారు. తొలుత చింతకాని మండలంలోని మత్కేపల్లి, నామవరం మున్నేటి బ్రిడ్జి పక్కన ముంపునకు గురైన పంట పొలాలను, వరదల వల్ల తెగిపోయిన చెరువు కట్టలను, రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా మొత్తం అతలాకుతలమైందన్నారు. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు బయటకు రాకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. భారీ వర్షాల వల్ల వచ్చిన వరదలు కారణంగా చాలామంది రైతులు పంటలు నష్టపోయి ఉన్నారన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం అండగా ఉండి ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఇప్పటికే అధికారులకు పంట నష్టం అంచనా వేయాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వర్లు, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు మడిపల్లి భాస్కర్, కొప్పుల గోవిందరావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు నాగార్జున, ఎంపీపీ పూర్ణయ్య, మహిళ సంఘం మండల అధ్యక్షులు తస్నీరు ప్రగతి, వైరా ఏసీపీ ఎస్ కే రెహమాన్, సీఐ సాగర్, చింతకాని ఎస్ఐ ఎస్.కె నాగుల మీరా తదితరులు ఉన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- నష్టం అంచనా వేయాలని ఆదేశాలు ఇచ్చాం
- బాధితులను ఆదుకునేందుకు ఎంతైనా ఖర్చు చేస్తాం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ముంపునకు గురైన పొలాలు, రోడ్లు పరిశీలన

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886